గురువారం
29-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 99
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కరుడుగట్టిన బోల్షివిక్ భవానీసేన్ 7లో

నిరంతర జ్ఞాన తృష్ణ

చీలికే మన బలహీనత

ఐక్యతే బలం

27 మంది ఔట్?

- వచ్చే సమీక్షకు మెరుగు పడాలి
- కొందరు తీరు మార్చుకోవాలి
- గడపగడపకూ సమీక్షలో జగన్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: 'మీ తీరు మారాల్సిందే... నాతో కలిసి పనిచేయాల్సిందే... లేదంటే కష్టం... ఆ 27 మంది ఎమ్మెల్యేలు పనితీరు బాగాలేదు..' అని వైసీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ ఘాటుగా హెచ్చరించారు. గడప గడపకూ మన ప్రభుత్వంపై తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్ మంత్రులు, పార్టీ సమన్వయకర్తలను ఉద్దేశించి సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. పనితీరు మార్చుకోకుంటే టికెట్లు ఇవ్వబోనంటూ హెచ్చరించారు. ఎన్నికలకు ఆర్నెళ్ల ముందే సీటు ఇవ్వని వారి పేర్లను ప్రకటిస్తానన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెనుకబాటుకు గురైన 27 మంది ఎమ్మెల్యేలను ఆయన మందలించారు. ప్రజల వద్దకెళ్లి వాళ్ల సమస్యలు తెలుసుకుని, సత్వర పరిష్కారం చేయాల్సిన ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, ఆయన గట్టిగా ప్రజాప్రతినిధులను హెచ్చరించారు. వారంలో నాలుగు రోజుల చొప్పున, నెలకు 16 రోజులు కూడా తిరగకపోతే ఎలా అంటూ 27 మంది ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటా రెండు గంటలు కాదనీ, ఏడు నుంచి ఎనిమిది గంటలు గ్రామాల్లో తిరగాలన్నారు. అదే గ్రామంలో పార్టీ నేతల ఇళ్లల్లో భోజనాలు చేయాలని, ప్రతి గడపకూ కచ్చితంగా సమయం కేటాయించాలని ఆదేశించారు. డిసెంబరులో మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటిలోగా అందరూ బాగా తిరగాలన్నారు. మళ్లీ నాతోపాటు పనిచేయాలంటూ ఎమ్మెల్యేలను హెచ్చరించారు. ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులను గడపగడపలో తిప్పొద్దనీ, ప్రజాప్రతినిధులే స్వయంగా వెళ్లాలని, సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలన్నారు. కేటాయించిన నిధులను వినియోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యేల్లో కలవరం

పనితీరు సరిగ్గా లేని వారిపై వేటు తప్పదంటూ పార్టీ అధినేత జగన్ చేసిన హెచ్చరికలు ఎమ్మెల్యేల్లో కలవరం రేపుతున్నాయి. గడప గడపకు... గత సమీక్ష కంటే ఇవాళ ఫలితం మెరుగ్గా ఉందని, మరికొందరు తీరు మార్చుకోవాలని సూచించినట్లు సమాచారం. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా సీఎం ఇటీవల నుంచి సదస్సులు ప్రారంభించారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రతి గడప వద్దకు ఎమ్మెల్యేలు వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం పిలుపు ఇచ్చినప్పటికీ 27 మంది ముందుకెళ్లలేదు. వచ్చే డిసెంబరు నాటికి వారి పనితీరు మారకుంటే చర్యలు తప్పవని సీఎం చేసిన హెచ్చరికలతో ఎమ్మెల్యేల్లో ఆందోళన మొదలైంది.

పీఎఫ్ఐపై ఐదేళ్ల నిషేధం

కేంద్రం ఉత్తర్వులు

న్యూఢిల్లీ: ఉగ్రవాద కార్యకలాపాలు చేపడుతోందంటూ ఇస్లాం సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)పై కేంద్రం నిషేధం విధించింది. దీనితోపాటు దాని అనుబంధ సంస్థలపైనా వేటు వేసింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలు దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, భద్రతకు విఘాతం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని హోంశాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దేశవ్యాప్తంగా పీఎఫ్ఐపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రెండుసార్లు దాడులు చేపట్టింది. వందలమందిని అదుపులోకి తీసుకుంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (యూఏపీఏ)కింద పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలను చట్టవిరుద్ధ సంస్థలుగా ప్రభుత్వం ప్రకటించింది. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఎంఐ), జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేఎంబీ), ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్ఐ) సంస్థలతో సంబంధాలు ఉన్నాయని, ఉగ్రవాద కేసులతో ప్రమేయం ఉందని తెలిపింది. విదేశాల నుండి పీఎఫ్ఐ సంస్థకు నిధులతో పాటు సైద్ధాంతిక మద్దతు అందుతోందని, ఇది దేశ అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించనుందని కేంద్రం పేర్కొంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా పీఎఫ్ఐ సభ్యులు గతంలో అనేక కార్యకలాపాల్లో పాల్గొన్నారని, హత్యలకు పాల్పడ్డారని తెలిపింది. కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల సిఫార్సు మేరకు ఈ సంస్థను నిషేధించినట్లు ప్రకటించింది.

సత్ఫలితాలివ్వదు

పీఎఫ్ఐ నిషేధంపై సీపీఐ 2లో

తెరపైకి ప్రియాంక

న్యూఢిల్లీ: కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడి రేసులో ఎవరెవరు ఉంటారు? అధిష్ఠానం మొగ్గు ఎవరిపై ఉండబోతోంది? ప్రజాస్వామ్యం పేరుతో గుట్టుచప్పుడు కాకుండా ఎవరు నామినేషన్ వేయబోతున్నారనే అనిశ్చితి కాంగ్రెస్‌లో ఇంకా కొనసాగుతూనే ఉంది. దీంతో రోజుకో కొత్త పేరు తెరపైకి వస్తోంది. గాంధీ కుటుంబ సభ్యులు ఎవరూ పోటీలో ఉండరని రాహుల్‌గాంధీ తేల్చిచెప్పడంతో కాబోయే కొత్త అధ్యక్షుడు గాంధీయేతర కుటుంబానికి చెందిన వ్యక్తే అవుతారనే అభిప్రాయం దాదాపు స్థిరపడుతూ వచ్చింది. ఆసక్తికరంగా..తాజాగా ప్రియాంకగాంధీ వాద్రా పేరు తెరపైకి వచ్చింది. భారతీయ సంప్రదాయం ప్రకారం ఆడబిడ్డకు పెళ్లయిన తర్వాత పుట్టింటి పేరు ఉండదని, అత్తింటి పేరే ఇంటిపేరు అవుతుందని, ఆమెను ఇంకెంత మాత్రం గాంధీ కుటుంబ సభ్యురాలిగా పరిగణించరాదని కాంగ్రెస్ ఎంపీ అబ్దుల్ ఖలేఖ్ తాజాగా ట్వీట్ చేశారు. 'భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మరోసారి పగ్గాలు చేపట్టేందుకు రాహుల్ నిరాకరిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్షుడి పదవికి ప్రియాంకగాంధీ సమర్థులైన అభ్యర్థని నా నిశ్చితాభిప్రాయం. భారతీయ సంప్రదాయం ప్రకారం చూస్తే...వాద్రా కుటుంబం కోడలైన ప్రియాంకను గాంధీ కుటుంబ సభ్యురాలిగా చూడకూడదు' అని ఖలేఖ్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

మరోవైపు, పార్టీ అధ్యక్షుడి పదవికి నామినేషన్ వేసేందుకు సీనియర్ నేత శశిథరూర్ సిద్ధంగా ఉన్నారు. ఆయన ప్రధాన - మిగతా 2 లో

కేంద్రం మళ్లీ ద్రోహం

విశాఖ రైల్వేజోన్‌పై మోసపూరిత ప్రకటన: రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రానికి కేంద్రం పదేపదే ద్రోహం చేస్తున్నప్పటికీ సీఎం జగన్ ఎందుకు పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూటిగా ప్రశ్నించారు. కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అడుగడుగునా అన్యాయం చేస్తూనే ఉన్నదని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదనీ, విభజన హామీలు అమలు చేయలేదని రామకృష్ణ విమర్శించారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణ ప్రస్తావనే లేదనీ, రెవెన్యూ లోటు భర్తీకి నిధులు విడుదల చేయలేదని తెలిపారు. లాభాలు రావనే సాకుతో విశాఖ రైల్వే జోన్ ఇవ్వకుండా కేంద్రం మరో కుట్రకు తెరలేపిందని మండిపడ్డారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారం, విభజన చట్ట హామీల అమలుపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో విశాఖ రైల్వేజోన్ అంశాన్ని మళ్లీ కేంద్ర కేబినెట్‌కు పంపాలన్న కేంద్ర హోంశాఖ కార్యదర్శి నిర్ణయం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనని రామకృష్ణ విమర్శించారు. గత కేంద్ర కేబినెట్ విశాఖ రైల్వేజోన్‌ను ఆమోదిస్తూ పార్లమెంటులో చట్టం చేసినప్పటికీ... మళ్లీ కేబినెట్ ఆమోదం కావాలనడం కేంద్ర ప్రభుత్వ దుష్టనీతికి నిదర్శనమని పేర్కొన్నారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు అంశాన్ని కేంద్రం వివాదాస్పదం చేసిందనీ, రైల్వేజోన్ ఏర్పాటునూ తుంగలో తొక్కిందని విమర్శించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కేంద్రం తెగనమ్ముతుంటే జగన్ చోద్యం చూస్తున్నారని తెలిపారు. 25 మంది ఎంపీలను గెలిపిస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానన్న జగన్...ఇవాళ 31 మంది ఎంపీలున్నా ఎందుకు చేతులు ముడుచుకున్నారని ఆయన ప్రశ్నించారు. వైసీపీ ఎంపీలు కేంద్రాన్ని ప్రశ్నించడం చేతగాని వాళ్లుగా మిగిలిపోతున్నారని, - మిగతా 2 లో

ప్రైవేటు దోపిడీ

- ప్రయాణికుడి జేబుకు చిల్లు
- టికెట్టు ధరకు రెక్కలు
- పొరుగు రాష్ట్రాలకు భారీగా వసూలు
- నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం
- ఏపీఎస్ఆర్టీసీ ఆదాయానికి గండి
- దసరాకు 4,500 ప్రత్యేక బస్సులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దసరా పండుగ దగ్గర పడింది. పాఠశాలలకూ సెలవులు ఇచ్చేశారు. ఇది ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యానికి పండుగగా మారింది. భారీగా టికెట్ల ధరలను పెంచేశారు. దీంతో ఊర్లకు వెళ్లాంటే ప్రయాణీకులు బెంబేలెత్తిపోతున్నారు. దసరా పండుగను ఆసరాగా తీసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి పాల్పడుతున్నాయి. ముందస్తుగా బుక్ చేసుకుంటే టికెట్ల ధరలు తగ్గుతాయంటూ ప్రయాణీకులను ట్రాప్‌లో పడేస్తున్నాయి. దసరా పండుగను పురస్కరించుకుని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల తెలుగు ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు వెళుతుంటారు. రాష్ట్రం నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు ప్రాంతాలకు బస్సులపై రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ బస్సుల యాజమాన్యం ఉన్న పళంగా టికెట్ల ధరలను పెంచి, ప్రయాణీకులను నిలువ దోపిడీ చేస్తున్నాయి. దీనిని కట్టడి చేయడంలో ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖ యంత్రాంగం విఫలమైందనే విమర్శలున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఏసీ బస్ టికెట్ ధర సాధారణ రోజుల్లో దాదాపు రూ.600 నుంచి రూ.700 మధ్య ఉండేది. దసరా సందర్భంగా ప్రస్తుతం టికెట్ ధరను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచి వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి సాధారణ రోజుల్లో రూ.750 ఉండగా, పండుగ రద్దీతో దీని టికెట్టు ధర - మిగతా 2 లో

ఉప్పొంగిన ఉత్సాహం

- మహా పాదయాత్రకు అఖండ స్వాగతం
- ఏలూరు నియోజకవర్గంలో వెల్లువెత్తిన సంఘీభావం

6లో

అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ...అన్నదాతలు చేపట్టిన మహాపాదయాత్ర 17వ రోజుకు చేరుకుంది. అడుగడుగునా ప్రజల ఆశీర్వాదాలు, సంఘీభావాలు, ఘనస్వాగతాలు, హారతుల నడుమ ఉప్పొంగిన ఉత్సాహంతో దిగ్విజయంగా సాగుతోంది. పాదయాత్రకు తాత్కాలికంగా మంగళవారం విరామం ఇచ్చిన రైతులు... బుధవారం ఏలూరు సమీపంలోని పెదపాడు మండలం కొత్తూరులో అమరావతి రథం వద్ద జేఏసీ నాయకులు పూజలు చేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు.

మోటార్లకు మీటర్లు బిగిస్తే

పగలగొట్టండి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టండని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. 'వ్యవసాయ మోటార్లకు మీటర్లు-రైతన్న మెడకు ఉరి తాళ్లు' అనే అంశంపై ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో బుధవారం స్థానిక భాస్కర హోటల్ ఫంక్షన్ హాలులో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్థన్ అధ్యక్షతన సదస్సు జరిగింది. 6లో

ఇదీ లోకం!

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ

ఏవో పోస్టుల భర్తీలో అక్రమాలు

- ఒక్కో పోస్టుకు రూ.10 లక్షలు వసూలు
- ఫలితాలు వెంటనే నిలిపివేయండి
- హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఏవో పోస్టుల భర్తీలో భారీస్థాయిలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, తక్షణమే వాటికి సంబంధించిన పరీక్షా ఫలితాలను నిలిపివేయాలని కోరుతూ బుధవారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలయింది. గురువారం ఉదయం ఈ పిటిషన్‌ను విచారించేందుకు ధర్మాసనం అనుమతించింది. ఈనెల 18న పోస్టుల భర్తీ కోసం రాత పరీక్షలు నిర్వహించగా, 38 వేల మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. ఆంగ్ల భాషలో కూడా పరీక్ష పెట్టాల్సి ఉండగా, అది పెట్టకుండానే అధికారులు పంపించేశారు. ముందుగానే పోస్టుల భర్తీకి మాట్లాడుకొని డబ్బులు వసూలు చేశారు. ఒక్కో పోస్టుకు సుమారు రూ.10 లక్షలు వసూలు - మిగతా 2 లో

భూములిచ్చే

రైతుకు రూ.30వేలు

- పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం
- అందరి చూపు ఏపీవైపే
- వచ్చే మూడేళ్లలో రూపురేఖలన్నీ మారతాయి
- అందరికీ ఉపాధి: రామ్‌కో ప్రారంభోత్సవంలో సీఎం

2లో

పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు ఏటా చెల్లించే విధంగా ప్రభుత్వమే లీజ్ అగ్రిమెంట్ చేసుకుంటుందని, దీని ద్వారా ఏ రైతు నష్టపోరని సీఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామ పరిధిలో రూ.2500 కోట్లతో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీని స్విచ్ ఆన్ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు.

కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు

4 శాతం డీఏ పెంపు

- సుమారు కోటి మందికి పైగా ప్రయోజనం
- తాజా పెంపుతో 38 శాతానికి చేరిన ఉద్యోగుల డీఏ మొత్తం
- ఖజానాపై రూ.6,591.36 కోట్ల అదనపు భారం
- పేదలకు ఉచిత రేషన్ పథకం పొడిగింపు
- కేంద్ర కేబినెట్ నిర్ణయం

2లో

చర్చల్లో ట్రేడ్ యూనియన్‌లకు దక్కని ఆహ్వానం

ఖండించిన వెనిజులా కమ్యూనిస్ట్ పార్టీ

కారకస్: ప్రభుత్వానికి, యజమానులకు, కార్మికులకు మధ్య ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి యునైటెడ్ వర్కర్స్ సెంట్రల్ ఆఫ్ వెనిజులా (సియూటీవీ), నేషనల్ యూనియన్ ఆఫ్ వర్కర్స్ (యూఎన్ఈటీఈ) కాన్ఫెడరేషన్ ఆఫ్ అటానమస్ ట్రేడ్ యూనియన్స్ (సీఓఓటీఎస్‌వీ)లను నికోలస్ మదురో ప్రభుత్వం మినహాయించడాన్ని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా (పీసీవీ) తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ట్రేడ్ యూనియన్ భాగస్వామ్యాన్ని నిరోధించే కుట్రగా పీసీవీ పొలిటికల్ బ్యూరో సభ్యురాలు ఎలెనా లినారెజ్ పేర్కొన్నారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో బోనస్‌లు, జీతాలను తగ్గించిన జాతీయ బడ్జెట్ కార్యాలయం సూచనలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. మహిళల లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యం కోసం జరిపిన ఉద్యమానికి లినారెజ్ అధ్యక్షత వహించారు. తమ గర్భస్రావానికి నిర్ణయించుకున్న మహిళలను శిక్షించే ఆర్గానిక్ కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ ఆర్టికల్స్‌ను రద్దు చేయాలని కమ్యూనిస్ట్ పార్టీ డిమాండ్ చేసింది. వెనిజులాలో అబార్షన్ చట్టబద్ధత కోసం చట్టాన్ని రూపొందించాలని లినారెజ్ డిమాండ్ చేశారు. ఇరాన్‌లో పోలీసుల చేతిలో అమిని మరణించడంపై ప్రాథమిక స్వేచ్ఛను కోరుతూ ఇరాన్‌లో జరిగిన నిరసన తెలిపిన మహిళలపై ప్రభుత్వ అణచివేత విధానాల్ని పీసీవీ పొలిటికల్ బ్యూరో తిరస్కరించింది.

తీవ్ర ఆర్థిక మాంద్యంలో ప్రపంచం: డబ్ల్యూటీఓ



జెనీవా: ప్రపంచం ఆర్థిక మాంద్యంవైపు పయనిస్తోందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) చీఫ్ నగోజి ఒకోంజ ఇవెలా ఆందోళన వెలిబుచ్చారు. ద్రవ్యోల్బణాన్ని అదిగమించేందుకు కేంద్ర బ్యాంకులు పాలసీ రేట్లను పెంచాల్సి ఉంటుందని జెనీవా వేదికగా డబ్ల్యూటీఓ వార్షిక సమావేశాలను ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు. తక్షణమే అభివృద్ధి క్రమాన్ని పునరుద్ధరించేందుకు రాడికల్ విధానాలను రూపొందించాలన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, వాతావరణ సంక్షోభం, ఆహార సంక్షోభం, ఇంధన సంక్షోభం, కోవిడ్ మహమ్మారి కారణంగా ప్రపంచం మాంద్యం వైపుకు చేరుతోందన్నారు. రానున్న పరిస్థితులను ఎదుర్కోవడంపై తక్షణమే దృష్టి సారించాలన్నారు. అయితే వీటి ప్రభావం మార్కెట్లపైన, వర్ధమాన దేశాలపై అత్యంత తీవ్రంగా పుంటుందన్నారు. ముందుగా ఆహార భద్రతకు హామీ కల్పించే చర్యలకు తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. తర్వాత ఇంధన భద్రత గురించి ఆలోచిస్తామన్నారు. బలమైన డిమాండ్ ద్రవ్యోల్బణానికి దారితీసిందా లేదా సరఫరా సమస్యలతో ముడిపడి ఉన్న ధరల పెరుగుదలను సెంట్రల్ బ్యాంకులు గుర్తించాలని కూడా ఆమె పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి రెండూ అంతర్జాతీయ ఆర్థిక వృద్ధి రేటును తగ్గించాయని, వాణిజ్యభివృద్ధికి సంబంధించిన సంకేతాలు ఆశాజనకంగా లేవని ఒకోంజ ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే సమయంలో ఇన్ని సమస్యలు, సంక్షోభాలు ప్రపంచ దేశాలను చుట్టుముట్టడంతో సాధారణ స్థితిలో వాణిజ్య కార్యకలాపాలు సాగడం లేదన్నారు. వడ్డీ రేట్లను పెంచడం మినహా కేంద్ర బ్యాంకులకు ఇతరత్రా అవకాశాలు లేవని అన్నారు. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మాల్పాస్ కూడా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మాంద్యంలోకి పడిపోతోంది, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం గురించి కూడా మాట్లాడారు. ఉత్పత్తి పెంపుదలపై విధాన రూపకర్తలు ఎలా దృష్టి పెట్టాలి అనే దాని గురించి కూడా మాల్పాస్ మాట్లాడారు.

సైనిక కాల్పుల్లో మరో యువతి మృతి

టెహ్రాన్: అమిని మరణంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ తాజాగా ఇరాన్‌లో మరో మహిళను భద్రతాదళాలు కాల్చి చంపిన ఘటన చోటుచేసుకుంది. తలపై స్కార్ఫ్ లేకుండా 22 ఏళ్ల ఇరాన్ యువతి హదీస్ నజాఫీ స్కార్ఫ్ లేని జుట్టును వెనుకకు కట్టి నిరసనలో పాల్గొనడంతో ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఆమె ఛాతీ, ముఖం, మెడ, కడుపు భాగంలో భద్రతా దళాలు తుపాకీతో కాల్పులు జరుపడంతో ఆరు బులెట్లు ఆమె శరీరంలోకి చొచ్చుకెళ్లి ఆ యువతి అక్కడికక్కడే చనిపోయింది. దీంతో ఆ మహిళ అంత్యక్రియల సందర్భంగా ఆ దేశ ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. బహిరంగంగా హిజాబ్ ధరించనందుకు 22 ఏళ్ల మహసా అమిని ఇరాన్ నైతిక పోలీసులు చిత్రహింసలకు గురి చేసిన ఘటనలో అరెస్టు అయిన మూడు రోజుల తర్వాత ఈ నెల 16న ఆమె చనిపోయింది. దీంతో పది రోజులుగా దేశంలో తీవ్ర నిరసనలు కొనసాగుతున్నాయి. ఛాతీ, ముఖం, మెడ, కడుపు భాగంలో కాల్పులు జరుపడంతో హదీస్ నజాఫీ శరీరంలోకి ఆరు బులెట్లు చొచ్చుకెళ్లాయని, దీంతో ఆ యువతి మరణించిందని స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. తాజాగా నజాఫీను భద్రతా దళాలు కాల్చి చంపడంపైనా ఇరాన్‌లో నిరసనలు మిన్నంటాయి.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ వైద్య విధాన పరిషత్, వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ వినోద్ కుమార్‌కు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.బాలయ్య, వి.గిరిబాబు బుధవారం వినతిపత్రం అందజేశారు. మూడు వారాల్లోగా డిమాండ్లు పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. వైద్య విధాన పరిషత్ విభాగంలో కాంట్రాక్టు ఉద్యోగులకు నాలుగు నెలల వేతన బకాయిలు, ట్రామా కేర్ ఉద్యోగులకు తొమ్మిది నెలల బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, జిల్లాస్థాయి ఫీడర్ కేటగిరి ఉద్యోగులకు, ల్యాబ్ అటెండెంట్, ల్యాబ్ టెక్నీషియన్లకు పదోన్నతులు కల్పించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు పరిచి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలని, నాలుగో తరగతి ఉద్యోగుల పదోన్నతులు కల్పించాలని కోరారు. కర్నూలు సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న 107 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాలన్నారు. కుటుంబ సంక్షేమ విభాగంలో పనిచేస్తున్న ఎమ్‌పీహెచ్‌ఏ సిబ్బందికి మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే అక్టోబరు 18, 19 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. 20 నుండి 22 వరకు గేటు ఎదుట ఆందోళనలు చేస్తామన్నారు. యూనియన్ ఉపాధ్యక్షుడు ఎన్.దామోదరం పాల్గొన్నారు.

ఏవో పోస్టుల భర్తీలో అక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారని ఆరోపించడంతో పాటు ముందుగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టెస్ట్ పెట్టి ఎంపిక చేసుకున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ వాదనలు వినిపించారు. గురువారం ఫలితాలు వెలువడనుండటంతో వాటిని నిలిపివేయాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను పిటిషనర్ ప్రతివాదులుగా చేర్చారు.

అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల నష్టపరిహార జాబితాను పరిశీలించండి

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన వ్యవహారంలో ఇళ్లకు, పంటలకు జరిగిన నష్టంపై వాలామందికి పరిహారం ఇవ్వలేదన్న పిటిషన్ పై హైకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు వేసిన పిటిషన్‌పై గోపాలకృష్ణ వాదనలు వినిపించారు. అయితే రైతులకు, మునిగిపోయిన గృహాలకు పరిహారం ఇవ్వలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ప్రభుత్వ పరిహారం ఇవ్వలేదని న్యాయవాది గోపాలకృష్ణ పేర్కొంటూ... రైతులు, ఇళ్ల యజమానుల జాబితాను న్యాయస్థానానికి అందించారు. రెండు పక్షాల వాదనలు విన్న హైకోర్టు... పూర్తిస్థాయి అఫిడవిట్ వేయాలని న్యాయవాది గోపాలకృష్ణను ఆదేశించింది. అలాగే ప్రభుత్వం కూడా నష్టపరిహార జాబితాను మరోసారి పరిశీలించాలని సూచిస్తూ, తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది.

కేంద్రం మళ్లీ ద్రోహం

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి పెంచితే రాష్ట్రానికి ఎందుకు న్యాయం జరగదని ప్రశ్నించారు. ప్రజల భవిష్యత్తును మోదీకి జగన్ తాకట్టుపెట్టారని వ్యాఖ్యానించారు. వాలాసార్లు ఢిల్లీ పర్యటనలు చేసి మోదీ, అమిత్‌షాలను కలిసిన జగన్...ఏం సాధించారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలపై తిరోగమన వైఖరిని జగన్ అవలంబిస్తున్నారని ఆరోపించారు. మాటతప్పి మడమ తిప్పడమే జగన్ అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. విశాఖ రైల్వే జోన్ రాకపోతే రాజీనామా చేస్తానన్న ఎంపీ విజయసాయిరెడ్డి... తన సత్తా కేంద్రంపై చూపాలని సూచించారు. సీఎంకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుపై కేంద్రంపై ఒత్తిడి పెంచి, స్పష్టమైన ప్రకటన వచ్చేటట్లు చూడాలని హితవు పలికారు. విశాఖ రైల్వేజోన్ అంశంపై టీడీపీ, జనసేన పార్టీలు కూడా తమ వైఖరిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు

4 శాతం డీఏ పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ఉద్యోగులకు డీఏను పెంచడంతో పాటు కరోనా సమయంలో చేపట్టిన పేదలకు ఉచిత రేషన్ పథకాన్ని మరో 3 నెలల పాటు పొడిగించింది. దీపావళి పండుగ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కరవు భత్యం (డీఏ)ను 4 శాతం మేర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో డీఏ పెంపునకు ఆమోదం లభించింది. జులై నుంచి డీఏ పెంపు అమలులోకి వస్తుందని సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. తాజా పెంపుతో ఉద్యోగుల డీఏ మొత్తం 38 శాతానికి చేరనున్నది. సుమారు 50 లక్షల మంది కేంద్ర ఉద్యోగులు, 61 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం కలగనున్నది. ఉద్యోగులకు డీఏ పెంపు కారణంగా సంవత్సరానికి రూ.6,591.36 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,394.24 కోట్లు (జులై 2022 నుంచి ఫిబ్రవరి 2023 వరకు 8 నెలలు) అదనపు ఆర్థిక భారం ఉంటుందని అంచనా వేశారు. కాగా పెన్షనర్ల విషయంలో అదనపు ఆర్థిక భారం సంవత్సరానికి రూ.6,261.20 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4,174.12 కోట్లుగా అంచనా వేశారు. కరవు భత్యం, కరవు ఉపశమనం రెండింటి కారణంగా ఖజానాపై ఉమ్మడి ప్రభావం సంవత్సరానికి రూ.12,852.56 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8,568.36 కోట్లుగా ఉంటుందని మంత్రి ఠాకూర్ వివరించారు. కాగా 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు ఈ ఏడాది మార్చిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం మేర డీఏ పెంచింది. దీంతో మూల వేతనంలో డీఏ 34 శాతానికి చేరింది. తాజా పెంపు నిర్ణయంతో అది 38 శాతానికి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం డీఏ పెంచిన నేపథ్యంలో రాష్ట్రాలు కూడా తమ ఉద్యోగులకు ఆ మేర డీఏ పెంచే అవకాశం ఉంది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏను కేంద్రం సవరిస్తూ ఉంటుంది.

డిసెంబర్ వరకు పేదలకు ఆహార ధాన్యాలు

కేంద్ర ప్రభుత్వం కరోనా మహమ్మారి సమయంలో చేపట్టిన పేదలకు ఉచిత రేషన్ పంపిణీ పథకాన్ని మరో 3 నెలలు పొడిగించింది. ఇందుకోసం రూ.44,762 కోట్లు వ్యయం చేయనున్నది. అయితే రానున్న గుజరాత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం ఈ చర్య చేపట్టిందని భావిస్తున్నారు. ఈ సమయంలో 122 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉచితంగా ఇవ్వనున్నారు. 80 కోట్ల మంది పేదలకు ప్రతి నెలా 5 కిలోల గోధుమలు, బియ్యం ఉచితంగా అందించే పథకం శుక్రవారంతో ముగుస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు డిసెంబర్ 31, 2022 వరకు అమలులో ఉంటుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో జీవనోపాధి కోల్పోయిన పేదలకు సహాయం చేయడానికి ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై)ను ఏప్రిల్ 2020లో ప్రారంభించారు. 'వివిధ కారణాల వల్ల కోవిడ్ మహమ్మారి, అభద్రతపై ప్రపంచం పోరాడుతున్న తరుణంలో భారతదేశం బలహీన వర్గాలకు ఆహార భద్రతను విజయవంతంగా నిర్వహిస్తోంది' అని అధికారిక ప్రకటన తెలిపింది. 'ప్రజలు మహమ్మారి క్లిష్ట కాలాన్ని ఎదుర్కొన్నారని గుర్తించి, ప్రభుత్వం పీఎంజీకేఏవైను మూడు నెలల పాటు పొడిగించాలని నిర్ణయించింది. తద్వారా సమాజంలోని పేద, బలహీన వర్గాలకు రాబోయే ప్రధాన పండుగలకు మద్దతు లభిస్తుంది. ఈ పథకం కింద జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) పరిధిలోకి వచ్చే లబ్దిదారులందరికీ నెలకు ఒక్కొక్కరికి 5 కిలోల ఆహార ధాన్యం ఉచితంగా అందించబడుతుంది' అని తెలిపింది. కేంద్ర మంత్రి ఠాకూర్ మాట్లాడుతూ 2020 ఏప్రిల్‌లో ప్రారంభించినప్పటి నుంచి ప్రభుత్వం ఇప్పటివరకు పీఎంజీకేఏవై పథకం కోసం రూ.3.45 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. తాజా పొడిగింపు కోసం దాదాపు రూ.44,762 కోట్ల అదనపు వ్యయంతో పీఎంజీకేఏవైని మొత్తం ఖర్చు అన్ని దశలకు దాదాపు రూ.3.91 లక్షల కోట్లు అవుతుందని వివరించారు. అక్టోబరు 1 నుంచి మూడు నెలల్లో 122 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

చేనేత కార్మికులకు

కేంద్రం ఏంచేసిందో చెప్పాలి

కిషన్‌రెడ్డిని నిలదీసిన మంత్రి హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలంటూ ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చింత ప్రభాకర్‌కు చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ పదవి ఇవ్వడంపై ఉమ్మడి మెదక్ జిల్లా తరుపున సీఎం కేసీఆర్‌కు బుధవారం ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చేనేత ఉద్యమం సమయంలో నల్లగొండ జిల్లా బోధన్ పోచంపల్లి, సిరిసిల్లల్లో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాలకు రూ.50 లక్షలు అందించామని గుర్తు చేశారు. బతుకమ్మ చీరలు నేయాలంటూ రూ.350 కోట్ల ఆర్డర్‌ను చేనేత కార్మికులకు ఇవ్వామని తెలిపారు. బీమా, మరమగ్గాలకు సబ్సిడీ నేతన్నలకు ఇస్తున్నామని పేర్కొన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ అంటే చేనేత కార్మికులకు రోల్ మాడల్ అని, అప్పటి పాలకులు బాపూజీని అవమానిస్తే తెలంగాణ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించిందన్నారు. వరంగల్‌లో 1250 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి వలస వెళ్తున్న నేత కార్మికులకు భరోసా ఇచ్చామన్నారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ క్రాఫ్ట్ బోర్డ్, పవర్ లూమ్ బోర్డులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో పాటు 2014లో తీసుకొచ్చిన త్రిఫ్ట్ పథకం కూడా రద్దు చేసిందని దుయ్యబట్టారు. చేనేత కార్మికులపై పరోక్షంగా భారం వేసి, నూలు దొరక్కుండా కేంద్రం ఇబ్బందులకు గురి చేసిందని ఆరోపించారు. ప్రభుత్వరంగ సంస్థలైన ఎల్ఐసీ, రైల్వేలను అమ్మిన ఘనత బీజేపీదని దుయ్యబట్టారు. మేకిన్ ఇండియా అని చివరకు జాతీయ జెండాలను చైనా నుంచి తెచ్చారంటూ ఎద్దేవాచేశారు.

భూములిచ్చే రైతుకు రూ.30వేలు

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల: పరిశ్రమల కోసం భూములిచ్చిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు ఏటా చెల్లించే విధంగా ప్రభుత్వమే లీజ్ అగ్రిమెంట్ చేసుకుంటుందని, దీని ద్వారా ఏ రైతు నష్టపోరని సీఎం జగన్ మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల జిల్లా, కొలిమిగుండ్ల మండలంలోని కల్వటాల గ్రామ పరిధిలో రూ.2500 కోట్లతో నిర్మించిన రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీని స్విచ్ ఆన్ చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల పరిధిలో సోలార్ లేదా గాలి మరల విద్యుత్ ఉత్పత్తి సంస్థల ఏర్పాటుకు 1500-2000 ఎకరాల భూములు ఇచ్చేవారికి మాత్రమే లీజ్ అగ్రిమెంట్ సాధ్యమవుతుందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక ఏర్పాటుకు, వాటి అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఏపీలో విస్తారమైన వనరులు ఉండటంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉండటంతో అందరూ మన వైపు చూస్తున్నారని తెలిపారు. అంతకు ముందు ముఖ్యమంత్రి ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్ లో రామ్‌కో సిమెంట్‌లోని హెలిప్యాడ్ చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎస్పీ రఘువీరారెడ్డి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో రోడ్డు మార్గం ద్వారా రామ్‌కో ప్రారంభోత్సవ ప్రాంతానికి చేరుకున్నారు. సుమారు రూ.2వేల కోట్లు, మూడు మిలియన్ టన్నుల ఉత్పత్తితో ఏర్పాటు చేసిన రామ్‌కో పరిశ్రమ వల్ల స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అందుతాయన్నారు. విస్తరణ జరిగే కొద్దీ సీఎస్ఆర్ నిధులు ద్వారా గ్రామాల అభివృద్ధి జరగడంతో పాటు స్థానికులకే 75% ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కేవలం 30 నెలల్లోనే పరిశ్రమ నిర్మాణం పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం అవలంబిస్తున్న సులభతర పారిశ్రామిక విధానాలే కారణమన్నారు. 1961లో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ ఏర్పడినప్పుడు కేవలం 200టన్నుల సిమెంట్ ఉత్పత్తి మాత్రమే ఉండేదని, నేడు 20 మిలియన్ టన్నులకు చేరుకోవడం అభినందనీయమన్నారు. పరిశ్రమల ఏర్పాటు అనుమతులలో జాప్యం లేకుండా చూస్తున్నామన్నారు. ఇటీవలే జిల్లాలో గ్రీన్ కో అనే పరిశ్రమ ఏర్పాటుకు భూమి పూజ చేశామని దాని ద్వారా 5400 మిలియన్ వాట్స్ విద్యుత్ ఉత్పత్తి జరిగి 2600 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. రాష్ట్రంలోకి గ్రీన్ కో, అరబిందో, అదాని లాంటి పెద్ద సంస్థలు రూ.78,500 కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నాయని, సంబంధిత అనుమతులు ఇచ్చామని తెలిపారు. రాబోయే మూడు, నాలుగేళ్లలో పూర్తిగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి బాటలో ఉంటాయన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే రాష్ట్రానికి ప్రథమ స్థానం లభించిందన్నారు. దీన్ని బట్టి మనప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి ప్రాధాన్యత, ప్రోత్సాహం, చేయూత అందిస్తున్నామో తెలుసుకోవచ్చన్నారు. 2021-22 రాష్ట్ర వృద్ధి రేటు 11.4 శాతం అని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామిక అనుకూల వాతావరణం ఉన్నదన్నారు. త్వరలో మరో నాలుగు పెద్ద కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, తద్వారా వేలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఏపీకి పొడవైన సముద్ర తీరప్రాంతం ఉండటంతో మత్స్య సంపదకు కొదవలేదని, నాలుగు ప్రాంతాల్లో ఆరు పోర్టులున్నాయని, ఫిషింగ్ హార్బర్ కోసం 50 కిలోమీటర్ల ఒక పోర్టు ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో 2021-22 లో రూ.1.70లక్ష కోట్ల ఎగుమతులు జరిగాయని, రూ.3.6 లక్షల కోట్లతో ఎగుమతుల లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విశాఖపట్నం- చెన్నై, చెన్నై- బెంగళూరు, బెంగళూరు- హైదరాబాద్ కలుపుతూ మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నామని వీటి ద్వారా పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతుందని తెలిపారు. పెద్ద పరిశ్రమలు వస్తే మన పిల్లలకు ఇక్కడ ఉద్యోగాలు, ఉపాధి లభిస్తాయని పరిశ్రమల ఏర్పాటును అందరూ స్వాగతించాలని ఆయన కోరారు. ఉపముఖ్యమంత్రి, మైనారిటీశాఖ మంత్రి అంజాద్ బాషా, రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భూగర్భ గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పి రామచంద్రారెడ్డి, నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానంద రెడ్డి, ప్రభుత్వ విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఎమ్మెల్సీ జిల్లా భగీరథ రెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి, రామ్ కో ఎండీ వెంకట రామరాజు పాల్గొన్నారు.

సత్ఫలితాలివ్వదు

పీఎఫ్ఐ నిషేధంపై సీపీఐ

న్యూఢిల్లీ: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)పై మోదీ సర్కారు నిషేధం విధించడాన్ని సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. ఇలాంటి చర్యల వల్ల ఎలాంటి సత్ఫలితాలు ఉండబోవని స్పష్టంచేసింది. ఈ మేరకు సీపీఐ కేంద్ర కార్యదర్శివర్గం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఉగ్రవాద సంస్థ అంటూ పీఎఫ్ఐపై నిషేధం విధించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని సీపీఐ అభిప్రాయపడింది. ఈ ప్రయోగం గతంలో ప్రతిసారీ విఫలమైన ఉదాహరణలు అనేకమున్నాయని గుర్తు చేసింది. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా ఉగ్రవాద భావజాలానికి, ఉగ్ర చర్యలకు సీపీఐ ఎప్పటికీ మద్దతివ్వదని స్పష్టంచేసింది. తన ప్రత్యర్థులపై పీఎఫ్ఐ సాగించిన హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపింది. గత అనుభవాల దృష్ట్యా పీఎఫ్ఐపై నిషేధాన్ని తాము అనుమతించలేమని తెల్చిచెప్పింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యూఏపీఏ) కింద పీఎఫ్ఐని చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించడంతో ఈ సమస్యకు పరిష్కార మార్గం కాదని పేర్కొంది. ఆర్ఎస్ఎస్, మావోయిస్ట్ సంస్థలపై నిషేధం విధించినప్పటికీ.. ఎటువంటి ప్రభావం చూపలేదని గత అనుభవాలు పేర్కొంటున్నాయని గుర్తు చేసింది. చట్టవిరుద్ధమైన, హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు పీఎఫ్ఐపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ సంస్థ మతతత్వ, విభజన భావజాలాన్ని బయటపెట్టాలని, వారిపై రాజకీయంగా పోరాడాలని హితవు పలికింది.

సీపీఎం ఖండన

పీఎఫ్ఐపై నిషేధం విధించడాన్ని సీపీఎం పొలిట్‌బ్యూరో బుధవారం ఓ ప్రకటనలో ఖండించింది. ఇటువంటి ఉగ్రవాద చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొంది. పీఎఫ్ఐ, ఆర్ఎస్ఎస్... కేరళ, కర్ణాటక కోస్తా ప్రాంతంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టే ఉద్దేశంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ హత్యలు, ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడింది. సనాతన సంస్థ, హిందూ జాగృతి సమితి వంటి అతివాద సంస్థల ప్రముఖ లౌకిక రచయితలు, వృత్తులను హత్య చేయడాన్ని సమర్థిస్తున్నాయని పేర్కొంది. అతివాద, పీఎఫ్ఐ వంటి సంస్థలపై చట్టాల ద్వారా పోరాటం సాగించాలని సూచించింది. అటువంటి శక్తులను ఎదుర్కోవడం ద్వారా దేశ గణతంత్ర, లౌకిక, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ప్రధాన కర్తవ్యంగా రాజ్యాంగం ప్రకారం అధికారం చేపట్టిన పాలకులు వ్యవహరించాలని సూచించింది.

తెరపైకి ప్రియాంక

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యర్థి ఎవరనేది ఇంకా సందిగ్ధంలోనే ఉంది. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ వైపు పార్టీ అధి ష్ఠానం మొదటి నుంచి మొగ్గుచూపుతూ వచ్చింది. అయితే ఊహించని విధంగా రాజస్థాన్‌లో తలెత్తిన పరిణామాలతో అధ్యక్ష పదవికి గెహ్లాట్ అభ్యర్థిత్వం దోలాయమానంలో పడింది. రాజస్థాన్‌లో తన అనుచరగణానికే (ఎమ్మెల్యేలు) నచ్చచెప్పలేని గెహ్లాట్... పార్టీ అధ్యక్షుడిగా వ్యవహారాలను ఎలా చక్కబెడతారనే ప్రశ్నలు మొదలయ్యాయి. సీనియర్ నేత కమల్‌నాథ్ ఢిల్లీకి చేరుకున్నప్పటికీ ఆయన అధ్యక్షుడి పదవిపై పెద్దగా మొగ్గుచూపడం లేదు. మరో సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ సైతం పోటీకి సిద్ధంగా ఉన్నారు. అయితే ఆయన ఆచూతూచి వ్యవహరిస్తున్నారు. కాగా, రాజస్థాన్‌లో ఎలాంటి డ్రామా జరగడం లేదని, ఒకటి, రెండు రోజుల్లో అంతా సజావుగా ముగుస్తుందని పార్టీ నేత కేసీ వేణుగోపాల్ బుధవారం మీడియాకు తెలిపారు. అన్ని వ్యవహారాలు ప్రజాస్వామ్యబద్ధంగా, ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా సాగుతాయని ఆయన భరోసా ఇచ్చారు. కాగా, అధ్యక్ష ఎన్నికల నామినేషన్ గడువు మరో రెండు రోజుల్లో...ఈనెల 30వ తేదీతో ముగియనుంది. అక్టోబర్ 1న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. ఉపసంహరణ గడువు అక్టోబర్ 8వ తేదీతో ముగుస్తుంది. అదో రోజు సాయంత్రం 5 గంటలకు అభ్యర్థుల తుది జాబితా విడుదలవుతుంది. ఎన్నిక అనివార్యమైతే అక్టోబర్ 17న పోలింగ్ జరుపుతారు. 19న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు. 9వేల మందికి పైగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొని కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.

సింగరేణి కార్మికులకు దసరా ధమాకా!

విశాలాంధ్ర-హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ తీపి కబురు చెప్పారు. లాభాల్లో 30 శాతం వాటాను ప్రత్యేక ప్రోత్సాహకంగా అందించాలని సింగరేణి ఎండీని సీఎం ఆదేశించారు. అర్హులకు రూ.368 కోట్లు పండుగ లోపే చెల్లించేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేసింది. 2021-22కు గాను ఆర్జించిన లాభాల్లో 30 శాతం ఉద్యోగులకు దసరా కానుకగా అందించాలని సీఎం నిర్ణయించారు. ప్రత్యేక ప్రోత్సాహకాన్ని దసరాలోపు చెల్లించాల్సిందిగా సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ నర్సింగరావు... సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటు దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

రూ.4,050 చొప్పున విక్రయిస్తున్నారు. ఒక విధానం లేకుండా, ఇష్టానుసారంగా ప్రైవేట్ ట్రావెల్ యాజమాన్యం టికెట్ల ధరలను నిర్ణయిస్తూ, ప్రయాణీకులను దోపిడీకి గురిచేస్తున్నారు. హైదరాబాద్ నుంచి రాజమహేంద్రవరానికి విమానం టికెట్టు ధర రూ.3,600 ఉండగా, దానికి కంటే బస్సు టికెట్ల ధరను పెంచడంతో ప్రయాణీకులు లబోదిబోమంటున్నారు.

రైళ్లు, ఆర్టీసీ రిజర్వేషన్లు ఫుల్...

దసరాతో ముందస్తుగా రైల్ రిజర్వేషన్లు చేసుకోవడంతో ఎక్కడా ఖాళీలు లేవు. ఈ వివిధ సాధారణ చార్జీలతోనే ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపడంతో ప్రయాణీకులంతా వాటిపై దృష్టి పెట్టారు. ఆర్టీసీ ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో ముందస్తుగా ప్రయాణీకులు రిజర్వేషన్ చేయించుకున్నారు. అటు రైళ్లు, ఇటు ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్లు చేయించుకోలేని వారంతా ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణీకుల రద్దీని, అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అందినకాడికి దోచుకునే రీతిలో ప్రైవేట్ వాహనాల యాజమాన్యం వ్యవహరిస్తోంది. దసరా రద్దీని సొమ్ము చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. వారు నిర్ణయించిన చార్జీలను చూస్తుంటే అవి ప్రైవేట్ చార్జీలా?, విమానపు చార్జీలా అన్న రీతిలో అధికమయ్యాయి. ఏడాది రేట్లు పెంచేస్తూ ప్రయాణీకులకు దగా చేస్తున్నారు. పెద్ద ట్రావెల్స్ నుంచి చిన్న ట్రావెల్స్ వరకు పండుగ రద్దీతో ప్రయాణీకులను దోచుకునే రీతిలో రేట్లను పెంచేశారు. ఒక సాధారణ ఉద్యోగి కుటుంబమంతా ఊరెళ్లాలంటే దాదాపు వారి నెలసరి వేతనమంతా టికెట్లు కొనుగోలుకే సరిపోయేలా ఉందంటున్నారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి తదితర నగరాల నుంచి వివిధ రాష్ట్రాలకు ప్రైవేట్ బస్సులను తిప్పుతున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి కూకట్‌పల్లి, మైత్రివనంలోని ప్రైవేట్ సంస్థల కార్యాలయాల్లో అధిక రేట్లతో ముందస్తు టికెట్లు బుక్ చేస్తున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులతో ప్రయోజనమేదీ?

ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్య దోపిడీని అరికట్టకుండా ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపినా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ దోపిడీ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రాష్ట్ర రవాణ శాఖ యంత్రాంగం తనిఖీలు చేపట్టలేదు. దసరా పండుగను పురస్కరించుకుని సాధారణ చార్జీలతోనే వివిధ ప్రాంతాలకు 4,500 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఇటీవల ప్రకటించారు. ఈనెల 26 నుంచి ప్రారంభమైన ప్రత్యేక సర్వీసులు అక్టోబరు 9 వరకు నడవనున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక తదితర రాష్ట్రాలకు నడుస్తాయి. ఇందుకోసం ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 21 ముఖ్య పట్టణాలు, నగరాలు, ప్రాంతాలకు ప్రత్యేక ఆర్టీసీ ప్రత్యేక బస్సులు రాకపోకలు కొనసాగుతాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, భీమవరం, అమలాపురం, భద్రాచలం, రాజమహేంద్రవరం, తుని, కర్నూలు, అనంతపురం, బెంగళూరు, చెన్నై, తిరుపతి, కడప, శ్రీశైలం, మార్కాపురం, ఒంగోలు, నెల్లూరుకు బస్సులు వెళతాయి. దసరా ముందస్తుగా 2,100 బస్సులు, దసరా తర్వాత అక్టోబరు 5 నుంచి 7వ తేదీ వరకు 2,400 బస్సులు నడుపుతారు. ప్రత్యేక సర్వీసుల పర్యవేక్షణ కోసం జిల్లా ముఖ్య కేంద్రాలు, హైదరాబాద్‌లోని వివిధ పాయింట్ల వద్ద అధికారులు, సూపర్ వైజర్లు, భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్య ఆగడాలను అరికట్టకుండా, ఆర్టీసీ ఎన్ని ప్రత్యేక బస్సులు నడిపినా ఫలితం ఉండబోదు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యం తన్నుకుపోయే ప్రమాదముంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రయాణ ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

జాతీయ మహాసభలతో కీలక మార్పు

- విజయవంతం చేయండి
- అనంతరం ప్రజల పక్షాన పోరాటాలు ఉధృతం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వచ్చే నెల 14 నుంచి 18 వరకు జరిగే సీపీఐ జాతీయ మహాసభలు దేశ రాజకీయాల్లో కీలకమార్పునకు నాంది పలకనున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో బుధవారం సీపీఐ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశాలు నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మొజ్జాడ యుగంధర్ అధ్యక్షతన నిర్వహించిన సమితి సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడారు. సీపీఐ జాతీయ మహాసభలు ప్రతీ కార్యకర్త పండగలా నిర్వహించాలని, ఈ మహాసభల్లో తీసుకునే నిర్ణయాలపై అన్ని పార్టీలు ఆసక్తిగా ఉన్నాయని, దేశ రాజకీయాల్లో కీలక మార్పులు వస్తాయన్నారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలోని ఆర్థిక, రాజకీయ అంశాలపై ఈ మహాసభల్లో చర్చించి ప్రజల పక్షాన ఉధృత పోరాటాలకు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలో జాతీయ మహాసభలు నిర్వహించడం గర్వకారణమని, దానికనుగుణంగా ప్రతీ ఒక్కరూ ఈ మహాసభల్లో పాల్గొని క్రమశిక్షణతో మెలగాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ గద్దెనెక్కినప్పటి నుంచి దేశ సంపదను కార్పొరేట్‌లకు కట్టబెట్టడమే పనిగా పెట్టుకున్నారని, దేశాభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. ప్రపంచ రెండో కుబేరుడిగా అదానీ అవతరించడం వెనుక మోదీ కార్పొరేట్ లకు ఏవిధంగా సహాయ సహకారాలు అందిస్తున్నారో అర్థ మవుతోందన్నారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టి అన్ని రంగాలు వారి చేతుల్లోనే ఉండేలా మోదీ పాలన సాగుతోందని, మోదీని గద్దెదించేంత వరకు సీపీఐ పోరాటం ఆగదన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపకపోతే భావితరాలకు పెనుముప్పుగా మారుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి అంటే సంక్షేమ పథకాలే అన్న చందాన ఉందని, వ్యక్తిగత రాజకీయ లబ్ధికోసం పాలకులు పాకులాడుతున్నారే తప్ప, ప్రజా శ్రేయస్సు కోసం పట్టించుకోవడం లేదని విమర్శిం చారు. రాష్ట్రంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, నిజమైన అభివృద్ధి కానరావడం లేదన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సీటీ పేరు మార్పు చూస్తుంటే చవకబారు రాజకీయాలకు అద్దం పడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వప్రయోజనాలకే తప్ప ప్రజా శ్రేయస్సును గాలికొదిలేశారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభలనంతరం ప్రజల పక్షాన ఉధృత పోరాటాలు చేస్తామన్నారు. జనసేవాదళ్ కవాతు మూడు వరుసల్లో ఉంటుందని, ఎవరి స్థానంలో వారు ర్యాలీలో పార్టీ నిర్ణయా లకు అనుగుణంగా నడుచుకోవాలని, ప్రతీ జిల్లా బృందం కూడా ఆల్ఫా, బీటా క్రమంలో ఈ ర్యాలీలో పాల్గొనేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. 14న విజయవాడలో నిర్వహించే ర్యాలీలో ప్రతీ కార్యకర్త కుటుంబ సభ్యులతో పాటు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు కార్యకర్తలకు అనుగుణంగా ఆరు ప్రాంతాల నుంచి సీపీఐ రైలు సౌకర్యం కల్పించిందని, శ్రీకాకుళం రైల్వేస్టేషన్ (ఆమదాలవలస)లో అక్టోబర్ 13వ తేదీ సాయంత్రం రైలు బయలుదేరుతుందన్నారు. ఈ మహాసభల్లో ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొనేలా వాడవాడలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఎర్ర జెండా అంటేనే పేదలకు అండ అని, సీపీఐ మహాసభల నిర్ణయాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం మహాసభలు అనంతరం కార్యాచరణ రూపొందించి ఉధృత పోరాటాలు చేస్తామన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు కచ్చితంగా జిల్లాలోని సీపీఐ శ్రేణులు సంఘీభావం ప్రకటిస్తామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

'ఆదర్శ' వసతి గృహాల సిబ్బంది

సమస్యలు పరిష్కరించండి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆదర్శ పాఠశాలల వసతి గృహాల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర కార్యదర్శి నాగమణికి బుధవారం ఆయన వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 134 ఆదర్శ పాఠశాలల వసతి గృహాల్లో పనిచేస్తున్న అప్కాస్ కార్మికులను కాంట్రాక్టులోకి మార్చి, కడప, అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులను అప్కాస్ పరిధిలోకి తీసుకురావాలని, వారందరికీ ఎంటీఎస్ వర్తింపజేసే పని గంటల విధానం అమలు చేయాలని పేర్కొన్నారు. కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కడప, అనంతపురం జిల్లాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులను తక్షణమే అప్కాస్‌లోకి తీసుకొచ్చి వేతనాలు పెంచాలని కోరారు. కాకినాడ జిల్లాలో రెండు వసతి గృహాల కార్మికులకు 12 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయన్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. 24/7 విధానాన్ని రద్దు చేయాలని, పని ఒత్తిడి తగ్గించేందుకు వంట మేస్త్రి, వార్డెన్, వాచ్‌మేన్, సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు మౌనిక, అనురాధ, గంగాదేవి, శ్రీదేవి పద్మజ, సుశీల రమా, చంద్రకళ వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

ప్రభుత్వాల తీరు ఎండగట్టడానికే మహాసభలు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణమూర్తి
- బంగారుపేటలో ఇంటింట ప్రచారం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విజయవాడలో అక్టోబర్ 14 నుంచి 18 వరకు జరుగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక బంగారుపేటలో బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారతదేశం మరింత చీకట్లోకి నెట్టబడిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. అనేకమంది ఆకలి చావులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీదైన సూటు బూట్లు ధరించి విదేశాల్లో చక్కర్లు కొడుతూ ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి సామాన్యుల అకౌంట్లలో వేస్తానని చెప్పి వారిని తీవ్ర నిరాశకు గురి చేశారని అన్నారు. రాష్ట్రాల బాగోగులు చూడాల్సింది పోయి, వాటి మధ్య చిచ్చులు పెట్టే పనిలో ఉన్నారని విమర్శించారు. కేంద్రం తానా అంటే జగన్ తందానా అనే విధంగా తయారయ్యాడని ఎద్దేవా చేశారు. పన్నుల రూపంలో సామాన్యులపై భారం మోపి, ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండ కట్టడానికి మహాసభలు వేదిక అవుతున్నాయని అన్నారు. బంగారుపేటలో కష్టజీవులు పెద్దఎత్తున విరాళాలు అందచేయడంతో ఆయన ఆశ్చర్యం వ్యకం చేశారు. మనోహర్‌మాణిక్యం, పార్టీ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ ఎస్.గిడ్డమ్మ, సీపీఐ నగర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, సురేష్, ఈశ్వర్, బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సీపీఐ నగర సమితి సభ్యుడు శరత్ కుమార్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్ రాకుంటే రాజీనామా

వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ రైల్వే జోన్‌పై టీడీపీ, దాని అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని, విశాఖకు రైల్వేజోన్ రాకుంటే తాను రాజీనామా చేస్తానని ఎంపీ, వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి సవాల్ విసిరారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విభజన సమస్యలపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో విశాఖ రైల్వే జోన్ అంశం ప్రస్తావనకే రాలేదన్నారు. దీనిపై అవాస్తవాలు ప్రచారం చేయడంపై ఆయన మండిపడ్డారు. స్వయాన కేంద్ర రైల్వే శాఖమంత్రిని వైసీపీ ఎంపీల బృందం కలిసినప్పుడు తమకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అతిత్వరలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామన్నారు. పునర్విభజన చట్టంలో రైల్వేజోన్‌కు సంబంధించి చాలా స్పష్టంగా చెప్పారనీ, రాజధాని ఎక్కడైతే ఉందో, ఆ రాజధానిని కొవ్వూరు మీదుగా తెలంగాణ ప్రాంతాలు కలిసేలా రైల్వే లైన్ నిర్మించి, హైదరాబాద్‌ను కనెక్ట్ చేయాలనే అంశంపై చర్చించారన్నారు. దానికి సంబంధించి రాష్ట్రం వాటా సొమ్ము ఇవ్వాలనేది కేంద్ర ప్రతిపాదన అనేదీ పునర్విభజన చట్టంలోనే చాలా స్పష్టంగా పేర్కొన్నారన్నారు.

రైల్వేజోన్‌పై కేంద్రం కుట్ర: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ రైల్వేజోన్‌పై ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ కేబినెట్‌కు పంపాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రపూరిత వైఖరిని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రజానీక, ప్రజాతంత్రవాదులు నిరసనలు తెలపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర కేబినెట్‌లో దీనిపై చర్చించి, రైల్వే జోన్ సహా విభజన హామీలపై అత్యవసర అసెంబ్లీని సమావేశపర్చి తీర్మానించాలన్నారు. విభజన చట్టంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ఇచ్చిన హామీల అమలుపై ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వేబోర్డు ఇచ్చిన సమాధానం బాధ్యతారహితంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా వారు ఇలాంటి సమాధానం ఇవ్వబోరన్నారు. రైల్వే జోన్‌పై రైల్వే శాఖ నిర్ణయం కేంద్ర కేబినెట్‌కు పంపాలనే కేంద్ర హోంశాఖ కార్యదర్శి నిర్ణయం మరో నాటకానికి తెరతీస్తుందనీ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదన్నారు. గత ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదించిన చట్టం అమలు చేయకుండా, ఎనిమిదేళ్లు గడిచిన తరువాత లాభదాయకం కాదనే ఉద్దేశ్యంతో రైల్వే జోన్ తిరస్కరించడం ప్రజలను మోసగించడమేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయపక్షాలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు.

దేశ రక్షణ భేరి జయప్రదం అభినందనీయం

సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 14 నుంచి 27 వరకు దేశ రక్షణ భేరిని రాష్ట్రంలో జయప్రదం చేసిన ప్రజలకు, కార్యకర్తలకు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో సభలు, ప్రదర్శనలు జరిగాయని పేర్కొన్నారు.

అన్ని రంగాల్లో వైసీపీ ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర-యర్రగుంట్ల: వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, రాష్ట్ర రాజకీయాల్లో అక్టోబర్ తరువాత పెనుమార్పులు సంభవించే అవకాశాలు ఉన్నాయని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి అన్నారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా బుధవారం వైఎస్ఆర్ జిల్లా యర్రగుంట్లలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడం మినహా జగన్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని అన్నారు. దారుణహత్యకు గురైన మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి తనకు రాజకీయ గురువు అనీ, అలాంటి వ్యక్తి హత్య కేసులో తనను ఇరికించే ప్రయత్నం చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చడం సరికాదన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవన్నారు. జోనల్ ఇన్‌చార్జి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రాజేష్‌రెడ్డి, కలమల్ల సర్పంచ్ హెచ్చీబా, చిలమకూరు ఎంపీటీసీ నవీన్‌కుమార్, బాబు, షరీఫ్, జంగంరెడ్డి, నారాయణరెడ్డి, పుల్లారెడ్డి, అంకిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగరాజు, ప్రతాప్‌రెడ్డి, బాల వెంకటరెడ్డి, దానం, వరపుత్రుడు, ప్రకాశం, భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, సుబ్బరాయుడు, మునెయ్య, శివారెడ్డి పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు వర్సిటీలే వేదిక: సతీశ్ రెడ్డి

విశాలాంధ్ర-విశాఖ సిటీ: విశ్వవిద్యాలయాలు నవ్య ఆవిష్కరణలకు వేదికలుగా నిలుస్తాయని భారత రక్షణమంత్రి సాంకేతిక సలహాదారు, డీఆర్డీఓ పూర్వపు డైరక్టర్ డాక్టర్ జీ సతీశ్ రెడ్డి తెలిపారు. బుధవారం విశాఖలోని ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆయన విద్యార్థులనుద్దేశించి ఆత్మనిర్భర్ భారత్ అంశంపై ప్రసంగించారు. దేశం ఆర్థికంగా పురోభివృద్ధి సాధించా లంటే మనం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలలో పనిచేయడం ఎంతో అవసరమన్నారు. యువత నూతన ఆలోచనలతో వస్తే ప్రోత్సహించడానికి, తగిన ఆర్థిక సహకారం అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. డీఆర్డీఓ దేశవ్యాప్తంగా విభిన్న శాస్త్ర అంశాల్లో 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తోందన్నారు. దేశ రక్షణ రంగానికి ఉపయుక్తంగా పనిచేసే స్టార్టప్, ఎంఎస్ఎంఈ, ఇంక్యుబేషన్లకు రూ.50కోట్లు వరకు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. తయారు చేసిన ఉత్పత్తులను డీఆర్డీఓ ప్రయోగశాలల్లో పరీక్షించే అవకాశం ఉందన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో దేశీయంగా కేవలం నాలుగు నెలల కాలంలో 60 వేల వెంటిలేటర్లను సిద్ధం చేశామన్నారు. ఎవ్వరిపైనా ఆధారపడకుండా, స్వయం శక్తితో ఎదగడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమల అనుసంధానం, సమన్వయం గణనీయంగా పెరిగాయన్నారు. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారతీయ విద్యాసంస్థలు ముందుంటున్నాయని తెలిపారు. ప్రతిష్ఠాత్మక జాతీయ విద్యా సంస్థల్లో చదవుకున్న అధికశాతం మంది విద్యార్థులు నేడు మన దేశంలోనే స్థిరపడుతున్నారన్నారు. గతంలో రక్షణ రంగంలో అధికంగా దిగుమతులు ఉండేవని, నేడు పరిస్థితి పూర్తిగా మార్పు చెంది ఎగుమతులు చేసే స్థాయికి భారత్ ఎదిగిందన్నారు. యువతనేడు విలువైన సంపదగా నిలుస్తోందన్నారు.

ముందుగా ఏయూ జియో ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల డ్రోన్ సర్వే మ్యాపింగ్ -నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని సతీశ్ రెడ్డి ప్రారంభించారు. ఏయూ విద్యార్థులు స్వయంగా డ్రోన్లను తయారు చేయాలని, ఎక్కువ గాలులను తట్టుకునే విధంగా వీటి రూపకల్పన జరగాలని సూచించారు. డీఆర్డీఓతో కలసి పనిచేయాలని కోరారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద్ రెడ్డి మాట్లా డుతూ దేశీయంగా తయారు చేస్తున్న ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచు తున్నాయన్నారు. వెలకట్టలేని విలువైన సంపదగా భారతీయ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్‌కు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఏయూలో ఏర్పాటు చేస్తున్న టెక్, ఫార్మా, మెరైన్, ఫుడ్ స్టార్టప్, ఇంక్యుబేషన్ల వివరాలు తెలియజేశారు. ఏయూ ఆచార్యులు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో సీఎం జగన్

విశాలాంధ్ర-తిరుమల: బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం ఉదయం వేంకటేశ్వరస్వామిని సీఎం జగన్ దర్శించుకున్నారు. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న సీఎంకు టీటీడీ చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి నమస్కరించిన అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన సీఎం వెంకన్న సేవలో నిమగ్నమయ్యారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు జగన్‌కు ఆశీర్వచనం పలికారు. సుబ్బారెడ్డి, ధర్మారెడ్డితో కలిసి తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రపటం అందజేశారు. పరకామణి భవనం ప్రారంభం: తిరుమ లలో నూతన పరకామణి భవనాన్ని సీఎం ప్రారంభించారు. ఈ భవన నిర్మాణానికి రూ.23 కోట్లు విరాళంగా అందించిన దాత మురళీకృష్ణను ముఖ్యమంత్రి జగన్ అభినందించారు. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నిర్మించిన వీపీఆర్ విశ్రాంతి గృహాన్ని సీఎం ప్రారంభించారు.

పాఠ్యపుస్తకాల్లో భగత్‌సింగ్ జీవిత చరిత్ర: శివారెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ : భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి కోరారు. ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో భగత్ సింగ్ 115వ జయంతిని విజయవాడ కృష్ణలంక జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అధ్యక్షతన జరిగిన సభలో శివారెడ్డి మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఇంక్విలాబ్ నినాదంతో గడగడలాడించిన సర్దార్ భగత్ సింగ్ భారతదేశ సంపూర్ణ స్వాతంత్రం కోసం 23 ఏళ్ల వయసులో ఉరిమాలను వరమాలగా ముద్దాడిన యోధుడని కొనియాడారు. నాటి స్వాతంత్ర్య పోరాట చరిత్ర భగత్ సింగ్‌కి ముందు భగత్ సింగ్ తరువాత అని చెప్పుకునే స్థాయిలో ఆయన మిలిటెంట్ పోరాటాలు నడిపిన భయమెరుగని భారతీయుడన్నారు. నాడు తెల్లోడి చేతుల్లో ఉన్న దేశం నేడు కార్పొరేటోడి చేతుల్లోకి మారిపోయింది తప్ప మనకి ఇంకా స్వాతంత్ర్య రాలేదన్నారు. మనం తినే తిండితో సహా అన్ని కార్పొరేటోడే నిర్ణయిస్తున్నాడని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భగత్ సింగ్ లాంటి పోరాట యోధుల చరిత్రలను పాఠ్య పుస్తకాల్లో నుంచి మతోన్మాదం ముసుగులో తొలగించే కుట్రలకి పాల్పడుతున్నారని ఆరోపించారు. అందరికి అందాల్సిన సమాన విద్యకి కాషాయ రంగును పులుముతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్య కాషాయీకరణకు వ్యతిరేకంగా, పాలకుల నుంచి, కార్పొరేట్ల నుంచి దేశాన్ని రక్షించేందుకు నిర్విరామ పోరాటాలు చేస్తుందన్నారు. భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, ఆయనకు భారత్ రత్న ఇవ్వాలని, భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ద్వారా దేశంలో నిరుద్యోగులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, కళాశాలల లెక్చరర్స్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి సాయికుమార్, నాయకులు చందు, అయ్యప్ప విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఉపకులపతిగా రాజశేఖర్ బాధ్యతల స్వీకరణ



విశాలాంధ్ర-పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వ విద్యా లయ 17వ ఉపకుల పతిగా ఆచార్య పట్టేటి రాజశేఖర్ బుధవారం పదవి బాధ్యతలు చేపట్టారు. రాజశేఖర్ ను ఉపకులపతిగా నియమించినట్లు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరి చందన్ పేరిట బుధవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదల య్యాయి. బుధవారం విశ్వవిద్యాల యానికి వచ్చిన రాజశేఖర్‌కు ఉపాధ్యాయ, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధ కులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. దాదాపు మూడేళ్లుగా నిరీక్షిస్తున్న శాశ్వత ఉప కులపతి నియామక ఉత్వర్వులు వెలువడంపై విశ్వవిద్యాలయం ఆనందం వ్యక్తం చేసింది.

ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ఏపీ

కేఎల్ వర్సిటీలో సేఫ్ లైఫ్ క్లబ్ ప్రారంభంలో మంత్రి రజిని

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: త్వరలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా నిలుస్తుందని రాష్ట్ర వైద్య, విద్యాశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అవగాహనా, చైతన్య కార్యక్రమాలలో ఇప్పటికే ప్రథమ స్థానంలో నిలుస్తోందని, ప్రస్తుత జీవన విధానంలో మనిషికి ఆరోగ్యానికి మించినది మరొకటి లేదన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధ్వర్యంలో బుధవారం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ వారు వర్సిటీలో నూతనంగా ఏర్పాటుచేసిన సేఫ్ లైఫ్ క్లబ్, రెడ్ రిబ్బన్ క్లబ్ ప్రారంభోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ కరోనా వలన మనం చాలా నేర్చుకున్నామని, ముందు జాగ్రత్త చర్యలు ఎంతో అవసరమని, యోగ, పౌష్టికాహారం ఆరోగ్యానికి కీలకమని చెప్పారు. సేఫ్ లైఫ్ ప్రచారంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమని చెప్పారు. అనంతరం క్లబ్స్ వెబ్ సైట్, గోడ పత్రిక, ఫెలోషిప్, బ్యాడ్జిలను మంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జీఎస్ నవీన్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో శ్రమతో కూడిన మార్పు కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. దేశ భవిష్యత్తు మార్పు కోసం ప్రతి ఒక్కరూ ఈ ప్రచారంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. యూనిసెఫ్ ముఖ్య క్షేత్ర పర్యవేక్షణాధికారి ఎం. రసిడియా మాట్లాడుతూ యూనిసెఫ్ ప్రజల ఆరోగ్యంపై ప్రచారం చేస్తుందని, తల్లుల నుండి పిల్లలకు ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా టీబీ రోగులకు ఎయిడ్స్ సోకకుండా కష్టపడుతున్నామన్నారు. సోషల్ మీడియా ద్వారా ఈ ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు బాల్య వివాహాలు, చిన్న వయసులో గర్భం దాల్చడం వంటి వాటిపైనా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఆరోగ్యంతో పాటు చదువు, పౌష్టికాహారం, సురక్షిత లైంగిక చర్య అవసరమని గుర్తు చేశారు. సేఫ్ లైఫ్‌పై ప్రచారం చేయాలని, మార్పు కష్టం కావచ్చు కానీ అసాధ్యం కాదన్నారు. కేఎల్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ మాట్లాడారు. స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ డైరెక్టర్ పి. సాయి విజయ్‌కు మంత్రి చేతుల మీదగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఎక్సలెంట్ అవార్డును, వర్సిటీకి ప్రత్యేక జ్ఞాపికను ప్రదానం చేశారు. అనంతరం వీడియో పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అతిథులను దుశ్శాలువ, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

సంపాదకీయం

పి.ఎఫ్.ఐ. నిషేధం సరే కానీ...

ఇస్లామిక్ తీవ్రవాద సంస్థ అనుకుంటున్న పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పి.ఎఫ్.ఐ.)ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిషేధించింది. ఈ సంస్థ రాజకీయాలలో నేరుగా పాల్గొనదు. కానీ ముస్లింల సాధికారికత, అభ్యున్నతి మొదలైన లక్ష్యాల సాధన కోసమే పని చేస్తామని చెప్పుకుంటుంది. ఆచరణలో ఆ సంస్థ ప్రవర్తన ఈ ప్రకటనకు అనుగుణంగా లేదు అన్న అనుమానాలు చాలా రోజులనుంచే ఉన్నాయి. అందువల్ల పి.ఎఫ్.ఐ.ని నిషేధిస్తే ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఆహ్వానించాయి తప్ప విమర్శించలేదు.

ఇలా ఆహ్వానించిన పార్టీలలో ముస్లిం లీగ్ కూడా ఉండడం ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ పి.ఎఫ్.ఐ. తీవ్రవాద కార్యకలాపాలను ఖండిస్తూనే నిషేధాన్ని వ్యతిరేకించారు. వారం రోజుల కిందట దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాలలో పి.ఎఫ్.ఐ. కార్యాలయాలపై జాతీయ దర్యాప్తు సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ లాంటి వ్యవస్థలు దాడులు చేశాయి. వారం తిరక్కుండానే రెండో సారి కూడా దాడులు జరిగిన తరవాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ సంస్థను నిషేధించింది. రెండువందల కన్నా ఎక్కువ మందిని నిర్బంధించారు. పి.ఎఫ్.ఐ.తో సంబంధం ఉన్న లేదా అనుబంధ సంస్థలుగా ఉన్న వాటిని కూడా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యు.ఎ.పి.ఎ.) కింద నిషేధించారు. ఈ నిషేధం అయిదేళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ నెల 22న, 27న దేశవ్యాప్తంగా వివిధ చోట్ల పి.ఎఫ్.ఐ. నెలవుల మీద దాడుల తరవాత కేంద్ర ప్రభుత్వం ఈ సంస్థను నిషేధించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఈ సంస్థ, దాని అనుబంధ సంఘాలు "చట్ట వ్యతిరేక" కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనీ ఇవి "దేశ సమగ్రతకు, సార్వభౌమాధికారానికి, భద్రతకు ముప్పు కలిగించేలా ఉన్నాయి" అని హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సంస్థ కార్యకలాపాలవల్ల దేశంలో మత సామరస్యానికి విఘాతం కలుగుతోందన్నది కేంద్ర ప్రభుత్వ వాదన. ఈ సంస్థకు బంగ్లాదేశ్‌లోని జమాత్-ఉల్-ముజాహిదీంతోనూ. ఇరాక్, సిరియాలోని ఇస్లామిక్ (ఐ.ఎస్.ఐ.ఎస్.)తోనూ సంబంధాలున్నాయని హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పి.ఎఫ్.ఐ., దాని అనుబంధ సంస్థలు బహిరంగంగా అయితే సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన సంస్థగా వ్యవహరిస్తుంది. కానీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన, రాజ్యాంగ వ్యవస్థకు వ్యతిరేకమైన రీతిలో పని చేస్తుందన్న ఆరోపణలు ఉన్నాయని హోం మంత్రిత్వ శాఖ నిషేధ ఉత్తర్వులో పేర్కొన్నారు. పి.ఎఫ్.ఐ.కి అనుబంధంగా పనిచేసే సోషల్ డెమొక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్.డి.పి.ఐ.) మాత్రమే నిషేధాన్ని వ్యతిరేకించింది. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ఆరోపించింది. బీజేపీ విధానాలను బహిరంగంగా విమర్శించే వారి విషయంలో కత్తి కట్టినట్టు వ్యవహరిస్తున్నారని ఎస్.డి.పి.ఐ. జాతీయ అధ్యక్షుడు ఎం.కె. ఫైజీ విమర్శించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్, బీజేపీ ఇతర నాయకులు సహజంగానే ఈ నిషేధాన్ని ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జై రాం రమేశ్ తమ పార్టీ అన్ని రకాల అంటే మెజారిటీ, మైనారిటీ వర్గాల మతతత్వాన్ని వ్యతిరేకిస్తుందని తెలియజేశారు. పి.ఎఫ్.ఐ.ని నిషేధించడం హేతుబద్ధమైందేనని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ శాసనసభ్యుడు ఎం.కె. మునీర్ వ్యాఖ్యానించారు. ఆర్.ఎస్.ఎస్. కు వ్యతిరేకంగా కూడా సెక్యులర్ పద్ధతుల్లో పోరాడవలసిన అవసరం ఉందని ఆయన అంటున్నారు. కర్నాటక కాంగ్రెస్ నాయకుడు సిద్ధరామయ్య సైతం "మేం శాంతికి, చట్టానికి భంగం కలిగించే వారిపై చర్య తీసుకోవడాన్ని మేము వ్యతిరేకించబోం" అని అన్నారు. అయితే అదే పద్ధతిలో శాంతికి భంగం కలిగిస్తున్న ఆర్.ఎస్.ఎస్. లాంటి వ్యవస్థల మీద కూడా చర్య తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు అధికారంలో ఉన్నది ఆర్.ఎస్.ఎస్. రాజకీయ అంగమైన బీజేపీ కనక అలాంటి చర్య గురించి ఊహించనైనా లేం. కానీ గాంధీజీ హత్య తరవాత, ఎమర్జెన్సీ సమయంలో ఆర్.ఎస్.ఎస్.ను కూడా నిషేధించిన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి.

రాజకీయ హత్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై గతంలో అనేక సార్లు పి.ఎఫ్.ఐ. కార్యకర్తలను అరెస్టు చేశారు. ఇస్లాం ను అవమానిస్తున్నారన్న ఆరోపణతో ఆ సంస్థ వారు దాడులకు పాల్పడిన ఉదంతాలూ ఉన్నాయి. కేరళలో ఒక కళాశాల అధ్యాపకుడు టి.జె. జోసెఫ్ చేయి నరికిన ఉదంతాలూ ఉన్నాయి. పి.ఎఫ్.ఐ.ని వ్యవస్థాపకులలో కొందరికి ఇదివరకే నిషేధించిన స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (ఎస్.ఐ.ఎం.ఐ. - సిమి)తో సంబంధాలున్నాయన్న ఆరోపణ ఎప్పటి నుంచో ఉంది. నిజానికి సిమీని నిషేధించిన తరవాతే 2007 లో మరో రూపందాల్చి పి.ఎఫ్.ఐ.అవతరించింది. దేశంలో ముస్లింలకు భద్రత లేదు అన్న కారణంతో ఆ వర్గం ప్రజలలో తీవ్రవాద భావాలు జొప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు చాలా కాలంగానే ఉన్నాయి. పి.ఎఫ్.ఐ. కార్యకర్తలకు అంతర్జాతీయ తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నాయని కూడా అంటున్నారు. కేరళలోని నేషనల్ డెమొక్రాటిక్ ఫ్రంట్, కర్నాటక ఫోరం ఫర్ డిగ్నిటీ, తమిళనాడులోని మనితా నీతి పసరాయ్ అనే మూడు సంస్థలు కలిసి సిమీని నిషేధించిన తరవాత 2007లో పి.ఎఫ్.ఐ.గా అవతరించాయంటున్నారు. పి.ఎఫ్.ఐ. ఎప్పుడూ ఎన్నికలలో పోటీ చేయలేదు. కానీ ముస్లింలలో సామాజిక చైతన్యం పెంచడానికి, మతపరమైన కార్యకలాపాలు ప్రోత్సహించడానికి కృషి చేస్తూ ఉంటుంది. నేరుగా రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనే సంస్థలను రాజకీయంగా ఎదుర్కోవడానికి ప్రయత్నించవచ్చు. హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయనుకునే విశ్వ హిందూ పరిషత్తు, హిందూ జాగరణ్ వేదిక లాంటివి కూడా ప్రత్యక్ష రాజకీయాలతో ప్రమేయం పెట్టుకోవు. కానీ ముస్లింల నుంచి హిందువులకు ముప్పు ఉందని ప్రచారం చేసి హిందువులలో ఒక రకమైన భయ వాతావరణం సృష్టించి హిందువులను సమీకరించి రాజకీయంగా బీజేపీకి అనుకూలంగా జన సమీకరణకు పాల్పడడం చూస్తూనే ఉన్నాం. మతతత్వం మైనారిటీ మతాలలో ఉండడం కచ్చితంగా ప్రమాదకరమే. కానీ మెజారిటీ మతస్థుల్లో మతతత్వాన్ని పెంచి పోషించడం అంతకన్నా వినాశకరం. మెజారిటీ మతతత్వాన్ని ప్రోత్సహించే బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచీ ముఖ్యంగా నరేంద్ర మోదీ ఏలుబడిలో విద్వేష ప్రచారం ఎంత ఎక్కువైందో చూస్తూనే ఉన్నాం. మత వ్యవహారాలు వ్యక్తిగతంగా ఉన్నంత కాలం ఎవరూ అభ్యంతర పెట్టవలసిన పని లేదు. కానీ అది మతోన్మాదంగా మారితే, ముఖ్యంగా మెజారిటీ మతం వారిలో ఈ వికృత ధోరణి పెరిగితే కలిగే ముప్పు ఊహకు కూడా అతీతమైంది. దేశాన్ని హిందూ రాష్ట్రంగా మారుస్తామన్న హుంకరింపులు ఈ మధ్య తరచుగా వినిపిస్తున్నాయి. పి.ఎఫ్.ఐ. లాంటి సంస్థల ఆగడాలను నిలవరించే చట్టపరమైన చర్యలు తీసుకోవడాన్ని వ్యతిరేకించవలసిన పని లేదు. కానీ విద్వేషం రెచ్చగొడ్తున్న మెజారిటీ మతతత్వ వాదుల చేతిలో అధికారం ఉంటే దానికి నిష్కృతి ఏమిటి అన్న ప్రశ్నకు ప్రస్తుతం సమాధానం కనిపించడం లేదు.

నదులు - మానవ జీవనాడులు

నదులు మానవ జీవన నాడులు లాంటివి. మానవ మనుగడ కొరకు ఎంతో దోహదం చేస్తున్నాయి. నదులు మనుషులకు తాగు నీరు, సాగు నీరు అందిస్తున్నాయి. నదుల్లో జీవరాశులు జీవించడం వలన మత్స్య సంపద పెరుగుతుంది. నదులు జల రవాణాకు ఉపయోగపడుతున్నాయి. బొగ్గును మండించి విద్యుత్ ఉత్పత్తి చేసే థర్మల్ పవర్ ప్లాంట్‌కు నీరు ఎంతో అవసరం. ఒక మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి కొరకు ఒక లక్ష గ్యాలన్ల నీరు అవసరం. కనుక ఎక్కువ శాతం థర్మల్ పవర్ కేంద్రాలు నది పరివాహక ప్రాంతాల్లో నిర్మించడం జరిగింది. అలాగే ఒక కిలో కాగితం తయారు చేయాలంటే పది నుంచి ఇరవై ఐదు లీటర్ల నీరు అవసరం. నదులలో నీరు అధికంగా నిల్వ ఉంటే బహుళార్థక ప్రాజెక్టులు నిర్మించుకొని మానవులకు నీటి కొరత లేకుండ చేస్తున్నాయి. కానీ నేడు పట్టణీకరణ పెరిగి భవన నిర్మాణం కొరకు నదుల్లోని ఇసుక తరలించడం వలన నదులు ఎండిపోయే ప్రమాదం ఉంది. నది పరివాహక ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమలు, చర్మ పరిశ్రమల ద్వార వచ్చిన నీటిని శుద్ధి చేయక నదులలోకి వదలడంతో నీరు కలుషితమై జీవకోటికి నష్టం జరుగుతుంది. నదుల గురించి ప్రజలకు అవగాహన పెంచడానికి, వాటి పరిరక్షణను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నాలుగవ ఆదివారం ప్రపంచ నదుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దీనిలో ప్రతి సంవత్సరం 60 దేశాలు పాల్గొంటాయి. నేడు, వాతావరణ మార్పు, వేగవంతమైన పట్టణీకరణ కారణంగా నదులు, మానవులు ఎదుర్కొంటున్న అపారమైన సవాలును ఎదుర్కొంటున్నాయి. 2005, మార్క్ ఏంజెలో, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన నదీ పరిరక్షకుడు, ఆయన వాటర్ ఫర్ లైఫ్ క్యాంపెయిన్ సందర్భంగా ఐక్యరాజ్యసమితిని సంప్రదించారు - గ్రహం అంతటా ముప్పు పొంచి ఉన్న నీటి వనరుల గురించి అవగాహన పెంచడానికి దశాబ్దం పాటు ప్రయత్నం చేశాడు. ఏంజెలో ప్రచారానికి యాంకర్‌గా సహాయం చేయడానికి వార్షిక ప్రపంచ నదుల దినోత్సవం కోసం వాదించారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీలు గుర్తించాయి.

మొదటి ప్రపంచ నదుల దినోత్సవాన్ని డజనుకు పైగా దేశాల్లో జరుపుకున్నారు. ఇప్పుడు, వార్షిక ఈవెంట్ 60 కంటే ఎక్కువ దేశాలలో వేడుకలు, మిలియన్ల మంది ప్రజల భాగస్వామ్యంతో గుర్తించారు. నదులు పర్యావరణంలో అంతర్భాగంగా ఉన్నాయి. పెరుగుతున్న మానవ జనాభా నదులకు విపరీతమైన నష్టాన్ని కలిగించింది..మార్క్ ఏంజెలో ప్రపంచ ప్రఖ్యాత నదుల సంరక్షణ కార్యకర్త. అతను కెనడాలోని బ్రిటీష్ కొలంబియాలోని బర్నాబీకి చెందినవాడు. ఏంజెలో ప్రపంచ నదుల దినోత్సవం స్థాపకుడు, ఛైర్మన్. అతను బ్రిటీష్ కొలంబియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రివర్స్ ఇన్‌స్టిట్యూట్ చైర్ ఎమెరిటస్ కూడా. ఏంజెలో 1,000 నదులలో ప్రయాణించారు, బహుశా ప్రపంచంలోని అందరికంటే ఎక్కువ. అతని ప్రోగ్రామ్, 'రివర్‌వరల్డ్', ఉత్తర అమెరికాలో విజయవంతమైంది ప్రదర్శన వెబ్‌సైట్ 40 మిలియన్లకు పైగా సందర్శనలను కలిగి ఉంది. నదుల పరిరక్షణకు చేసిన కృషికి మార్క్ అనేక అవార్డులను గెలుచుకున్నారు. అతను ఆర్డర్ ఆఫ్ బ్రిటీష్ కొలంబియా ఆర్డర్ ఆఫ్ కెనడా, కెనడాలో అత్యున్నత గౌరవం అందుకున్నాడు. అతను ఐక్యరాజ్యసమితి స్టీవార్డ్‌షిప్ అవార్డు నేషనల్ రివర్ కన్జర్వేషన్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. మార్క్ ఏంజెలో ప్రకారం, "నదులు మన భూ గ్రహం ధమనులు అవి నిజమైన అర్థంలో జీవనాధారాలు".

ఆళవందార్ వేణుమాధవ్

రాష్ట్రాల హక్కుల హరణలో 'మేటి' మోదీ

టి.వి.సుబ్బయ్య

రాష్ట్రాల హక్కులను హరించడంలో ప్రధాని నరేంద్రమోదీ మేటి. ఈ విషయంలో విద్య, వైద్యరంగాలు,పన్నుల విధింపు తదితర అంశాలు అనేకం ఉన్నాయి. ఏదైనా రాష్ట్రం గట్టిగా మాట్లాడితే చేతిలో ఈడీ, సీబీఐ వంటి అయుధాలు ఉండనే ఉన్నాయి. తాజాగా మనకు ఎలక్ట్రానిక్స్‌లో ఎక్కువగా అవసరమవుతున్న చిప్స్ తయారీ ప్రాజెక్టును మహారాష్ట్రలో ఏర్పాటు చేయడానికి అన్ని ఏర్పాట్లు జరిగిన తర్వాత దాన్ని గుజరాత్‌కు తరలించడం హక్కుల హరణ జాబితాలో చేరింది. గుజరాత్‌లో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పుడక్కడి రాజకీయ వాతావరణం బీజేపీకి అంతగా అనుకూలంగా లేదని వార్తలు వస్తున్న నేపథ్యంలో వేదాంత-ఫాక్స్‌కాన్ ఏర్పాటుచేసే సెమీ కండక్టర్ ప్రాజెక్టును గుజరాత్‌కు తీసుకువెళ్లారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రాజక్టు యాజమాన్యం ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వ హయాంలోనే అనేక నెలల క్రితం చర్చలు జరిపి ప్రాజెక్టు నెలకొల్పాలన్న అవగాహనకు వచ్చారు. త్వరలో ఈ ఒప్పందంపై ప్రభుత్వంతో ప్రాజెక్టు యాజమాన్యం సంతకాలు చేయాలని కూడా నిర్ణయం జరిగింది. ఈ లోపు మోదీ ఎన్నికల వ్యూహంలో ఈ ప్రాజెక్టు చేరింది. రాజు తలచుకొంటే జరగని పనేముంటుంది? ప్రాజెక్టు ఏర్పాటు స్థలం మారడానికి రాజకీయ వత్తిళ్లని ప్రత్యేకించి ప్రస్తావించనవసరంలేదు. 2014 మేలో మోదీ ప్రధాని పదవి చేపట్టిన నాటి నుంచి అనేక రాష్ట్రాలకిచ్చిన హామీలను సైతం ఉల్లంఘించి గుజరాత్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల నిధుల కేటాయింపు తదితర అనేక విషయాలలో ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రాజెక్టు ప్రత్యేకత ఏమిటి?

22 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించనున్న సంయుక్త ప్రాజెక్టు ఇది. ఇంటిగ్రేటెడ్ డిస్‌ప్లే అండ్ సెమికండక్టర్ ఫ్యాబ్రికేషన్ ఎకో సిస్టమ్ ప్రాజెక్టు మన దేశంలో ఆధునిక సాంకేతిక రంగంలో అతి పెద్ద గ్రీన్‌ఫీల్డు ప్రాజెక్టు ఇదే అవుతుంది. ప్రాజెక్టుకు మన కేంద్ర ప్రభుత్వం 30 బిలియన్ అమెరికన్



డాలర్లు పెట్టుబడి పెడుతుంది. మహారాష్ట్ర ఆధునిక సాంకేతిక రంగ ఉత్పత్తుల్లో ఇతర రాష్ట్రాల కంటే ముందుంది. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు ఇవ్వనున్న సౌకర్యాలు, వెసులుబాట్లను పేపరుమీద రాసుకున్నారు. రూ.2800 కోట్లు పెట్టుబడితో సబ్సిడీని ఇస్తుంది. వేదాంత-ఫాక్స్‌కాన్ నెలకొల్పడానికి యాజమాన్యానికి ఈ యూనిట్‌ను మొత్తం రూ.40,000 కోట్ల పెట్టుబడిగా సమకూరుస్తుంది. అలాగే పూనెలోని 11 వందల ఎకరాల భూమిని కేటాయిస్తుంది. 400 ఎకరాలు ఉచితంగా తక్కిన 700ఎకరాలు అక్కడిరేటులో 75 శాతం ఖరీదుకు కేటాయిస్తామని రాసుకున్నారు. గుజరాత్‌లో 200 ఎకరాలు ఉచితంగా తక్కిన 900 ఎకరాలు అక్కడిరేంటులో 75 శాతం ధరకు ఇస్తుంది. ప్రాజెక్టు ఏర్పాటుకు ఎక్కడైనా 1100 ఎకరాలు అవసరం. అన్ని విషయాలు పరిశీలించిన తర్వాత ప్రాజెక్టును గుజరాత్‌లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించామని వేదాంత ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ప్రకటించారు. ఏ ప్రాజక్టు నెలకొల్పాలన్నా కేంద్రప్రభుత్వం సహకారం ఉండాల్సిందే. ఇక విద్యుత్ 1200 మెగావాట్‌లో యూనిట్‌కు రెండు రూపాయలు పదేళ్లపాటు ఇస్తానని గుజరాత్ ప్రభుత్వం చెప్పింది. మహారాష్ట్ర 20 ఏళ్ల వరకు యూనిట్ మూడు రూపాయలకు, పదేళ్ల దాకా 7.5శాతం విద్యుత్ సుంకాన్ని మినహాయిస్తామని వాగ్దానం చేసింది. అలాగే నీటి సరఫరాకు రూ.337 కోట్లు సబ్సిడీ ఇవ్వడానికి నిర్ణయించింది. ఇక వ్యర్థనీటి నిర్వహణకు రూ.812 కోట్లు సబ్సిడీ ఇస్తామని కూడా హామీ ఇచ్చింది. అయినప్పటికీ ప్రాజెక్టుని గుజరాత్‌లోనే నెలకొల్పుతామని అగర్వాల్ ట్వీట్ చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనేక వేలమందికి ఉద్యోగాలు లభిస్తాయి.

అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడిగా ఉండగా 2017లో విస్కాన్సిన్‌లో ప్రాజెక్టు ఏర్పాటుకు ఫాక్స్‌కాన్‌కు అనేక సబ్సిడీలను ప్రకటించారు. అయితే 2020 నవంబరులో ఎన్నికల తర్వాత ట్రంప్ ఓడిపోయి కొత్త అధ్యక్షుడిగా జో బైడెన్‌వచ్చాక స్వరూపాన్నే మార్చివేసింది. దీంతో అక్కడ ప్రాజెక్టు డోలాయమానంలో పడిపోయింది. ఫాక్స్‌కాన్ పెట్టుబడులు, ఉద్యోగాలను వేల నుండి వందలకు తగ్గించింది. మనదేశంలో మైక్రోచిప్స్ వినియోగం చాలా ఎక్కువగా ఉంది. ఇంతవరకు సెమీకండక్టరు ప్రాజెక్టు లేదు. దేశంలో 2020లో కోటిపదిలక్షల రూపాయల విలువైన ఎలక్ట్రానిక్ చిప్స్‌ను వినియోగించినట్లుగా ఐటీ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ ఒకసారి పార్లమెంటులో వెల్లడించారు. 2026 నాటికి దేశంలో 300 అమెరికన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను సాధించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దేశంలో వినియోగానికి 74.7 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు కావాలంటే 14.5 బిలియన్ డాలర్లు విలువచేసే సెమీ కండక్టర్లను దిగుమతి చేసుకోవలసి ఉంటోందని అధికారిక అంచనాలున్నాయి. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఇతర అంశాలపై ఉన్నప్పుడు అనుకున్న ప్రాజెక్టులేవీ సకాలంలో పూర్తికావు. మోదీ ప్రభుత్వంలో ప్రాజక్టుల్లో తీవ్రజాప్యం జరుగుతోందని ప్రభుత్వం వెల్లడించిన వివరాలు తెలియజేశాయి. ఇక రాజకీయకోణంలో ప్రతి అంశాన్ని చూస్తున్న బీజేపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి బిలియనీర్ల సంఖ్యను పెంచడంలో సామాన్యులపై భారాలు మోపడంలోఉంది.

పైలట్ - గెహ్లాట్ జోడో యాత్ర అవసరం

వి-మెయిల్

భారత్ జోడో యాత్రతో తన పునరుజ్జీవంపై ఆశలు రేకెత్తించిన కాంగ్రెస్ పార్టీకి ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ఆ పురాతన రాజకీయ సంస్థలో లోపలి పగుళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో బయటపడ్డాయి. అయితే వాటిని పైపైన ప్లాస్టరింగ్‌తో బయటకు కనబడకుండా చెయ్యడంతో సరిపెట్టకుండా సమస్య మూలాల్లోకి వెళ్తేనే ఉపయోగం ఉంటుంది. అందులో మళ్ళీ అధిష్ఠానం పైనే ఎక్కువ బాధ్యత ఉంటుంది. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రెండు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉంది. అందులో రాజస్థాన్ ఒకటి. అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్న అశోక్ గెహ్లాట్‌ని జాతీయ పార్టీ అధ్యక్షుడిగా పోటీలో నిలపాలని అధిష్ఠానం భావించి, అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుంది. ఆయనపై తిరుగుబాటు చేసి,తాత్కాలికంగా వెనక్కి తగ్గి ఉన్న సచిన్ పైలట్‌ని సహజంగా ముఖ్యమంత్రిని చెయ్యొచ్చని భావించింది. అయితే అందుకు గెహ్లాట్ సమ్మతిస్తారా లేదా అన్నది చూసుకోలేదు. 'ఎందుకు సమ్మతించరులే' అన్న భావం కనపర్చింది. పైగా ఒక వ్యక్తి ఒక పదవి అంటూ గెహ్లాట్‌కి ముకుతాడు వేసింది. రాజస్థాన్‌లో స్థానికంగా పట్టు ఉన్న ఆయన వెనుక ఇప్పుడు 92 మంది శాసన సభ్యులు నిలిచారు.

అధిష్టానం నిర్ణయాన్ని బేఖాతరు చేశారు. దిల్లీ నేతలు పరిణామాలన్నీ ముందే ఊహించి, నివారించదగ్గ ప్రయత్నాలు ఏమీ చేసినట్టు లేదు. ఇప్పుడు అంతా బహిరంగం అయ్యాక మిగిలింది తక్కువ నష్టంతో బయటపడే మార్గాలు వెతకడమే. సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోకుండా పెంచుకున్న సమస్య ఇది. ప్రజాస్వామికంగా అధ్యక్ష ఎన్నికలు జరుపుదామనుకున్న పార్టీ,తన అధికారిక అభ్యర్థి పట్లనే అనాలోచితంగా వ్యవహరించింది. ఆయన అభిప్రాయమేమిటో, ఆయన వెనక ఉన్న బలమెంతో, వారి అభ్యంతరాలేమిటో తెలుసుకోకుండా, తన అభిప్రాయాన్ని రుద్దింది. ఇప్పుడు అవమానపడ్డ యువనేత రాజకీయంగా వేరే మార్గాలు చూసుకుంటే అందుకు మొదటి బాధ్యత ఆయన్ని వీధిలో పెట్టిన అధిష్ఠానందే. ఇప్పుడు ఆ పార్టీ చెయ్యాల్సింది పైలట్ గెహ్లాట్ జోడో యాత్ర. ఇద్దర్నీ వదులుకోకుండా పార్టీని బలోపేతం చేసుకోవాలి. ఎక్కడికక్కడ స్థానిక నేతల్ని బలోపేతం చేస్తూ, వారి అభిప్రాయాలకు విలువనిస్తూ, వారిపై నైతిక అధికారం సాధించి, మాట వినేలా చూసుకొనే పెద్దరికం సంపాదించడమే అధిష్ఠానం కర్తవ్యం. కంటి చూపుతో శాసిస్తామంటే కుదిరే రోజులు కావివి.

– డా.డి.వి.జి.శంకరరావు

ఐక్యరాజ్యసమితి ఐక్యత మానవత్వ వేదిక కావాలి

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ప్రపంచంలో మతవాద పాలన పెరుగుతోంది. ప్రపంచ ఐక్యత దెబ్బతింటోంది. ఆర్థికంగా బలహీనపడిన అమెరికా మితవాదాన్ని పెంచుతోంది. మితవాదం మానవత్వాన్ని మంటగలుపుతోంది. అమెరికా ఆధిపత్య ఐక్యరాజ్యసమితి దీన్ని ఆపలేకపోతోంది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో వినాశకర సాయుధ పోరాటానికి దిగజార్చిన పరిస్థితులు నేడు మరింత భయంకరంగా మారాయి. 21.09.2022 న ఐరాస సర్వసభ్య సభ 77వ వార్షిక సమావేశంలో అమెరికా అధ్యక్షుడు బిడెన్, రష్యా సిగ్గు లేకుండా ఐరాస సిద్ధాంతాలను ఉల్లంఘించిందన్నారు. ఈ ఉల్లంఘనలలో అమెరికా పాత్రను బిడెన్ ప్రస్తావించలేదు. తమ పరోక్ష ప్రాతినిధ్య యుద్ధాన్ని ముగించే ఉద్దేశాన్ని ప్రకటించలేదు. ఉక్రెయిన్‌పై ఆయుధీకరణను పెంచమని, ఈ పక్షపాత ప్రవర్తనతో, బిడెన్ మిత్రదేశాలను ప్రోత్సహించాడు.

ఉక్రెయిన్ వివాదం ముగియడానికి బదులు తీవ్రమయ్యేలా ఉంది. ఈ తీవ్రత ఎంత పెరుగుతుందో చెప్పలేం. పోరాటం తీవ్రమయ్యే కొద్దీ అది విస్తృతమయే అవకాశం పెరుగుతోంది. ఇతర దేశాలకు, ముఖ్యంగా హాని చేసే దేశాలకు వీటి ప్రభావాలు విస్తరిస్తాయి. అమెరికా దాని మిత్ర దేశాలు, రష్యాపై మరిన్ని ఆంక్షలను విధించడానికి సిద్ధమవుతున్నాయి. రష్యాను బలహీన పర్చడమే వాటి లక్ష్యం. వీటితో ఐరాస, ప్రత్యేకించి భద్రతా మండలి బలహీనపడుతుంది. ప్రపంచ పాలనా వ్యవస్థ స్తంభిస్తుంది. పేదరికం, ఆకలి, పర్యావరణ కాలుష్యం, వాతావరణ మార్పు, భూతాపం, ప్రజారోగ్య ప్రమాదాలు పెరుగుతాయి. ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేసే తీవ్ర సమస్యల పరిష్కారంలో ఐరాస విఫలమవుతుంది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ 77వ జనరల్ అసెంబ్లీ ప్రారంభ వ్యాఖ్యలలో, 'ప్రపంచం ప్రమాదంలో పడింది, స్తంభించింది' అని హెచ్చరించే స్థాయికి పరిస్థితి దిగజారింది. ప్రపంచ దేశాలు నిష్క్రియాపరత్వంలో ఉన్నాయి. ట్రాఫిక్ జామ్‌లో ఆగిన వాహనాలలాగా కదలలేకుండా ఇరుక్కుపోయాయి.

మానవాళి భవిష్యత్తును ప్రమాదంలో పడేయగల అనేక వర్తమాన, భవిష్యత్తు సంబంధ మౌలిక అంశాలను, సహజ లక్షణాలను, కారకాలను ఐరాస సెక్రటరీ జనరల్ వివరించారు. కానీ ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న సంఘర్షణ, తత్సంబంధిత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పోలిస్తే వాతావరణ సమస్యలు, అభివృద్ధి చెందుతున్న ఆధునిక సాంకేతికతలకు సంబంధించి ఆయన ప్రస్తావించిన "అపాయాల అడవి", ఐరాస 2030 నిర్దేశిత అభివృద్ధి లక్ష్యాలపై పురోగతి లేకపోవడం వంటి అనేక అంశాలు ప్రపంచ అభివృద్ధిని ఎక్కువగా అడ్డుకుంటున్నాయి. ఐరాస ప్రధాన కార్యాలయంలో దేశాధినేతలు భయంకరమైన అనేక సమస్యలను వినిపించారు. సమస్యల్లో చిక్కుకున్న ప్రపంచ అశాంతి దృశ్యరూపాలను ప్రదర్శించారు.

న్యూయార్క్ నగరంలోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంపై ఎగురుతున్న ఐక్యరాజ్యసమితి పతాకం

సమస్యల పరిష్కారాల అత్యవసర ఆవశ్యకతలను సూచించారు. అయితే దేశాల మధ్య ఏకాభిప్రాయం లేదు. అవి అభిప్రాయ భేదాలతో విభజితమయ్యాయి.

సమస్యలకు పరిష్కారం కుదిరినా కదరకున్నా నేటికీ ప్రపంచ దేశాల నాయకులు ఐరాసను అంతిమ చర్చా వేదికగా భావిస్తారు. అయితే వారు ప్రపంచ పర్యవేక్షక సంస్థ ఐరాస ప్రస్తుత బలహీనతలను గుర్తించాలి. కలిసి పనిచేసే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. కలిసి పనిచేయాలి. ఐరాసను, ప్రత్యేకించి భద్రతా మండలిని, చీల్చి బలహీనపరిచే భౌగోళిక రాజకీయ ఆటలలో సభ్య దేశాల కొనసాగింపును అనుమతిస్తే, యుద్ధానంతర అంతర్జాతీయ పాలనా నిర్మాణం అసంబద్ధం అవుతుంది. దేశాలు మళ్లీ ఆటవిక చట్టాలకు లోబడే స్థితి దాపురిస్తుంది. ఐరాస సంస్కరణల గురించి చాలా చర్చ జరిగింది. ఐరాసను నిష్క్రియాపరత్వం నుండి కాపాడటమే నేటి ప్రధాన అవసరం. ఐరాస పని చేయాలంటే, సెక్రటరీ జనరల్ గుటెర్రెస్ విజ్ఞప్తి చేసినట్లు, దేశాలు "ఒకటిగా, ప్రపంచ కూటమిగా, ఐక్య రాజ్యాలుగా పనిచేయాలి". ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి మాటలు, చర్చల ద్వారా అనుకూల పరిస్థితులను కల్పించడంతో సంఘటిత ప్రయత్నాలను ప్రారంభించవచ్చు. ఐరాస మానవ హక్కుల మండలి 51వ సెషన్‌లో, 'అంతర్జాతీయ మానవ హక్కుల రాజకీయీకరణ ప్రమాదాలు' అనే అంశంపై19.9.2022 న చైనాలోని జిలిన్ విశ్వవిద్యాలయం అంతర్జాల సమావేశం నిర్వహించింది. మానవ హక్కుల రాజకీయీకరణ ప్రతికూల ప్రభావాన్ని తొలగించాలని, సహకారం, సంభాషణలతో అంతర్జాతీయ మానవ హక్కుల అభివృద్ధిని ప్రోత్సహించాలని ఈ సమావేశంలో నిపుణులు పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ మానవ హక్కుల రాజకీయీకరణ పాత ధోరణే. ఆర్థిక ఆంక్షలు, సాంకేతిక దిగ్బంధనాలు, సైనిక దాడులతో ప్రపంచ ఆధిపత్య కొనసాగింపునకు అమెరికా మానవ హక్కులను, ఆర్థిక సైనిక సమస్యలను, పదేపదే జోడించిందని జిలిన్ విశ్వవిద్యాలయ మానవ హక్కుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ లియు హాంగ్‌జెన్ అన్నారు. మానవ హక్కులను రాజకీయం చేయడం వల్ల మానవ హక్కుల విలువ దెబ్బ తింటుందని, అలాంటి సమస్యల పరిష్కారానికి ఐరాస వ్యవస్థలో సమాన చర్చలు, నిజాయితీ సహకారం ఉండాలని ఆమె అన్నారు. మానవ మర్యాద, మానవ హక్కుల సమావేశాలు, ప్రతి దేశం స్వతంత్ర్య మానవ హక్కుల మార్గాన్ని ఎంచుకునే హక్కుపై సార్వత్రిక గౌరవం ఉండాలని కూడా అన్నారు.

"పాశ్చాత్య మానవ హక్కుల భావనలో రాజకీయ ఘర్షణ సంబంధిత అంశాలు ఉన్నాయి. పాశ్చాత్య దేశాలు మానవ హక్కుల సమస్యలను రాజకీయ దృష్టితో గమనిస్తాయి. మానవ హక్కుల సమస్యల సాకుతో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటాయి." అని సెంట్రల్ సౌత్ యూనివర్సిటీ మానవ హక్కుల కేంద్రం డైరెక్టర్ జున్‌క్యాంగ్ అన్నారు. మానవ హక్కుల సిద్ధాంతం, వ్యవస్థ, అభ్యాసం, సంస్కృతి ఒక నిర్దిష్ట ప్రాంత ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సంప్రదాయాలలో పాతుకుపోతాయి. మానవ హక్కుల వైవిధ్యం సహజమే. అయితే పాశ్చాత్యదేశాలు తమ మానవ హక్కుల భావనను సాంస్కృతిక ఔన్నత్యం అనే అవగాహనతో ఇతరులపై రుద్దుతున్నాయని, ఇది అంతర్జాతీయ మానవ హక్కుల అమలుకు ఆటంకమని ఆయన అన్నారు. జాతీయ ప్రయోజనాలను అందించడానికి, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలకు, విదేశాల్లో సైనిక జోక్యాలకు సమర్థనగా మానవ హక్కులు ఆదర్శమైన సాకుగా పరిగణనలో ఉన్నాయని ఆయన చెప్పారు. "మానవ హక్కుల ప్రోత్సాహానికి ఘర్షణ కంటే సహకారం, సంభాషణలు సరైన మార్గం. ఇదే ఐరాస మానవ హక్కుల మండలి కార్యనిర్వాహక యంత్రాంగ ప్రాథమిక సూత్రం." అని కూడా ఆయన అన్నారు.మానవ హక్కుల రాజకీయీకరణ అంతర్జాతీయ మానవ హక్కుల చట్ట ఉద్దేశానికి విరుద్ధమని, అంతర్జాతీయ చట్ట సార్వత్రికతను అణగదొక్కుతుందని సంకై విశ్వవిద్యాలయం మానవ హక్కుల పరిశోధనా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ టాంగ్ యింగ్‌క్సియా అన్నారు. విదేశాంగ విధాన స్వీకరణకు, ఏకపక్షవాద అమలుకు, మానవ హక్కుల దౌత్య ప్రోత్సాహానికి మానవ హక్కులను ఒక సాధనంగా ఉపయోగించడం మానవ హక్కుల రాజకీయీకరణ సారాంశం అని ఆమె అన్నారు. సార్వత్రికత, మానవ హక్కుల భావనకు పునాది అని, అందరినీ కలుపుకొని పోవడమే మానవ హక్కుల చైతన్యం అని, ఈ రోజు మనం ఆచరిస్తున్న మానవ హక్కుల వ్యత్యాసాలకు సార్వత్రికత పరిష్కారంగా ఉండాలని టాంగ్ అన్నారు.

మనం మన పాలకవర్గ మతవాదాన్ని అడ్డుకోవాలి. సార్వత్రికతను, విశ్వజనీనతను పాటించాలి. బలహీనపడ్డ అమెరికా డాలర్ ఆధిపత్యాన్ని మరింత బలహీనపర్చాలి. సామ్రాజ్యవాద వ్యతిరేక అమెరికాయేతర ఆర్థిక సామాజిక కూటములను బలపర్చాలి. రాజ్యాంగ తటస్థతను పునరుద్ధరించాలి. పొరుగు దేశాలతో సఖ్యత సాధించాలి. రష్యా, చైనాలు సైనిక, వాణిజ్య యుద్ధాలను ఆపాలి. ఐరాస ద్వారా ప్రపంచ ఐక్యత, మానవత్వ వికాసాలను ప్రోత్సహించాలి.

వ్యాస రచయిత ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం
జాతీయ కార్యదర్శి, 9490 20 4545

ఇస్లాం రాజ్యం కోసం కుట్ర

- బాంబు తయారీ పత్రాలు... ఐసిస్ వీడియోలు
- పీఎఫ్ఐపై నిషేధానికి హోంశాఖ చెప్పిన కారణాలు

న్యూదిల్లీ: ఇస్లామిక్ అతివాద సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ), దాని అనుబంధ సంస్థలపై కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిషేధం విధించింది. పీఎఫ్ఐ సభ్యుల ఇళ్లు, కార్యాలయాలపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), ఇతర దర్యాప్తు సంస్థలతో కలిసి ఇటీవల భారీ ఆపరేషన్ చేపట్టింది. వారం వ్యవధిలో రెండుసార్లు జరిపిన ఈ సోదాల్లో 250 మందికి పైగా పీఎఫ్ఐ సభ్యులు, కార్యకర్తలను ఎన్ఐఏ అరెస్టు చేసింది. ఈ సోదాల్లో అనేక కీలక విషయాలు వెలుగులోకి రావడంతో కేంద్రం ఈ సంస్థపై చర్యలు తీసుకుంది. పీఎఫ్ఐపై నిషేధం విధించడానికి కారణాలేంటీ? సోదాల్లో ఏమి తెలిసింది? వంటి వివరాలను కేంద్ర హోంశాఖ, నిఘా వర్గాలు వెల్లడించాయి. పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా అత్యంత శక్తిమంతమైన ఇస్లామిక్ అతివాద సంస్థల్లో ఒకటి. పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలు దేశవ్యాప్తంగా 17 రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. హింస, నేరాలు, ఉగ్రవాదం, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన అనేక కేసుల్లో పీఎఫ్ఐ సభ్యులు నిందితులుగా ఉన్నారు. రెండు వర్గాల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే లక్ష్యంగా ఈ సంస్థ తమ సభ్యులకు శిక్షణ ఇస్తోంది. అనేక రాష్ట్రాల్లో పీఎఫ్ఐ సభ్యులు, దాని అనుబంధ సంస్థలపై 1300లకు పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. యూఏపీఏ, పేలుడు పదార్థాలు, ఆయుధాల నిరోధక చట్టాల కింద పోలీసులు, ఎన్ఐఏ అధికారులు ఈ కేసులు నమోదు చేశారు. పీఎఫ్ఐకి అంతర్జాతీయ ఉగ్రవాద ముఠాలతో సంబంధాలున్నాయని అనేకసార్లు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా కేరళలో కొంతమంది కార్యకర్తలు ఆ మధ్య ఇస్లామిక్ స్టేట్ సంస్థలో చేరి సిరియా, ఇరాక్, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాల్లో ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు ఆధారాలు బయటపడ్డాయి. ఈ క్రమంలోనే ఐసిస్‌తో కలిసి పనిచేస్తోన్న కొంతమంది కార్యకర్తలను ఎన్ఐఏ, రాష్ట్ర పోలీసులు గతంలో అరెస్టు చేశారు. పీఎఫ్ఐకి జమాత్ ఉల్ ముజాహిదీన్‌తోనూ సంబంధాలున్నట్లు ఆరోపణలున్నాయి. 2021లో కేరళలో ఓ ఆర్ఎస్ఎస్ కార్యకర్త హత్యకు గురయ్యాడు. 2019లో తమిళనాడులో హిందూ నేత వి.రామలింగాన్ని చంపారు. ఈ కేసుల్లో పీఎఫ్ఐ కార్యకర్తలు ప్రధాన నిందితులుగా ఉన్నారు. గతంలోనూ కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అనేక మంది హిందూ మద్దతుదారులను ఈ సంస్థ సభ్యులు హత్య చేసినట్లు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న పీఎఫ్ఐ సభ్యుల నుంచి అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ శిక్షణ వీడియోలు అప్పట్లో లభ్యమయ్యాయి.

2021 జూన్‌లో కేరళలోని కొల్లాం జిల్లాలో ఓ అటవీ ప్రాంతంలో పేలుడు పదార్థాలు, జిహాదీ సాహిత్యాన్ని పోలీసులు గుర్తించారు. ఈ అటవీ ప్రాంతాన్ని పీఎఫ్ఐ మిలిటరీ శిక్షణ కేంద్రంగా ఉపయోగిస్తోంది.

2013 ఏప్రిల్‌లో కేరళలోని కన్నూర్ జిల్లాలో గల పీఎఫ్ఐ శిక్షణ శిబిరంలో పెద్దఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు బయటపడ్డాయి.

అప్పట్లో దానిపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టగా 41 మంది పీఎఫ్ఐ సభ్యులను కోర్టు దోషులుగా తేల్చింది. యువతకు నైపుణ్యాల శిక్షణ ముసుగులో పీఎఫ్ఐ.. మిలిటరీ తరహా శిక్షణ ఇస్తోందన్న ఆరోపణలున్నాయి. ఓ వర్గానికి వ్యతిరేకంగా యువతలో ద్వేషభావాన్ని నింపుతూ దాడులకు శిక్షణ ఇస్తోందని దర్యాప్తులో తేలింది. సామాజిక సంస్థగా చెప్పుకొనే పీఎఫ్ఐ.. ఈ ఏడాది కర్ణాటకలోని ప్రముఖ హిందూ కార్యకర్త ప్రవీణ్ నెట్టారును అతి దారుణంగా హత్య చేసింది. ఈ కేసులో అరెస్టయిన వారంతా ఆ సంస్థ కార్యకర్తలే. పీఎఫ్ఐ తన కార్యకలాపాల కోసం దేశ విదేశాల నుంచి నిధులు అందుకుంటోంది. ఇవన్నీ అనుమానాస్పద వ్యక్తులు, సంస్థల నుంచి వస్తున్నవే. పీఎఫ్ఐకి చెందిన 100కు పైగా బ్యాంకు ఖాతాలు.. ఖాతాదారుల ఆర్థిక వివరాలతో సరిపోలట్లేదని దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. అందువల్ల, ఐటీ చట్టంలోని కొన్ని సెక్షన్ల కింద పీఎఫ్ఐ రిజిస్ట్రేషన్ హోదాను కేంద్రం ఉపసంహరించింది. ఇటీవల జరిపిన సోదాల్లోనూ ఉగ్ర కార్యకలాపాలకు సంబంధించి అనేక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ సంస్థ సభ్యుల ఇళ్లల్లో బాంబు తయారీ పత్రాలు, ఐసిస్ వీడియోలను అధికారులు గుర్తించారు. భారత్‌ను ఇస్లామిక్ రాజ్యంగా మార్చడమే లక్ష్యంగా ఈ సంస్థ కుట్ర పన్నినట్లు అధికారులు గుర్తించారు.

పీఎఫ్ఐ శాశ్వత నిషేధం కోసం 'ఉపా' ట్రిబ్యునల్‌కు కేంద్రం

న్యూదిల్లీ: రాడికల్ ఇస్లామిక్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ), దాని అనుబంధ సంస్థలను నిషేధించిన తరువాత, కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఐ పై నిషేధాన్ని ధ్రువీకరించడానికి సిట్టింగ్ దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని 'ఉపా' ట్రిబ్యునల్‌ను ఆశ్రయించనున్నది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) బుధవారం చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) నిబంధనల కింద పీఎఫ్ఐను ఐదేళ్లపాటు నిషేధించింది. కాగా పీఎఫ్ఐ పై నిషేధం 'ఉపా' ట్రిబ్యునల్ నిర్ధారణకు లోబడి 'తాత్కాలికం'. ప్రభుత్వం పీఎఫ్ఐని నిషేధించిన తర్వాత చట్ట అమలు సంస్థల పాత్ర గురించి కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి గోపాల్ కృష్ణ పిళ్లై వివరిస్తూ, 'సంస్థ సభ్యులను అరెస్టు చేస్తారు. దాని కార్యాలయాన్ని పూర్తిగా మూసివేస్తారు. బ్యాంకు ఖాతాలు వెంటనే స్తంభిస్తాయి' అని తెలిపారు. అలాగే పీఎఫ్ఐ సభ్యుల పై పూర్తి ప్రయాణ నిషేధం ఉంటుందని అన్నారు. చట్టాన్ని అమలు చేసే సంస్థలు కేసుల దర్యాప్తును కొనసాగిస్తాయి. పీఎఫ్ఐకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధించిన అన్ని కార్యకలాపాలు నిలిపివేయబడతాయని కూడా ఆయన వివరించారు. కాగా పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలు రిహాబ్ ఇండియా ఫౌండేషన్ (ఆర్ఐఎఫ్), క్యాంపస్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (సీఎఫ్ఐ), ఆల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్ (ఏఐఐసీ), నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ (ఎన్‌సీహెచ్ఆర్ఓ), నేషనల్ ఉమెన్స్ ఫ్రంట్, జూనియర్ ఫ్రంట్, ఎంపవర్ ఇండియా ఫౌండేషన్, కేరళకు చెందిన రిహాబ్ ఫౌండేషన్‌ను ఐదేళ్ల పాటు 'చట్టవిరుద్ధ సంస్థలు'గా నిషేధించినట్లు ఎంహెచ్ఏ జారీ చేసిన ఒక నోటిఫికేషన్ పేర్కొంది.

నిషేధాన్ని నిర్ధారించే ప్రక్రియ

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ఏదైనా సంస్థను నిషేధించడానికి నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత, నిషేధాన్ని నిర్ధారించడానికి 'ఉపా' ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవలసి ఉంటుంది. ట్రిబ్యునల్‌కు సిట్టింగ్ జడ్జిని నియమించాలని మంత్రిత్వ శాఖ ఇప్పుడు దిల్లీ హైకోర్టుకు రిజిస్ట్రార్‌కు లేఖ రాస్తుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మరో మాజీ అధికారి ఆర్‌వీఎస్ మణి తెలిపారు. 'ఒక జడ్జిని నియమించిన తర్వాత, మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను ట్రిబ్యునల్‌కి పంపుతుంది. ఆ తర్వాత సంస్థ చట్టవిరుద్ధమని ఎందుకు ప్రకటించకూడదని నోటీసు ద్వారా పీఎఫ్ఐ, దాని అనుబంధ సంస్థలను పిలుస్తుంది' అని ఆయన వివరించారు. శత్రుత్వాన్ని సాకుగా చూపి పీఎఫ్ఐ నోటిఫికేషన్‌ను వ్యతిరేకిస్తే, ఆ అంశంపై విచారణ జరుపుతామన్నారు. 'సిట్టింగ్ జడ్జి విచారణ నిర్వహిస్తారు. దేశంలోని ఏ ప్రాంతాన్ని అయినా సందర్శించవచ్చు. ప్రజల అభిప్రాయాన్ని కూడా కోరవచ్చు. న్యాయమూర్తికి తగిన ఆధారాలు దొరికితే, అది ఐదేళ్ల నిషేధాన్ని నిర్ధారిస్తుంది' అని మణి అన్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ఆరు నెలల్లో త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుందని తెలిపారు. సంస్థ 'చట్టవిరుద్ధం' అని ప్రకటించడానికి తగిన సాక్ష్యాలు ఉన్నాయని ట్రిబ్యునల్ కనుగొంటే, నిషేధం కొనసాగుతుంది. తగిన సాక్ష్యం లేకపోతే నిషేధం రద్దవుతుంది.

లాలూకు విదేశాల్లో చికిత్స... దిల్లీ కోర్టు అనుమతి

న్యూదిల్లీ: రాష్ట్రీయ జనతాదళ్ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ వైద్య చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు దిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు బుధవారం అనుమతి ఇచ్చింది. అక్టోబర్ 10 నుంచి 25 వరకూ వైద్య చికిత్స కోసం సింగపూర్ వెళ్లేందుకు కోర్టు అనుమతిని లాలూ కోరారు. ఐఆర్‌సీటీసీ కుంభకోణంలో లాలూ ప్రసాద్‌పై సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసులో ప్రస్తుతం లాలూ బెయిలుపై ఉన్నారు. ఆయన బెయిలు రద్దు చేయలంటూ సీబీఐ చేసిన విజ్ఞప్తిపై బీహార్ మాజీ ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సమాధానం ఇచ్చేందుకు దిల్లీ కోర్టుకు మరికొంత గడువు ఇచ్చింది. అక్టోబర్ 18న విచారణ ఉన్నందున యాదవ్‌ను స్వయంగా కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. లాలూ ప్రసాద్ యాదవ్ కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఐఆర్‌సీటీసీకి చెందిన రెండు హోటళ్ల కాంట్రాక్టులను ఓ ప్రైవేట్ సంస్థకు కేటాయించడంలో అవినీతికి పాల్పనట్టు సీబీఐ ఆరోపిస్తోంది. రాంచీ, పూరీలోని ఐఆర్‌సీటీసీ హోటళ్లను 2006లో ప్రైవేటు సంస్థలకు అప్పగించడంలో అక్రమాలకు పాల్పడ్డారని రబ్రీ దేవీ, లాలూ ప్రసాద్, తేజస్వి యాదవ్‌పై సీబీఐ అభియోగాలు మోపింది. ఐఆర్‌సీటీసీ హోటల్ కాంట్రాక్ట్ తమకు వచ్చేలా చేసినందుకు సుజాత హోటల్స్ యజమానులు విజయ్, వినయ్ కొచ్చార్ పాట్నా జిల్లాలో మూడు ఎకరాల కమర్షియల్ ప్లాట్‌ను లాలూ కుటుంబానికి ఇచ్చినట్లు అభియోగాలు ఉన్నాయి. ఈ కేసులో 2019 జనవరిలో లాలూకు బెయిల్ మంజూరైంది. తమ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని, సాక్ష్యాలను తారుమారు చేయరాదని కోర్టు షరతులు విధించింది.

అధ్యక్ష పదవిపై ఆసక్తి లేదు: కమల్‌నాథ్

భోపాల్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేయడంపై తనకు ఆసక్తి లేదని కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ స్పష్టం చేశారు. అయితే రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ పార్టీ అత్యున్నత పదవి చేపట్టినట్లయితే... రాజస్థాన్‌లో నెలకొనే సంక్షోభ పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి చెప్పానని కమల్‌నాథ్ పేర్కొన్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా గెహ్లాట్ స్థానంలో తన ప్రత్యర్థి సచిన్ పైలట్ వస్తారన్న వార్తల నడుమ అశోక్ గెహ్లాట్ విధేయులు చేసిన తిరుగుబాటును కమల్‌నాథ్ ప్రస్తావిస్తూ... కేవలం ముగ్గురు, నలుగురు వ్యక్తులు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడ్డారని తాను నమ్ముతున్నానన్నారు. ముగ్గురు నలుగురు మాత్రమే అసంతృప్తితో ఉన్నారని పార్టీ నాయకులు సోనియాగాంధీకి నివేదిక ఇచ్చారని తెలిపారు. కమల్ నాథ్ మంగళవారం దిల్లీలో సోనియాతో సమావేశమైన సంగతి విదితమే. జ్యోతిరాదిత్య సింధియా 22 మంది ఎమ్మెల్యేలతో పార్టీ నుండి నిష్క్రమించిన తర్వాత 2020లో అధికారాన్ని కోల్పోయిన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్... మధ్యప్రదేశ్‌లో సింధియా, రాజస్థాన్‌లో సచిన్ పైలట్‌ను ముఖ్యమంత్రులను చేయాలన్న సూచనను తోసిపుచ్చారు. కాగా సచిన్ పైలట్ గెహ్లాట్ స్థానంలోకి వచ్చేట్లయితే... మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని బెదిరిస్తూ... 90 మందికి పైగా రాజస్థాన్ ఎమ్మెల్యేల తిరుగుబాటుకు ప్లాన్ చేశారనే ఆరోపణలపై ముగ్గురు అశోక్ గెహ్లాట్ విధేయులు - శాంతి ధరివాల్, మహేష్ జోషి, ధర్మేంద్ర రాథోడ్‌లకు కాంగ్రెస్ నోటీసు జారీ చేసింది. అశోక్ గెహ్లాట్ పై వ్యాఖ్యానించేందుకు కమల్ నాథ్ నిరాకరించారు. 'పైలట్ మరియు గెహ్లాట్ ఇద్దరూ నా స్నేహితులు' అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా తిరిగి రావాలని తాను రాహుల్ గాంధీని కోరినటు చెప్పారు. 'మీరు తిరిగి రండి... వీటన్నిటికి ముగింపు పలకండని నేను అతని (రాహుల్)తో చెప్పాను కానీ అతను వద్దు అన్నాడు' అని కమల్‌నాథ్ తెలిపారు. తాను కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తానా? లేదా? అనే అంశంపై కమల్ నాథ్ స్పందిస్తూ... 'నా దృష్టిని మధ్యప్రదేశ్‌పై నుంచి తీసివేయాలని నేను కోరుకోవడం లేదు. ఎన్నికలు వచ్చే ఏడాది ఉన్నాయి. నాకు ఇందులో జోక్యం చేసుకోవడం ఇష్టం లేదు' అన్నారు.

బీజేపీ గూటికి కాంగ్రెస్ నేత

సిమ్లా: త్వరలో ఎన్నికలు జరిగే హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి బుధవారం గట్టి దెబ్బతగిలింది. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు హర్ష్ మహాజన్ బీజేపీలో చేరారు. గతంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. మాజీ సీఎం వీరభద్రసింగ్‌కు ప్రధాన అనుచరుడు కూడా. కేంద్ర మంత్రి పీయుష్ గోయల్ సమక్షంలో బీజేపీలో చేరిన హర్ష్ మహాజన్ ఆ తర్వాత పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీకి సరైన దిశానిర్దేశం లేదని, హిమాచల్ ప్రదేశ్‌లో హస్తం పార్టీకి సరైన నాయకుడే లేడని హర్ష్ మహాజన్ విమర్శించారు. రాహుల్ గాంధీ కారణంగా జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందన్నారు. ఓ పక్క భారత్ జోడో అంటూ రాహుల్ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలంతా ఆ పార్టీకి బైబై చెబుతున్నారు. ఇటీవలే గోవాలో ఎనిమిది మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరారు. తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి చేదు అనుభవాన్ని మిగుల్చుతున్నాయి. ఓ పక్క కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని రాహుల్ సహా అగ్రనాయకత్వం కలలుకంటుంటే కీలక నేతలంతా హస్తం పార్టీని వీడిపోతున్నారు. రాజస్థాన్‌లోనూ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ వర్గీయుల మధ్య కుమ్ములాటలు పార్టీని నవ్వులపాలు చేస్తున్నాయి. రాజస్థాన్ వివాదం ఇంకా ముగియక ముందే హిమాచల్ ప్రదేశ్‌లో హర్ష్ మహాజన్ పార్టీని వీడటం కాంగ్రెస్ అధిష్ఠానానికి మింగుడు పడటం లేదు. బీజేపీ సీఎం జై రామ్ ఠాకూర్ నేతృత్వంలో దూసుకుపోతుండగా కాంగ్రెస్ పార్టీకి హర్ష్ మహాజన్ ఇచ్చిన షాక్ తేరుకోలేకుండా చేస్తోంది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా హిమాచల్ ప్రదేశ్‌లో ప్రచారం ఉధృతంగా సాగిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా దెబ్బతినడం ఖాయమని పరిశీలకులు చెబుతున్నారు.

రాహుల్‌ను కలిసిన వేళ... ఆనందంతో గంతులేసిన చిన్నారి

కేరళ: భారత్ జోడో యాత్ర నిర్వహిస్తున్న రాహుల్ గాంధీని కలసిన కేరళకు చెందిన ఓ చిన్నారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రాహుల్‌ను కలిసానన్న సంతోషంలో ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. ఆయన ముందు గంతులేసి తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది.

రాజకీయ నేతగా పాదయాత్రలో ఉన్న రాహుల్‌ను కలుసుకున్న సంతోషంలో ఆ చిన్నారి భావోద్వేగానికి గురై సంతోషాన్ని వ్యక్తం చేసిన తీరు చూపరులను ఆకర్షిస్తోంది. ఆమెను దగ్గరకు తీసుకున్న రాహుల్ ఓదార్చి, చిన్నారితో ముచ్చటించిన విధానంపై ప్రశంసలు వెల్లువెత్తాయి.

చండీగఢ్ విమానాశ్రయానికి భగత్ సింగ్ పేరు

న్యూదిల్లీ: హరియాణ, పంజాబ్‌ల ఉమ్మడి రాజధాని చండీగఢ్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు షహీద్ భగత్ సింగ్ పేరు పెట్టారు. భగత్ సింగ్ 115వ జయంతి సందర్భంగా బుధవారం న్యూదిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్... చండీగఢ్ విమానాశ్రయానికి అధికారికంగా షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంగా పేరు మార్పు చేసినట్టు ప్రకటించారు. హరియాణా, పంజాబ్ గవర్నర్లు బండారు దత్తాత్రేయ, బన్వరీలాల్ పురోహిత్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, హరియాణా ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా, హోంమంత్రి అనిల్ విజ్, విమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ వీకే సింగ్, ఎయిర్‌పోర్ట్ సీఈఓ రాకేశ్ రంజన్ సహాయ్ తదితరులు పాల్గొన్నారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం 8 మంది దుర్మరణం

లఖింపూర్ ఖేరీ (ఉత్తరప్రదేశ్): ఉత్తరప్రదేశ్‌లోని లఖీంపూర్‌ఖేరీ దగ్గర ప్రైవేటు బస్సును ట్రక్కు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా.. 25 మందికి పైగా గాయాలయ్యాయి. బస్సు ధౌరేహ్రా నుంచి లక్నో వెళుతుండగా ఇసానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎరా వంతెన సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారందరినీ జిల్లా ఆసుపత్రికి తరలించగా, మరికొందరిని మెరుగైన చికిత్స నిమిత్తం లక్నోకు పంపినట్టు లఖింపూర్‌ఖేరీ అదనపు జిల్లా మేజిస్ట్రేట్ సంజయ్ కుమార్ తెలిపారు. సమాచారం అందుకున్న ఏడీఎం, సర్కిల్ అధికారి జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గాయపడ్డవారికి సరైన చికిత్స అందేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. "లఖింపూర్ ఖేరీ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జరిగిన ప్రాణ నష్టానికి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంతాపం తెలిపారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారికి చికిత్స కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని యోగి సీనియర్ అధికారులను ఆదేశించారు" అని సీఎంఓ ట్వీట్ చేసింది. మృతుల కుటుంబ సభ్యులకు యోగి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

వైద్యురాలిపై ఖైదీ అత్యాచార యత్నం

న్యూదిల్లీ: జైలులోని ఖైదీలను చూసేందుకు వచ్చిన వైద్యురాలిపై ఖైదీ అఘాయిత్యానికి తెగబడ్డాడు. ఈ ఘటన దిల్లీలోని మండోలి జైలులో చోటు చేసుకుంది. జైలు అధికారులు తెలిపిన ప్రకారం...ఒక మహిళా డాక్టర్ జైలులోని ఖైదీలను చూసేందుకు వచ్చారు. ఇంతలో ఒక ఖైదీ ఆమెపై అత్యాచారం చేసేందుకు యత్నించడమే కాకుండా ఆమెను చంపేందుకు కూడా ప్రయత్నించాడు. ఈ ఘటనతో స్పందించిన అధికారులు హుటాహుటిన సదరు బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

నిందితుడు ఖైదీ సుబ్రత్ పిళ్లైపై అత్యాచారం, హత్యాయత్నం వంటి కేసులను నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు పిళ్లైపై ఒక కేసులో కోర్టు పదివేలు పూచికత్తుతో జరిమాన విధించడమే కాకుండా ఒక ఏడాది జైలు శిక్ష కూడా విధించింది. ఈ శిక్షను అనుభవిస్తున్న తరుణంలోనే ఈ ఖైదీ మరో అఘాయిత్యానికి తెగబడ్డాడు. అలాగే ఈ ఘటన ఎలా జరిగిందనే దానిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆప్ నేత అమానతుల్లా ఖాన్‌కు బెయిల్

న్యూదిల్లీ: దిల్లీ వక్ఫ్ బోర్డులో అక్రమ నియామకాలకు సంబంధించిన కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్‌కు బుధవారం బెయిల్ మంజూరయింది. ఖాన్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సెప్టెంబర్ 16న ఆయన ఇంటిపై దాడి చేసి అరెస్ట్ చేసింది. ఆయన ఇంట్లో 24 లక్షల నగదు, రెండు అక్రమ ఆయుధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా పని చేస్తున్న సమయంలో ఖాన్ మార్గదర్శకాలను ఉల్లంఘించి 32 మందిని అక్రమంగా నియామకం చేసుకున్నారని ఏసీబీ ఆరోపించింది. అంతేకాకుండా, దిల్లీ వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఖాన్ అవినీతి, ఆశ్రితపక్షపాతంతో వక్ఫ్ బోర్డుకు చెందిన అనేక ఆస్తులను అక్రమంగా అద్దెకు ఇచ్చారని ఆరోపణలు వచ్చాయి. కాగా దర్యాప్తు సంస్థల నీడలో ఉన్న అనేక మంది ఆప్ నాయకుల్లో ఖాన్ ఒకరు.

మమతపై మీమ్స్... యూట్యూబర్ అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీని అవమానించేలా మీమ్స్‌ను రూపొందించిన 29 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మీమ్స్ రూపకర్త తుహిర్ మండల్, నదియా జిల్లాలోని ఆయన నివాసం నుంచి స్థానిక దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుందని చెప్పారు. మమతా బెనర్జీ ప్రతిష్ఠకు భంగం కలిగేలా ఆమె ప్రసంగాల్లోని కొన్ని భాగాలను ఎడిట్ చేయడం ద్వారా రెచ్చగొట్టే, దుర్భాషలాడే అనేక మీమ్స్ రూపొందించారని పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. ఇటువంటి చర్యలు హింసను ప్రేరేపించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారన్నారు. మండల్‌తో పాటు మరో ఏడుగురిపై ఫిర్యాదు చేశారని, వారికోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

కేరళలో అంగన్‌వాడీలకు వైఫై: ప్రభుత్వం

తిరువనంతపురం: అంగన్‌వాడీలు మెరుగైన సేవలందించేందుకు 1,230 గ్రామీణ శిశుసంరక్షణా కేంద్రాలకు వైఫై సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు కేరళ ప్రభుత్వం ప్రకటించింది. కోజికోడ్ జిల్లాలోని నెల్లికపరంబ్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి వైఫై సౌకర్యాన్ని కల్పించింది. దీంతో రాష్ట్రంలోనే మొట్టమొదటి వైఫై కలిగిన అంగన్‌వాడీ, వైఫై వాడీగా అవతరించింది. శిశు, మహిళ సంక్షేమ శాఖ బీఎస్ఎన్ఎల్ ద్వారా ఈ సదుపాయాన్ని అందిస్తోంది. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం మేలో ప్రకటించిన 'వర్ణ కూటు' పథకంలో భాగంగా అంగన్‌వాడీలకు వైఫై కనెక్షన్ల కోసం రూ.30.75 లక్షలు మంజూరు చేసింది. చిన్నారులకు లబ్ధి చేకూర్చేందుకు, బాలికలకు సాధికారత కల్పించేందుకు గాను అంగన్‌వాడీలకు వైఫై సౌకర్యం కల్పిస్తోంది. దీనికోసం ఒక్కొక్కరికి రూ.2500 కేటాయించింది. మరో పైలెట్ ప్రాజెక్టులో 210 అత్యాధునిక సదుపాయాలతో కూడిన స్మార్ట్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అంగన్‌వాడీలను బిల్ట్ అప్ ఏరియా, ప్లాట్ సైజ్ ఆధారంగా ఆరు రకాలుగా వర్గీకరిస్తోంది. పాత భవనాల స్థానంలో దశల వారీగా స్మార్ట్ అంగన్‌వాడీలను ఏర్పాటు చేయడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. విద్య, వైద్యం సదుపాయాలతో పాటు చిన్నారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించనుందని.. దీంతో కేరళ రాష్ట్రం చిన్నారుల సంక్షేమ రాష్ట్రంగా మారనుందని రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. జ్ఞానాన్ని పెంపొందించడం, నైపుణ్య ఆధారిత శిక్షణ, సామర్థ్యాన్ని నిర్థారించడం వర్ణకూటు పథకం లక్ష్యమని పేర్కొన్నారు. పోటీ పరీక్షలకు వెళ్లేవారు, ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు కూడా అంగన్‌వాడీల్లో వైఫై సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

అయోధ్యలో రూ.7.9 కోట్లతో వీణ

అయోధ్య: ప్రఖ్యాత గాయని స్వర్గీయ లతామంగేష్కర్ 93వ జయంతి పురస్కరించుకుని ఆమె పేరు మీద అయోధ్యలో ఒక కూడలిని ఏర్పాటు చేశారు. దీన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. సరయు నది వద్ద ఉన్న కూడలిలో దాదాపు రూ.7.9 కోట్ల వ్యయంతో భారీ వీణను ఏర్పాటు చేశారు. ఈ వీణ దాదాపు 40 అడుగుల పొడవు, 12 మీటర్ల ఎత్తులో 14 టన్నుల బరువు ఉంటుంది. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీ ట్విట్టర్‌లో..లతా దీదీ జయంతి సందర్భంగా ఆమెని స్మరించుకోవడమే గాక ఆమె తనపై చూపిన ఆప్యాయతను మరువలేనిదన్నారు. అయోధ్యలోని చౌక్‌కి ఆమె పేరు పెట్టడం భారతీయ దిగ్గజాలలో ఒకరిగా పేరుగాంచిన లతా దీదీకి దక్కిన తగిన నివాళి అని అన్నారు. ఈ చౌక్ వద్ద ఏర్పాటు చేసిన ఈ భారీ సంగీత వాయిద్యం సంగీత ప్రియులకు గొప్ప ఆకర్షణగా ఉండటమే గాక ఇంత భారీ సంగీత పరికరాన్ని ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని అధికారులు తెలిపారు. అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ కార్యదర్శి సత్యేంద్ర సింగ్ ఈ ప్రాజెక్టుకు సుమారు 7.9 కోట్లు ఖర్చు అయ్యిందని తెలిపారు. ఈ భారీ సంగీత వీణను పద్మశ్రీ అవార్డు గ్రహీత రామ్ సుతార్ తయారు చేశారని, సుమారు రెండు నెలల సమయం పట్టిందని తెలిపారు. అందంగా తీర్చిదిద్దిన ఈ వీణపై సరస్వతి చిత్రం కూడా చెక్కబడి ఉందని అన్నారు.

మతతత్వం ఏదైనా ప్రమాదకరమే

ఆర్ఎస్ఎస్‌పైనా నిషేధం విధించాలి: సీపీఎం

తిరువనంతపురం: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)పై నిషేధం విధిస్తూ తీసుకున్న చర్యల తరహాలోనే మతతత్వ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)పైనా చర్యలు తీసుకోవాలని కేరళలోని అధికార సీపీఎం డిమాండ్ చేసింది. ఏ మతానికి చెందిన మతతత్వం అయినా ప్రమాకరంగానే పరిగణించాలని స్పష్టం చేసింది. ఆర్ఎస్ఎస్ కూడా తీవ్రమైన మతతత్వ భావాలున్న సంస్థ అని కేరళ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ అన్నారు. సమాజంలో మతపరమైన విద్వేషాలను వ్యాప్తి చేయడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. మైనారిటీ మతతత్వం ఎంత ప్రమాదమో మెజారిటీ మతతత్వం కూడా అంతే ప్రమాదకరమని పేర్కొంటూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక సంస్థను నిషేధిస్తే భావజాలం పూర్తిగా సమసిపోదని, మరో రూపంలో పురుడుపోసుకుంటుందని పేర్కొన్నారు. నిషేధం విధించడం ద్వారా దాని కార్యకలాపాలు తగ్గుతాయని కేంద్రం భావిస్తే ఆర్ఎస్ఎస్‌పైనా తక్షణమే నిషేధం విధించాలని అన్నారు. దేశంలో జరిగిన అనేక మతహింసల వెనుక ఆర్ఎస్ఎస్ కుట్ర ఉందని పేర్కొన్నారు.

ఆర్జేడీ అధ్యక్ష పదవికి లాలూ నామినేషన్

న్యూదిల్లీ: రాష్ట్రీయ జనతా దళ్ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ జాతీయ అధ్యక్షుడి పదవికి పార్టీ కార్యాలయంలో బుధవారం నామినేషన్ వేశారు. ఆర్జేడీ వ్యవస్థాపకుడైన లాలూ వరుసగా 12వసారి పార్టీ అధ్యక్షుడయ్యే అవకాశం ఉంది. ఆర్జేడీ పంచాయత్ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకూ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తోంది. షెడ్యూల్ ప్రకారం పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక అక్టోబర్ 9న న్యూదిల్లీలో జరగనుంది. ఆర్జేడీని లాలూ ప్రసాద్ యాదవ్ 1977లో స్థాపించారు. ఓబీసీలు, దళితులు, ముస్లింలు ఈ పార్టీకి సంప్రదాయ ఓటర్లుగా ఉన్నారు. అట్టడుగు స్థాయి ప్రజల కోసం పోరాడే పార్టీగా ఆర్జేడీకి పేరుంది. 2008లో ఆర్జేడీకి జాతీయ స్థాయి పార్టీగా గుర్తింపు వచ్చింది. ప్రస్తుతం బీహార్‌లో 165 మంది ఎమ్మెల్యేలతో మహాఘట్ బంధన్‌కు సారథ్యం వహిస్తున్న ఆర్జేడీ ఏకైక పెద్ద పార్టీగా ఉంది. పార్టీ యువనేత తేజస్వి యాదవ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం

- మహా పాదయాత్రకు అఖండ స్వాగతం
- ఏలూరు నియోజకవర్గంలో వెల్లువెత్తిన సంఘీభావం

విశాలాంధ్ర ఏలూరు: అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ...అన్నదాతలు చేపట్టిన మహాపాదయాత్ర 17వ రోజుకు చేరుకుంది. అడుగడుగునా ప్రజల ఆశీర్వాదాలు, సంఘీభావాలు, ఘనస్వాగతాలు, హారతుల నడుమ ఉప్పొంగిన ఉత్సాహంతో దిగ్విజయంగా సాగుతోంది. పాదయాత్రకు తాత్కాలికంగా మంగళవారం విరామం ఇచ్చిన రైతులు... బుధవారం ఏలూరు సమీపంలోని పెదపాడు మండలం కొత్తూరులో అమరావతి రథం వద్ద జేఏసీ నాయకులు పూజలు చేసిన అనంతరం యాత్రను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో టీడీపీ, జనసేన, సీపీఐ నేతలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, న్యాయవాదులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. పాదయాత్ర ఏలూరు నియోజకవర్గంలోని స్థానిక వంగాయ గూడెం సెంటర్ వద్దకు చేరుకోగా... టీడీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి పాదయాత్రకు అఖండ స్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏలూరు నగరంలో పాదయాత్ర కొనసాగింది. మర్చంట్ చాంబర్ కళ్యాణమండపం మీదుగా వైఎంహెచ్ఏ హాలు, విజయ వాచ్ కంపెనీ, వాసవి సిల్క్స్, కెనాల్ రోడ్డు, ఫైర్ స్టేషన్ సెంటర్, జీవి మాల్,పవర్ పేట రైల్వే గేట్, 12 పంపుల సెంటర్, నూకాలమ్మ గుడి, ఆదివారపు పేట సాయిబాబా గుడి మీదుగా టుబాకో మర్చంట్ కళ్యాణమండపం వరకు పాదయాత్ర సాగింది. భోజనం విరామ సమయం అనంతరం మల్కాపురం (పాలగూడెం) మీదుగా 15 కిలోమీటర్ల నడక పూర్తిచేసుకుని కొవ్వలిలో 17వ రోజు పాదయాత్ర ముగిసింది.

సీఎం జగన్ మాట తప్పారు: సీపీఐ

అమరావతి రైతుల మహా పాదయాత్రకు సీపీఐ ఏలూరు జిల్లా కమిటీ... స్థానిక వంగాయ గూడెం వద్ద స్వాగతం పలికింది. ఈ సందర్భంగా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ... అమరావతి నుంచి అరసవల్లికి రైతులు చేపట్టిన మహాపాదయాత్రలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నామని తెలిపారు. ఆనాడు టీడీపీ, బీజేపీ అమరావతి రాజధానిగా ఉండాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టగా దానిని పూర్తిగా సమర్థిస్తూ తీర్మానాన్ని ఆమోదించిన నాటి ప్రతిపక్ష నాయకుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు మూడు రాజధానుల ప్రకటనతో మాట తప్పి కప్పదాటు వైఖరి అవలంబించడం దుర్మార్గ చర్య అని విమర్శించారు. రాష్ట్రానికి అందరికీ అందుబాటులో కేంద్ర బిందువుగా అమరావతి రాజధానిగా ఉండాలని ప్రజలందరూ భావిస్తుంటే... ముఖ్యమంత్రి జగన్ కేవలం గుంటూరు, అమరావతి ప్రజలే అమరావతిని రాజధానిగా కోరుకుంటున్నారని అభివర్ణించటం నియంతృత్వ ధోరణికి పరాకాష్ట అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి మొద్దు నిద్ర వీడి అమరావతిని రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ... అమరావతి రాజధానిగా ఉండాలని న్యాయస్థానంటూ దేవస్థానం వరకు జరిగిన పాదయాత్రలో సీపీఐ ప్రత్యక్షంగా పాల్గొందని గుర్తు చేశారు. అమరావతే ఏకైక రాజధానిగా ఉండాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. మూడు రాజధానుల ఏర్పాటుకు సీపీఐ అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రకు ఎన్ని అవాంతరాలు సృష్టించినా రైతుల పాదయాత్రలో ప్రత్యక్షంగా పాల్గొని అమరావతి రాజధానిగా ఉండేందుకు పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... అసెంబ్లీ, సచివాలయం ఎక్కడ ఉంటే అదే రాజధానిగా ఉండాలని శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వాహక రాజధానిగా విశాఖ, న్యాయ రాజధానిగా కర్నూలు ఉంటాయని ప్రకటించడం సిగ్గుచేటైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం మ్యాప్ లో అమరావతి రాజధానిగా గుర్తించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తెరిగి అమరావతిని రాజధానిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ మహా పాదయాత్రలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావు, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, ఏరియా కౌన్సిల్ సభ్యులు పోలా భాస్కర్, అడ్డగర్ల లక్ష్మీ ఇందిర, మావూరి విజయ, కురెళ్ల వరప్రసాద్, ఎంఏ హకీమ్, విద్యార్థి సంఘం నాయకుడు ఉప్పులూరి రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుగ్గల ప్రభాకర్, పిచ్చెట్టి శ్రీను, సిరిసార్ల సోమేశ్, మెడికల్ ఎంప్లాయిస్ నాయకుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభల ప్రదర్శనల్లో ఎర్రదండు కవాతు ప్రత్యేక ఆకర్షణ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ జాతీయ మహాసభల ప్రదర్శనల్లో ప్రత్యేక ఆకర్షణగా ఎర్రదండు కవాతు నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సీపీఐ 24వ జాతీయ మహాసభల 'జనసేవాదళ్' సమావేశం విజయవాడ దాసరి భవన్‌లో బుధవారం జరిగింది. దీనికి ముప్పాళ్లతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, పి.దుర్గాభవాని, దోనేపూడి శంకర్, నక్కి లెనిన్‌బాబు, కె.శివారెడ్డి, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, యువజన, విద్యార్థి నాయకులు పరుచూరి రాజేంద్ర, ఎంపీ సుబ్బారావు పాల్గొన్నారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్ 14 నుంచి 18 వరకు సీపీఐ 24వ జాతీయ మహాసభలు విజయవాడ నగరంలో జరగనున్న నేపథ్యంలో ప్రారంభ రోజైన అక్టోబర్ 14న భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే చాలా జిల్లాలలో జనసేవాదళ్ శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. జనసేవాదళ్ మార్చ్‌ఫాస్ట్ శిక్షణ తరగతులు పూర్తిచేసిన జిల్లాల వారందరికీ అభినందనలు తెలిపారు. జనసేవాదళ్ కవాతు మూడు లైన్లలో జరుగుతుందనీ, 30 మంది ఒక బ్యాచ్‌గా ఒక టీమ్ లీడర్ కింద ఉంటుందనీ, తదుపరి పార్టీ శ్రేణులు, ప్రజలు నాలుగు వరసల్లో ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. పార్టీ జాతీయ మహాసభల జయప్రదానికి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ అక్టోబర్ 14 విజయవాడ నగరం ఎరుపుమయం కావాలని పిలుపునిచ్చారు. యువతీయువకులతో, బాలబాలికల వరుసలతో, క్రమశిక్షణతో కూడిన ఎర్రదండు కవాతు ప్రజా ప్రదర్శన అగ్రభాగాన ప్రత్యేక ఆకర్షణగా నిలవడం ఖాయమన్నారు. అత్యంత ఉత్సాహపూరితంగా జిల్లాలలో జనసేవాదళ్ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి యావన్మంది ప్రజానీకం తోడ్పడాలని కోరారు.

సీఎం విజయన్‌తో గంగూలీ భేటీ

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బీసీసీఐ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ బుధవారం కేరళ సీఎం పినరయి విజయన్‌తో భేటీ అయ్యారు. కొచ్చిలో ప్రత్యేకంగా క్రికెట్ స్టేడియం నిర్మాణ ఆవశ్యకతపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్టు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం గంగూలీ రాష్ట్రంలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తరపున చేపడుతోన్న మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారానికి సంబంధించిన లోగోను విజయన్‌తో కలిసి ఆవిష్కరించారు.

ఎస్‌డీపీఐకి రూ.11 కోట్ల విరాళాలు

న్యూఢిల్లీ: నిషేధానికి గురైన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సంస్థకు రాజకీయ విభాగంగా భావిస్తోన్న సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) 2018 నుంచి ఇప్పటి వరకూ దాదాపు రూ.11 కోట్లకు పైగా విరాళాలు పొందినట్టు ఢిల్లీ ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ వెల్లడించింది. జూన్ 2న ఏర్పాటైన ఆ పార్టీ 2010 ఏప్రిల్‌లో ఎన్నికల కమిషన్‌లో తమ గుర్తింపును నమోదు చేసుకున్నట్టు పేర్కొంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.5.17 కోట్లు, 2019-20లో రూ.3.74 కోట్ల విరాళాలు పొందినట్లు తెలిపింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.2.86 కోట్లు ఎస్‌డీపీఐ విరాళాల రూపంలో అందుకునట్టు వివరించింది. ఎస్‌డీపీఐ అందుకున్న విరాళాల్లో ఎక్కువ భాగం తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచే వచ్చినట్టు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా పీఎఫ్ఐపై నిషేధం విధించడంపై ఎస్‌డీపీఐ స్పందించింది. ఈ చర్య ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొంటూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. బీజేపీపై ఎవరు విమర్శలు చేసినా దాడులకు తెగబడడం, అరెస్టులు చేయడం పరిపాటిగా మారిందని దుయ్యబట్టింది.

విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుదాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేలా విద్యార్థులను ప్రోత్సహించాలని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో దేశభక్తిపై రూపొందించిన పాఠ్యాంశాల బోధన అమలులోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల నేతలు దేశాన్ని అగ్రస్థానంలో నిలుపబోరని వ్యాఖ్యానించారు. దేశంలోని 130 కోట్ల మంది ప్రజలే దేశాన్ని ప్రపంచంలో నంబర్ వన్‌గా మార్చగలరని చెప్పారు. ఇందుకోసం విద్యార్థి దశలోనే ఉపాధ్యాయులు స్ఫూర్తిని నింపాలని కోరారు. పాఠశాల జీవితం పూర్తయిన అనంతరం వారే దేశాన్ని నెంబర్ వన్‌గా మార్చడం కోసం తమ వంతు కృషి చేస్తారని వ్యాఖ్యానించారు. దేశభక్తి పాఠాలు సమాజంలో నెలకొన్న రుగ్మతలను రూపుమాపేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈ క్రమంలోనే తమ ప్రభుత్వం పాఠశాలల్లో దేశభక్తి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, సంతోషం అనే మూడు అంశాలను పాఠ్యాంశాలుగా బోధించే చర్యలు చేపట్టినట్టు తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని గతేడాది సెప్టెంబర్ 28న ఈ పాఠ్యాంశాలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

సీపీఐ జాతీయ మహాసభలకు రూ.30 వేల విరాళం

విశాలాంధ్ర-వినుకొండ: సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా వినుకొండ నియోజక వర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం రూ.30 వేల విరాళం అందజేసింది. వినుకొండ పట్టణంలో సైదా ఇంటి వద్ద భవన నిర్మాణ కార్మికుల ముఖ్యుల సమావేశం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ ఏపీ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణమూర్తికి వినుకొండ భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు, మాజీ వైస్ చైర్మన్ సండ్రపాటి సైదా ద్వారా రూ.30 వేల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ భవన నిర్మాణం కార్మిక సంఘం నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కసా రాంబాబు, సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, తాపీ యూనియన్ నాయకులు కారుమంచి మీరావాలి, షేక్ మస్తాన్, కొండ్రముట్ల, చిన్న సుభాని, కొప్పరపు మల్లికార్జునరావు తదితరులు పాల్గొని మహాసభలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



'కాకుమాను'కు ఎక్సలెన్స్ ఇన్ టూరిజం రీసెర్చ్ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రతి ఏడాదీ సెప్టెంబర్ 27న యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ (యూఎన్‌డబ్ల్యుటీవో) ప్రతిపాదించిన థీమ్ ఆధారంగా ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటారు. కానీ ఈ ఏడాది 'రీథింకింగ్ టూరిజం' థీమ్ నేపథ్యంలో జరుపుకున్నారు. దీనిని పురస్కరించుకుని ఏపీ టూరిజం అథారిటీ... 'ఎక్సలెన్స్ ఇన్ టూరిజం రీసెర్చ్' కేటగిరీలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో టూరిజం డిపార్ట్‌మెంట్‌లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్న డాక్టర్ కాకుమాను రాజేష్‌ను అవార్డుకు ఎంపిక చేశారు. తిరుపతి శిల్పకళారామంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా చేతులమీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

చిత్తడి నేలల సంరక్షణకు చర్యలు

అటవీశాఖ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరుదైన జీవజాలంకు ఆలవాలంగా ఉన్న చిత్తడి నేలల పరిరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవారం అటవీ, పర్యావరణశాఖ అధికారులతో వెట్‌ల్యాండ్ బోర్డ్ తొలి సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చిత్తడినేలల్లో జీవ వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తూ అనేక రకాల జంతువులు, పక్షులు, జీవజాలం మనుగడను సాగిస్తున్నాయన్నారు. కొల్లేరు, నేలపట్టు, పులికాట్, కొరింగ, శ్రీకాకుళంలోని పలు ప్రాంతాల్లో చిత్తడి నేలలు ఉన్నాయని వివరించారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో మొత్తం 30వేల ఎకరాల్లో చిత్తడి నేలలు ఉన్నట్లు గుర్తించిందన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, అటవీదళాల అధిపతి మధుసూధన్‌రెడ్డి, కమిషనర్ శాంతిపాండే పాల్గొన్నారు.

మోటార్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టండి

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర-చిత్తూరు: వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టండని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. 'వ్యవసాయ మోటార్లకు మీటర్లు-రైతన్న మెడకు ఉరి తాళ్లు' అనే అంశంపై ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో బుధవారం స్థానిక భాస్కర హోటల్ ఫంక్షన్ హాలులో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.జనార్ధన్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్ అందించి రైతుల మెప్పు పొందారని, అయితే ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మాత్రం రైతుల మెడకు ఉరి తాళ్లు బిగించి ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. చిత్తూరు జిల్లాలో అత్యధికంగా రైతులు మోటార్ల పైనే ఆధారపడి సేద్యం చేస్తున్నారని, ఎక్కువగా నష్టపోయేది ఈ జిల్లా రైతులేనని వివరించారు. గతంలో రైతులు తాము పండించిన పంటలో కొంత భాగం విత్తనాలకు నిల్వ ఉంచుకుని, మిగిలిన ధాన్యం అమ్ముకునేవారని, కార్పొరేట్ సంస్థలు అధిక దిగుబడి పేరుతో నాణ్యమైన విత్తనాలంటూ రైతులను మోసం చేస్తున్నాయని తెలిపారు. అయితే వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ రైతులకు ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం జీఎస్‌టీ ఉన్న కార్పొరేట్ సంస్థలకు 18 శాతానికి తగ్గించి, అన్నదాత పండించే పంటలకు 28 శాతం జీఎస్‌టీ విధించడం రైతులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తుంటే సీఎం జగన్ ప్రశ్నించకపోగా మన రాష్ట్రానికి రావాల్సిన జీఎస్‌టీని ఇప్పించాలని విజయసాయిరెడ్డి పార్లమెంటులో అడుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు నిధులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుంటే అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ నోరు మెదపక పోవడం ఏమిటని నారాయణ ప్రశ్నించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు రైతులు పండించిన పంట ఖర్చుకు 50 శాతం అదనంగా కలిపి ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మీటర్ల బిగింపు పై తీవ్ర వ్యతిరేకత వస్తుందని, పక్క రాష్ట్రం సీఎం కేసీఆర్ మీటర్లు పగలగొడతామని ప్రకటిస్తుంటే, 175 సీట్లు గెలుస్తామని ప్రకటించుకుంటున్న జగన్ ఎందుకు కొంగ జపం మాటలు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రంలో వలంటీర్లు రైతుల ఇళ్లకు వెళ్లి మీటర్లకు సమ్మతిస్తూ సంతకాలు పెట్టకుంటే సంక్షేమ పథకాలు నిలిపేస్తామని బెదిరిస్తున్నారని, వారి బెదిరింపులకు భయపడవద్దని భరోసా ఇచ్చారు.

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ నెలకు రూ.6,300 ఆదాయంతో రైతు కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. రైతు ఆదాయం పెరగాలంటే మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతం పూర్తిగా ఉద్యాన పంటలు పండించే రైతులని, బోరు బావుల పై ఆధారపడిన రైతుల మోటార్లకు మీటర్లు బిగించేందుకు తెచ్చిన జీవో నంబర్ 22 రైతుల మెడకు ఉరి తాళ్లుగా మారనున్నాయని ఆయన విమర్శించారు. రబీలో వేసిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. వ్యవసాయ ఉత్పత్తుల సంఘం జిల్లా అధ్యక్షులు, మామిడి రైతు సంఘం నాయకులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ఆనంద నాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నం నాయుడు, సీపీఐ తిరుపతి నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శశికుమార్, బెల్లం కొండ శ్రీనివాసు రైతు సమస్యల పై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి గోపీనాథ్, సీనియర్ నాయకులు మణి, రఘు, బాలాజీ రావు, ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురప్ప, సుబ్రమణ్యం, సత్యమూర్తి, ఆర్ముగం రెడ్డి, మహిళా సమాఖ్య నాయకులు రమాదేవి, కుమారి, విజయగౌరి, జమిలాబి, జయలక్ష్మి, కోమల తదితరులు పాల్గొన్నారు.

నయా నిజాంను తలపించిన జగన్ తిరుపతి పర్యటన

అంతకుముందు, డాక్టర్ కె.నారాయణ విలేకరులతో మాట్లాడుతూ ప్రజల మద్దతుతో రాష్ట్రంలో 175 సీట్లు గెలుస్తామంటున్న జగన్‌కు 3 వేల మంది పోలీసుల పహారా మధ్య తిరుపతి పర్యటన గమనిస్తే, అంత భయమెందుకని ప్రశ్నించారు. జగన్‌కు విమానాశ్రయం నుంచి వందలాది మంది పోలీసులు కాపలాకాస్తున్నారని, సీపీఐ కార్యాలయాల వద్ద కూడా పోలీసులు కాపలా కాశారని విమర్శించారు. అక్టోబర్ 14 నుంచి 18 వరకు విజయవాడలో సీపీఐ జాతీయ మహాసభలు జరగనున్నాయని, ఈ సభలకు బీజేపీ వ్యతిరేక పార్టీల నేతలు హాజరు కానున్నారని నారాయణ తెలిపారు.

విభజన హామీలకు పాతర: కనకమేడల

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన కేసుల కోసం సీఎం జగన్ కేంద్రంతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని విభజన హామీలకు పాతరేసి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. బుధవారం ఆయన జూమ్ వీడియో సమావేశం ద్వారా విలేకరులతో మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ వ్యవహారం మొత్తం రాష్ట్ర ప్రభుత్వానికి తెలిసే చేస్తున్నామని, గోప్యత ఏమీ లేదని కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంటులో ప్రకటించిన తర్వాత కూడా వైసీపీ నేతలు కల్లబొల్లి మాటలతో ప్రజల్ని మభ్యబెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు. అలాగే విశాఖపట్నం రైల్వేజోన్‌కు సంబంధించి వైసీపీ నాయకులు పూటకో మాట చెబుతున్నారన్నారు. రైల్వేజోన్ విషయంలో కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదు.? పైగా అబద్దాలు చెబుతున్నారన్నారు. రైల్వే జోన్ సాధనలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే విశాఖకు శాపంగా మారుతున్న విషయాన్ని కప్పిపెట్టేందుకు దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైల్వే బోర్డు, జోన్ సాధ్యం కాదని హోం శాఖ సమావేశంలో వెల్లడించిం దనీ, విశాఖ రైల్వేజోన్ లాభదాయకం కాదని, సమగ్రమైన డీపీఆర్ ఇంకా ఇవ్వలేదని కేంద్రం చెబుతోందన్నారు. దానికి జగన్ సమాధానం చెప్పే పరిస్థితుల్లో లేరన్నారు. విభజన హామీలు, ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థలు, హక్కులు, ఆస్తుల విభజనపై కేంద్రం చొరవ తీసుకొని రెండు రాష్ట్రాలకు చేయాల్సిన న్యాయం ఇంత వరకు చేయలేదన్నారు. హోం శాఖ సమావేశాలు అనేకం జరిగాయనీ, ఫలితం శూన్యమన్నారు. టీడీపీ తరపున రాజ్యసభ వేదికగా తాను విభజన హామీల గురించి అనేక ప్రశ్నలు లేవనెత్తాననీ, విభజన హామీల అమలులో భాగంగా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం ఏం చేశారని ప్రశ్నించాన న్నారు. జగన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రత్యేక హోదా ఏపీకి సంజీవని అన్నారనీ, 25 ఎంపీలిస్తే కేంద్రం మెడలు వంచి హోదా సాధిస్తామని తెలిపారనీ, ఇప్పుడు 31 మంది ఎంపీలున్నా రాష్ట్ర ప్రయోజనాలను ఎందుకు కాపాడలేకపోతున్నారని కనకమేడల ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా తన కేసుల మాఫీ కోసమే ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రులను సీఎం జగన్ తరచూ కలుస్తున్నారన్నారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక విభజన హామీల అమలులో భాగంగా వచ్చిన నిధులెంత? సాధించిందేమిటో బహిరంగంగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

సాక్ష్యాలు ధ్వంసం చేశారు

అంకిత హత్యకేసుపై మాజీ డీజీపీ

డెహ్రాడూన్: రిసెప్షనిస్ట్ అంకితా భండారి హత్య కేసులో ఉత్తరాఖండ్ మాజీ డీజీపీ అలోక్ బి.లాల్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కీలకమైన సాక్ష్యాలను నాశనం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం రిసార్ట్‌ను కూల్చివేసిందని స్పష్టం చేశారు. అర్ధరాత్రివేళ ఎందుకు కూల్చివేయాల్సి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్ట విరుద్ధంగా నడుపుతున్నప్పటికీ.. కూల్చివేతకు ముందు షోకాజ్ నోటీసు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రిసార్టు కూల్చివేతపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం తమ తప్పు లేదని నిరూపించుకునేందుకు అత్యుత్సాహాన్ని ప్రదర్శించిందని మండిపడ్డారు. ఎవరి ఆదేశాలను ఎవరు పాటించారనే అంశం దర్యాప్తులో తేలుతుందని, ఒకవేళ నిందితులు కూడా కూల్చివేతకు పాల్పడి ఉండవచ్చని ఆయన అన్నారు.

హార్దిక శుభాకాంక్షలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ 17వ ఉపకులపతిగా నియమించబడిన మా శ్రేయోభిలాషి ఆచార్య పట్టేటి రాజశేఖర్ గారికి మా హార్దిక శుభాకాంక్షలు

డా॥ రాజేంద్ర
డా॥ అన్నామణిరావు
డా॥ శరత్‌బాబు

"ఏదో సాధించాలని జీవించడం కాదు. దాన్ని సాధించడానికి జీవించడమే అసలైన జీవితం"
చేగువేరా

COMMUNIST PARTY OF INDIA

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

కరుడుగట్టిన బోల్షివిక్ భవానీ సేన్



భవానీ సేన్

తొలి తరం కమ్యూనిస్టుల్లో భవానీ సేన్ ఒకరు. కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు రైతాంగ, వ్యవసాయ కార్మిక ఉద్యమాలను బలోపేతం చేసినవారిలో ఒకరిగా భవానీ సేన్ నిలిచారు. అందుకే కమ్యూనిస్టు ఉద్దండుడు చంద్ర రాజేశ్వరరావు ఆయనను 'కరుడుగట్టిన బోల్షివిక్'గా అభివర్ణించారు. రష్యాలోని బోల్షివిక్ తరహా ఉద్యమాన్ని భారత్‌లో తీసుకురావాలన్నది భవానీ సేన్ ఆలోచన. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ ఆయన చురుగ్గా పాల్గొన్నారు.

ఆనాటి బెంగాల్‌లోని పబ్నా (ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో వుంది)లో భవానీ సేన్ జన్మించారు. విద్యార్థి దశ నుంచే ఆయన జాతీయోద్యమంలో పాల్గొని, 1930లో జైలుకెళ్లారు. తొలి రోజుల్లో ఆయన ఎక్కువగా జెస్సోరే ఖుల్నా యూత్ యూనియన్‌తో కలిసి విప్లవ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. జైలులో ఉన్నప్పుడే చదువు కొనసాగిస్తూ ఎకనామిక్స్‌లో ఎంఎ ఉత్తీర్ణులయ్యారు. 1938లో జైలు నుంచి విడుదలయ్యాక భారత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. 1940-42లో రైల్వే కార్మికులతో కలిసి ట్రేడ్ యూనియన్ ఉద్యమంలోనూ, రైతాంగ ఉద్యమంలోనూ పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించారు. 1940 ఫిబ్రవరిలో బెంగాల్ ప్రభుత్వం సామ్రాజ్యవాద యుద్ధానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ప్రతిఘటనను, కార్మికోద్యమాలను అణచివేసేందుకు అనేక ఆర్డినెన్స్‌లను తీసుకువచ్చింది. ఈ సమయంలోనే ముజఫర్ అహ్మద్, సోమ్‌నాథ్ లహరి, భవానీ సేన్, పంచూ గోపాల్ భండూరీ వంటి అగ్రశ్రేణి కమ్యూనిస్టు నాయకులు, చతుర్ ఆలీ, మహమ్మద్ హారిస్ వంటి కార్మిక నాయకులు వెలుగులోకి వచ్చారు. ఈ క్రమంలోనే ఆవిభాజ్య బెంగాల్‌లో భవానీ సేన్ 1943లో పార్టీ రాష్ట్ర కమిటీకి, కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు.

1943 మార్చి 18-21లో కలకత్తాలో జరిగిన సీపీఐ మూడవ బెంగాల్ ప్రావిన్స్ మహాసభల్లో భవానీ సేన్ బెంగాల్ శాఖ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దేశంలో రైతాంగ ఉద్యమ పటిష్టతలో ఆయన పాత్ర ఎనలేనిది. ముఖ్యంగా నాటి బెంగాల్ పశ్చిమప్రాంతంలో (ప్రస్తుత పశ్చిమ బెంగాల్) పార్టీ విస్తరణకు ఆయన చేసిన కృషి అద్వితీయం. తెభాగా ఉద్యమాన్ని ప్రారంభించిన వారిలో భవానీ సేన్ ప్రముఖులు. ఆ సమయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఆయనే బాధ్యతల్లో వున్నారు. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ రెండవ జాతీయ మహాసభల్లో పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికయ్యారు. 1964లో పార్టీ చీలిక అనంతరం ఆయన సీపీఐ పశ్చిమ బెంగాల్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పశ్చిమ బెంగాల్ సీపీఐ పత్రిక 'కాలాంతర్'కు తొలి సంపాదకునిగా భవానీ సేన్ బాధ్యతలు చేపట్టడం విశేషం. 1962 డిసెంబరు 29 నుంచి వారపత్రికగా ప్రచురితమైన 'కాలాంతర్' ఆ తర్వాత 1966 అక్టోబరు 7 నుంచి నాలుగు పేజీలతో దినపత్రికగా మారింది. బెంగాలీ భాషలో పార్టీ పత్రికగా, ప్రజావాణిగా ఈ పత్రిక నిలబడింది. 1962 సెప్టెంబరు 1న 'మెయిన్‌స్ట్రీమ్' తొలి సంచికలో ఆయన రాసిన వ్యాసానికి ప్రశంసలు దక్కాయి. 1970లో అఖిల భారత కిసాన్ సభకు అధ్యక్షుడిగా ఎన్నికయిన నాటి నుంచి మరణించే వరకు ఆయన ఆ పదవిలో కొనసాగారు. భవానీ సేన్ పర్యవేక్షణలోనే సీపీఐ ప్రజాసంఘాలైన ఖేత్ మజ్దూర్ యూనియన్ (వ్యవసాయ కార్మిక సంఘం), ఆదివాసీ మహాసభలు 1968లో ఏర్పడ్డాయి. బంగ్లాదేశ్ విమోచనోద్యమంలోనూ ఆయనది ప్రముఖ పాత్రే. బంగ్లా పౌరులపై పాక్ అనుకూల శక్తులు దాడులు చేసినప్పుడు ఆయన ఎంతోమంది శరణార్థులను చేరదీసి, సహాయం అందించారు. బంగ్లాదేశ్‌కు అనుకూలంగా భారత్, ఇతర ప్రపంచ దేశాల అభిప్రాయాలను కూడగట్టడంలోనూ ఆయన అద్వితీయమైన భూమిక పోషించారు.

భవానీ సేన్ 1972 జులై 10న మాస్కోలో మరణించారు. ఈ సందర్భంగానే చంద్ర రాజేశ్వరరావు ఆయనను 'కరుడుగట్టిన బోల్షివిక్'గా అభివర్ణించారు. "భవానీసేన్ ఓ బొల్షివిక్. అంగుళంగుళం అదే రక్తం ప్రవర్తిస్తున్నట్లు వుంటుంది. సాధారణంగా మార్క్సిస్ట్ పండితుల్లో ఒకరిగా వున్నా, ప్రత్యేకించి ఆయన మార్క్సిస్టు తత్వవేత్త" అని సీఆర్ కొనియాడారు. భవానీ సేన్ వ్యక్తిగతంగా కార్యకర్తలను కలిసి, ఉద్యమాలు నిర్మించేవారని ప్రముఖ చరిత్రకారుడు చిన్మోహన్ సెహ్నావిస్ వెల్లడించారు. భవానీ సేన్ తయారు చేసిన కమ్యూనిస్టు నాయకుల్లో సుదీర్ఘకాలంపాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఏబీ బర్దన్ ఒకరు. 60వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సమాంతరంగా జనవరి 26న భవానీ సేన్ జయంతి ఉత్సవాలను భారీగా నిర్వహించడం గమనార్హం.

- ఎ.బి.కూన

నిరంతర జ్ఞాన తృష్ణ

కొందరు జీవితాంతం జ్ఞానాన్వేషణలోనే జీవిస్తారు. వారి ఈ తృష్ణ తీరేది కాదు. నిండు జీవితం గడిపినా ఆ దాహం తీరకుండానే వెళ్లిపోతారు. అలాంటి అపురూప వ్యక్తే ఏటుకూరి బలరామమూర్తి (1918 సెప్టెంబర్ 23 - 1996 ఏప్రిల్ 3). "అన్వేషణ తీరలేదు, జ్ఞాన తృష్ణ చల్లారలేదు. చల్లారకూడదు. ఇటీవల పదే పదే అనారోగ్యానికి గురవుతున్నాను. కోలుకుంటున్నాను. మరుక్షణంలో తిరిగి కలం చేపడుతున్నాను" అన్న బలరామ మూర్తి ఏడాది తిరక్కుండానే జీవితం చాలించారు.

ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు. మార్క్సిస్టు మేధావి. చరిత్రకారుడు. భారతీయ తత్వ శాస్త్రంతో పాటు మార్క్సిస్టు తత్వ శాస్త్రంలో తలపండిన వారు. ఆయన తండ్రి సీతారామయ్య బ్రహ్మ సమాజ అభిమాని. బలరామ మూర్తి 1937లో గుంటూరులో బి.ఎ.చదువుతున్నప్పుడే కమ్యూనిజం వేపు ఆకర్షితులయ్యారు. బి.ఎ పూర్తి చేసిన తరువాత జర్నలిజం వృత్తిలో ఉంటూనే ప్రైవేటుగా ఎం.ఎ సోషియాలజీ పూర్తిచేశారు. చాలా కాలం విశాలాంధ్ర ప్రచురణాలయం సంపాదకులుగా ఉన్నారు. కమ్యూనిజం పత్రిక సంపాదకవర్గ సభ్యులుగా పని చేశారు.

బలరామమూర్తి మొదట ఆర్.ఎం.ఎస్. (రైల్వే మెయిల్ సర్వీసు) లో ఉద్యోగం చేస్తూ కమ్యూనిస్టు పార్టీ రహస్య పత్రిక 'స్వతంత్ర భారత్' విజయవాడ నుండి శ్రీకాకుళం వరకు అన్ని రైల్వేస్టేషన్లలో కమ్యూనిస్టు అభిమానులకు అందచేస్తుండేవారు. ఈ విషయాన్ని పసిగట్టిన బ్రిటిష్ ప్రభుత్వం శిక్షగా మద్రాసు ఆర్.ఎం.ఎస్. ఆఫీసుకు బదిలీ చేసి ఏ పని యివ్వకుండా జీతం ఇస్తూ ఖాళీగా కూచోబెట్టింది. దీనితో విసుగెత్తి 1940లో ఉద్యోగానికి స్వస్తిచెప్పి బలరామమూర్తి అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయారు. రాయలసీమలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మార్క్సిస్టు సిద్ధాంత శిక్షణ యిచ్చారు. రెండేళ్ళు పాటు (1940-42) గడిపిన అజ్ఞాతవాస జీవితంలో భాగంగా విశాఖ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజరుగా వ్యవహరించారు. 1948 నుండి 1952 వరకు తమిళనాడులోని కడలూరు జైలులో డిటెన్యూగా ఉన్నారు. ఈ జైలు జీవితం ఆయనలోని తాత్విక జిజ్ఞాసను రేకెత్తించి, పఠనాసక్తి పెంపొందించింది. చరిత్ర, తత్వశాస్త్రం ఆయనకు అభిమాన పాత్రమైన జోడు గుర్రాలు. ఏటుకూరి బలరామమూర్తి పుస్తకాలలో ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర, భారతీయ తత్వశాస్త్రం, మన చరిత్ర, ఉపనిషత్ చింతన, భారతీయ సంస్కృతి ప్రముఖమైనవి.



ఏటుకూరి బల రామమూర్తి

కడలూరు జైలులో డిటెన్యూగా వున్న రోజులలో చరిత్ర, తత్వశాస్త్ర గ్రంథాలను అధ్యయనం చేశారు. జైలులో సహచారుల కోసం చరిత్ర, తత్వశాస్త్రాలపై శిక్షణా తరగతులు నడిపారు. మార్క్సిస్టు దృక్పథంతో రాసిన ఆంధ్రుల సంక్షిప్త చరిత్ర ఇప్పటికి డజనుసార్లు పైగా పునర్ముద్రించవలసి వచ్చింది. చరిత్రను బలరామమూర్తి అధ్యయనం చేసిన తీరు చరిత్రను వక్రీకరించే వారి కళ్లు తెరిపిస్తుంది. ఇది రష్యన్ భాషలోకి అనువాదమైంది. 1955లో వెలువడిన "భారతీయ తత్వశాస్త్రం"ప్రాచీన కాలం నుండి ఆధునిక ధోరణుల దాకా భారతీయ తత్వశాస్త్ర వికాసాన్ని శాస్త్రీయ దృష్టితో సమగ్రంగా విశ్లేషిస్తూ సులభ శైలిలో ఆసక్తికరంగా సాగుతుంది.

1992లో భారతీయ సంస్కృతీ పరిణామక్రమంలో సంభవించిన వివిధ ఘట్టాలను, సంఘర్షణలను, సమన్వయాలను, వ్యత్యాసాలను వివరిస్తూ "పుస్తకాన్ని రచించారు. శాస్త్రీయ దృష్టితో భారతీయ సంస్కృతీ పరిణామాన్ని వేదకాలం నుండి ఆధునిక పునర్జీవనోద్యమాల వరకు పరామర్శిస్తూ వెలువడిన "భారతీయ సంస్కృతి" గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం లభించింది. "బౌద్ధం-పుట్టుక-పరిణామం" పేరిట ఒక చారిత్రిక గ్రంథాన్ని రాయ సంకల్పించి రెండు అధ్యాయాలను రాస్తూ విజయవాడలో 1996 ఏప్రిల్ 3న అకస్మాత్తుగా మరణించారు.

-ఆర్వీ

చీలికే మన బలహీనత

ఐక్యతే బలం

చీలికే మన బలహీనత. నేటి పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీలు పునరాలోచించుకోవాలి. చీలికవల్ల ఏమి సాధించామో ఆలోచించుకోవాలి. ఐక్యత ద్వారా ప్రత్యామ్నాయం కాగలము. నాకిప్పుడు 96ఏళ్లు. నేను కమ్యూనిస్టుపార్టీ సభ్యత్వం తీసుకొని 76ఏళ్లు అయింది. కృష్ణాజిల్లా నూజివీడు తాలూకా అన్నవరం శివారు వెంటాద్రిపురం గ్రామంలో 1927వ సంవత్సరంలో వెంకట్రామయ్య, నరసమ్మ దంపతులకు 7వ సంతానంగా జన్మించాను. నా రెండవ సోదరుడు చలసాని రాజగోపాలరావు స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొని పలుసార్లు జైలుకు వెళ్లారు. 1950 మార్చి 19 ఉగాది రోజున పోలీసులు ఆయనను కాల్చి చంపారు. ఆ రోజున మా కుటుంబంలోని అత్యధికులు కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో భాగంగా జైళ్లలో ఉన్నారు. నేను రహస్యదళాలలో సాయుధ పోరాటంలోఉన్నాను.

1943 మార్చి 23న భగత్‌సింగ్ వర్ధంతిరోజు గ్రామంలో యువజన సంఘం స్థాపించి కార్యదర్శిగా ఎన్నికైనాను. యువజన సంఘం ఆఫీసు, గ్రంథాలయం, రాత్రి పాఠశాలలు, యువజన క్రీడలు, ఆటలపోటీలు నిర్వహించాము. 1946లో గ్రామంలో 10మందితో పార్టీశాఖ ఏర్పాటుచేసి నాకు సభ్యత్వం ఇచ్చారు. 1947లో శాఖ కార్యదర్శిగా ఎన్నికైనాను. 1948 మార్చి 16న మద్రాసు ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీని నిషేధించింది. 1948 ఏప్రిల్ 24న మా యింటిపై పోలీసులు పెద్ద ఎత్తున దాడులు చేసి కుటుంబసభ్యులను, నన్ను, రాజగోపాలరావులను అరెస్టు చేశారు. మాకుటుంబంపై నిర్బంధ విధానం అమలు చేశారు. జైలునుంచి వచ్చిన తర్వాత రహస్యజీవితం ప్రారంభించాను. మద్రాసు నుంచి ఒక సైక్లోస్టైల్ మిషన్ తెచ్చి తూర్పుదిగవల్లి గ్రామంలో జగ్గవరం వెంకటకృష్ణారెడ్డి, పాలడుగు సత్యనారాయణ సహకారంతో రహస్యంగా కరపత్రాలు, స్వతంత్ర భారత్ రహస్యపత్రిక ముద్రించి పంపిణీ చేశాము. అదే సమయంలో కొరియర్‌గా పనిచేసి, తెలంగాణ దళ కమాండర్ బొంబాయి ప్రసాద్ రాజమండ్రి జైలు నుంచి తప్పించుకువచ్చి మా వద్ద రక్షణ పొందారు. 1949 అక్టోబరు 23న సూరంపల్లి గ్రామంలో చింతపల్లి పాపారావును పోలీసులు కాల్చి చంపారు. రెండు రోజుల ముందు నేను పాపారావుకు రివాల్వర్ తీసుకువెళ్లి ఇవ్వాలి. కానీ తీవ్ర తుఫాను, గాలి, వర్షం బీభత్సం వల్ల ఇంటినుండి కదలలేని పరిస్థితుల్లో ఇవ్వలేకపోయాను. 1950 మార్చిలో దళంలో సభ్యునిగా కృష్ణా, గుంటూరు జిల్లాలో పలుగ్రామాల్లో జరిగిన దాడులలో పాల్గొన్నాను. తుపాకులు, డబ్బులు సేకరించాము. గుంటూరుజిల్లాలో దాడుల అనంతరం పార్టీతో సంబంధాలు తెగిపోయి మా దళం కొండపల్లి ఫారెస్టులో నా కళ్లముందే ప్రాణాలు కోల్పోయారు. ఒక పగలు, రాత్రి కొండపల్లి అడవుల్లో పోలీసులతో సంఘర్షణలో ఉన్నాము. తుపాకుల కాల్పులతో అడవి దద్దరిల్లిపోయింది. ఆరు రోజుల పాటు కొండపల్లిఅడవిలో ఆకలి, దప్పులు తీరక అల్లాడిపోయాం. 6వ రోజు రాత్రి అన్నవరం అడవికి చేరుకుని మా కుటుంబాన్ని సంప్రదించగా భోజనం, తర్వాత పార్టీతో సంబంధాలు దొరికాయి. అనంతరం కొంతకాలం విజయనగరం వద్ద ఒక ఆశ్రమంలో, కొంతకాలం ఢిల్లీలో ఆంధ్రుడైన ఒకహిందీ మాష్టారి రక్షణలో, హర్యానాలోని ఒక పల్లెలో రహస్యంగా ఉన్నాను. తరువాత గుడివాడ తాలూకాలో ముదినేపల్లి బంధువుల ఇంట ఉండగా పోలీసులు ఆరెస్టుచేసి బళ్లారి జైలుకు 6 మాసాలు శిక్ష నిమిత్తం పంపారు. 1950 జులైలో పార్టీ నిర్బంధం తొలగిన తర్వాత తిరువూరు తాలూకా అట్ల ప్రగడకు చెందిన జయప్రద (చుక్కమ్మ)తో వివాహం జరిగింది. ఆమె కూడా రహస్య దినాలలో పళినియప్పన్ క్యాంపులో చిత్రహింసలు అనుభవించారు.

చలసాని జగన్నాధరావు



నూజివీడు తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా, రాష్ట్ర సమితి సభ్యునిగా (25 ఏళ్లు), రైతుసంఘం జిల్లా కార్యదర్శిగా పనిచేశాను.

మా కుమారులు చలసాని వెంకటరామారావు, రాఘవేంద్రరావులు కూడా కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో కీలక బాధ్యతలు నిర్వహించడం నాకు ఆనందం కలిగిస్తున్నది. మా ఇరువురు కుమార్తెలు పార్టీ సానుభూతి పరులుగా ఉన్నారు. ప్రతిరోజు విశాలాంధ్ర పత్రిక క్రమం తప్పకుండా నేటికీ చదువుతున్నాను. విశాలాంధ్ర పుట్టుకనుంచి నేను పాఠకుడిని. గత సంవత్సరం నా భార్యజయప్రద చనిపోయింది. అప్పటి నుంచి విశాలాంధ్ర పత్రిక నాకు తోడు నీడ. నా పెద్దకోడలు కృష్ణతులసి నన్ను కంటికి రెప్పలా చూస్తున్నది. పార్టీ 6వమహాసభ, 10వ మహాసభ ప్రత్యక్ష ఏర్పాట్లలో ఉన్నాను. బొంబాయి మహాసభకు ప్రతినిధిగా వెళ్లాను. 24వ మహాసభ జయప్రదం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

-చలసాని జగన్నాధరావు

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో యంగ్ కమ్యూనిస్టులీగ్ సహచరులు. వీరిలో చంద్ర రాజేశ్వరరావు కూడా ఉన్నారు

మనుషుల నోళ్ళకు
గడియ పడింది
ముసురుకున్నాయి
చుట్టూ చీకట్లు!

నాలుక ఒక్కటే
ఔనన్నది కాదనీ
ఒకటిని మూడనీ
మారుస్తుంది మాట

- కేశవ్ గోపాల్

పట్టాలు చేతికివ్వండి లేదా జైలు కూడు పెట్టండి

1960 దశకంలో నూజివీడు తాలూకాలో 30కిపైగా గ్రామాలలో కమ్యూనిస్టుపార్టీ నేతృత్వంలో బంజరుభూముల ఆక్రమణ ఉద్యమం జరిగింది. 10వేలకుపైగా భూమిలేని కుటుంబాలను సమీకరించి అటవీ బంజరులు, రెవెన్యూ బంజరులు, కొండ పోరంబోకు భూములను సాగులాయకీ అయిన భూములను పంపిణీ చేశారు. దాసరి నాగభూషణరావు, చలసాని జగన్నాధరావు, బొడ్డు దేవసుందరం, జాలిపర్తి వీర రాఘవయ్య, సుగసాని విశ్వేశ్వరరావు తదితరుల నేతృత్వంలో ఈ ఉద్యమం జరిగింది. కొన్ని గ్రామాలలో ఈ భూములను కాజేయాలని ప్రయత్నిస్తున్న భూస్వాముల నుంచి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవలసి వచ్చింది. ప్రజలు పోరాటపటిమతో వారిపత్తిడిని జయించి ఐక్యంగా భూములను చదును చేసి సాగు చేసుకున్నారు. ఆక్రమించిన భూములను సాగుకు అనుకూలంగా మార్చిన తరువాత ఆ భూములలో 1969 సంవత్సరం వరకు సాగుదార్లు పట్టుదలగా పంటలు పండించారు. సదరు భూముల సాగుదార్లకు పట్టాలు మంజూరు చేయాలని కమ్యూనిస్టుపార్టీ అనేక సందర్భాలలో అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. వినతి పత్రాలు ఇచ్చి, పికెటింగ్, ధర్నా ప్రదర్శనలు జరిపినా ప్రభుత్వం లక్ష్యపెట్టనందున ఒక దీర్ఘకాలిక ఉద్యమం జరపాలని తాలూకాపార్టీ నిర్ణయించింది.

1969వ సంవత్సరం ఆగస్టు 14వతేదీ నూజివీడు తాలూకా బంజరు సాగుదార్లసంఘం మహాసభ నూజివీడులో జరిగింది. ఆగస్టు 16నుంచి బంజరు భూముల అక్రమణ ప్రారంభించాలని దీనితోపాటు గతంలో సాగులో ఉన్న భూములకు పట్టాల సాధనకు పోరాటం ప్రారంభించాలని మహాసభ నిర్ణయించి కార్యాచరణకు ఉపక్రమించింది. 10 గ్రామాలలో 3వేల ఎకరాల భూమి ఆక్రమణ చేయడం జరిగింది. ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలను అమలుచేసి పేదసాగుదార్లను అరెస్టు చేయడం, కేసులుపెట్టి కోర్టులచుట్టూ తిప్పసాగింది. ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతి ఘటించాలని నిర్ణయించిన పార్టీ 1969 సెప్టెంబరు 16వ తేదీ నుంచి ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయంలో సామూహికంగా సత్రాగ్రహదళాలతో ముట్టడించాలని నిర్ణయించి పట్టాలివ్వండి లేదా జైలు కూడు పెట్టండి" అనే నినాదంతో 30 రోజులపాటు ప్రభుత్వ కార్యాలయాలను పనిచేయకుండా సత్యాగ్రహం నిర్వహించారు. ప్రతి రోజు నిర్దేశించిన గ్రామాల నుంచి వందలాది మంది సాగుదార్లు వచ్చి ఉదయం 10 గం.నుండి సాయంత్రం 5గం.వరకు ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధించి పనిచేయకుండా నిరోధించారు. వివిధ సందర్భాలలో స్పెషల్ పోలీసుదళాలు సత్యాగ్రహులపై తీవ్ర లాఠీ ఛార్జీలుచేసినా, పదుల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు గాయపడినా, కాళ్లు,చేతులు విరిగినా ఉద్యమం ఆగలేదు. గత్యంతరంలేని స్థితిలో ప్రభుత్వం నాటి జిల్లా కలెక్టరు సి.ఎస్.శాస్త్రి, ఫారెస్టు కన్సర్వేటరు నూజివీడు వచ్చి అటవీ భూములను, పేదలసాగు పరిస్థితులను పరిశీలించి ఉద్యమ నాయకులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న 7వేల ఎకరాలకు పట్టాలు మంజూరు చేస్తామని, కొత్త ఆక్రమణలను వదులుకోవాలని కోరారు. ఆక్రమణలు వదులుకోవడానికి బంజరు సాగుదార్ల సంఘం తిరస్కరించింది. అనంతరం 7వేల ఎకరాలను ఫారెస్టు నుంచి తొలగించి పట్టాలు మంజూరుచేశారు.

కమ్యూనిస్టుపార్టీ పోరాటాల ద్వారా పంపిణీ చేసిన బంజరుభూముల గుండా నేడు నాగార్జునసాగర్ కాల్వలు వచ్చి నీటివసరులు రావడంతో ఒకప్పుడు తొండలు గుడ్లు పెట్టిన భూములు అని భావించిన ఈ భూములే పేదలకు ఆసరాగా ఉన్నాయి. నేడు ఈ భూముల విలువ 10లక్షల నుంచి 25లక్షల వరకు పలుకుతుంటే అది కమ్యూనిస్టు పార్టీ పెట్టిన భిక్షేనని పేదలు భావించడంలో అతిశయోక్తిలేదు.

- చలసాని వెంకటరామారావు

కొలకలూరి ఇనాక్‌కు మహామహోపాధ్యాయ అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ: ఐడియల్ టీచింగ్ అవార్డ్స్ ప్రోగ్రామ్- 2022 కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు మహామహో పాధ్యాయ బిరుదు ప్రదానం చేయనున్నట్లు రాజారత్నం హెల్త్‌కేర్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ కేఎంఈ జయ, ప్రోగ్రామ్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఆర్‌బీ అంకమ్ తెలిపారు. గతంలో ఈ అవార్డును విద్యావేత్త చుక్కా రామయ్య, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములుకు అందించినట్లు చెప్పారు. అక్టోబరు 2వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లా రామచంద్రాపురంలోని రాజారత్నం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును ఇనాక్‌కు అందజేస్తామని తెలిపారు. ఆ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, తెలంగాణకు చెందిన వకుళాభరణం కృష్ణమోహన్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ఐటీఏపీ-22 అవార్డు గెలుచుకున్న 150 మంది అధ్యాపకులకు అవార్డులు అందించనున్నట్లు వివరించారు.

ఎందుకింత నిర్లక్ష్యం?

108 సేవలపై కృష్ణబాబు తీవ్ర అసంతృప్తి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రోగులకు అత్యవసర సేవలందించడంలో ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం ఆయన 108, 104 పనితీరుపై సమీక్షించారు. 108 సేవలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన, సర్వీస్ ప్రొవైడర్, టెక్నికల్ విభాగాల బాధ్యులు ఏంచేస్తున్నారని నిలదీశారు. రెండు వారాల్లో పనితీరు మెరుగు పర్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో మాదిరి ఇప్పుడెందుకు సేవలందడం లేదని ప్రశ్నించారు. గతంలో సమర్థవంతంగా పని చేసిన ఐటీ విభాగం ఇప్పుడు ఎందుకు కుంటుపడిందని నిలదీశారు. సమర్థవం తంగా పనిచేసే ఐటి పార్టనర్ ను ఏర్పాటు చేసుకోవాలని, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవోను కృష్ణబాబు ఆదేశించారు. అడిషనల్ సీఈవో మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, 108 వాహనాలు రిపేరులో ఉన్నట్లు తెలిపారు. వాటిని బాగు చేయడంలో జాప్యం జరుగుతోందని, వాహనాల బఫర్ స్టాక్ లేకపోవడంవల్లే సేవలు సరిగా అందడంలేదని చెప్పారు.

ఆప్ నేతలను అరెస్టు చేయొచ్చు

గుజరాత్‌లో బీజేపీకి ఓటమి భయం పట్టుకుంది: కేజ్రీవాల్

న్యూదిల్లీ : రాబోయే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతో ఆప్‌ను అణిచివేసేందుకు బీజేపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని, ఆప్ నుంచి ఎవరైనా తప్పుడు ఆరోపణలతో జైలుకెళ్లే అవకాశం ఉందని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం అన్నారు. ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా కూడా నిందితుడిగా ఉన్న దిల్లీ మద్యం పాలసీ కేసులో ఆప్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి విజయ్ నాయర్‌ను సీబీఐ అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మద్యం పాలసీ కుంభకోణంలో తనను ఇరికించేందుకు సిసోడియాకు వ్యతిరేకంగా తప్పుడు ప్రకటన ఇవ్వాలన్న దర్యాప్తు సంస్థ ఒత్తిడికి లొంగకుండా తిరస్కరించిన తర్వాత నాయర్‌ను అనేక దఫాలుగా ప్రశ్నించిన తర్వాత సీబీఐ అరెస్టు చేసిందని కేజ్రీవాల్ డిజిటల్ చిరునామాలో పేర్కొన్నారు. వివరాల ప్రకారం, దేశ రాజధానిలో మద్యం లైసెన్సుల కేటాయింపులో జరిగిన అవకతవకలకు సంబంధించి 'కుమ్మక్కు', 'కుట్ర'లో అతని పాత్రపై నాయర్‌ను అరెస్టు చేశారు. నాయర్ అరెస్టుపై బీజేపీ నేతృత్వంలోని కేంద్రాన్ని నిందించిన కేజ్రీవాల్... 'గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి ప్రజాదరణ ప్రతిరోజూ చాలా వేగంగా పెరుగుతుండటంతో వారు చాలా విసుగు చెందారు. వారు వెర్రివాళ్లయ్యారు. గుజరాత్ ప్రజలు వీధుల్లోకి వచ్చి బీజేపీని బహిరంగంగా విమర్శిస్తున్నారు' అని పేర్కొన్నారు. ఆరోపించిన మద్యం పాలసీ కుంభకోణంతో నాయర్‌కు ఎలాంటి సంబంధం లేదని, అయితే సిసోడియాను కేసులో ఇరికించేందుకు సిసోడియాపై తప్పుడు వాంగ్మూలం ఇవ్వాలన్న వారి ఒత్తిడికి లొంగకపోవడంతో సీబీఐ అరెస్టు చేసిందని ఆప్ జాతీయ కన్వీనర్ తెలిపారు. మొదట, దిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేందర్ జైన్, ఆ తర్వాత ఆప్ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్, ఇప్పుడు నాయర్‌ను 'పూర్తిగా తప్పుడు' ఆరోపణల పై అరెస్టు చేశారని కేజ్రీవాల్ అన్నారు. 'వచ్చే వారం, వారు సిసోడియాను అరెస్టు చేయబోతున్నారు. వారు నాయర్ వంటి చిన్న పార్టీ కార్యకర్తను అరెస్టు చేయగలిగితే, వారు ఎవరినైనా అరెస్టు చేయవచ్చు' అని పేర్కొన్నారు. దేశంలోని ప్రజలకు ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించే బదులు కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం 'మురికి రాజకీయాలు' చేస్తూ వారి సమయాన్ని వృథా చేస్తోందని ఆయన అన్నారు. 'నాయర్ ఒక చిన్న పార్టీ కార్యకర్త, పార్టీ కమ్యూనికేషన్లకు సంబంధించిన పనులను చూసుకునేవారు. అతను పంజాబ్‌లో చాలా బాగా పని చేశాడు. ప్రస్తుతం గుజరాత్ కోసం పార్టీ కమ్యూనికేషన్ వ్యూహాన్ని సిద్ధం చేయడంలో నిమగ్నమై ఉన్నాడు' అని వివరించారు. 'కానీ అతను ఆప్‌కి నిజమైన కార్యకర్త. అబద్ధం చెప్పడానికి నిరాకరించాడు. అందుకే, వారు అతన్ని అరెస్టు చేశారు' అని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆప్ 'రెండవ యుద్ధం'తో పోరాడుతోందని కేజ్రీవాల్ తెలిపారు. దిగ్గజ స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ నుంచి ప్రేరణ పొంది జైలుకు వెళ్లడానికి, అతని 'అత్యున్నత త్యాగాలు' చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని తమ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ఉద్బోధించారు. 'ఇది స్వాతంత్ర్యం కోసం రెండవ పోరాటం. భగత్ సింగ్ బ్రిటీష్ నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడారు. దేశాన్ని దోచుకునే వారి నుంచి, బహిరంగంగా ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే వారి నుంచి స్వాతంత్ర్యం కోసం మనం పోరాడాలి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. 'గత 75 ఏళ్లలో దేశాన్ని మొదట ఒక పార్టీ దోచుకోగా, ఇప్పుడు మరో పార్టీ దోచుకుంది. వారి నుంచి దేశాన్ని కాపాడాలి' అని గతంలో కాంగ్రెస్ పాలనను, ప్రస్తుత బీజేపీ పాలనను పరోక్షంగా ప్రస్తావించారు.

కొత్త సీడీఎస్‌గా చౌహాన్



న్యూదిల్లీ: భారత కొత్త చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ (రిటైర్డ్)ను కేంద్ర ప్రభుత్వం బుధవారం నియమించింది. 2021 డిసెంబర్ 8న తమిళనాడులో జరిగిన ఆర్మీ హెలికాప్టర్ ప్రమాదంలో అప్పటి సీడీఎస్ జనరల్ బిపిన్ రావత్ ఆకస్మిత మృతితో ఆ పదవి ఖాళీ అయిన తొమ్మిది నెలలకు అనిల్ చౌహాన్ నియామకం జరిగింది. అనిల్ చౌహాన్ ప్రభుత్వ కార్యదర్శిగా, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మిలటరీ అఫైర్స్ సైతం చూసుకుంటారని, ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడేంతవరకూ సీడీఎస్‌గా కొనసాగుతారని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన లో తెలిపింది. లెఫ్టినెంట్ జనరల్ అనిల్ చౌహాన్ సుమారు 40 ఏళ్ల సర్వీసులో అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. కమాండ్, స్టాఫ్, ఇన్‌స్ట్రుమెంటల్ అపాయి మెంట్స్ నిర్వహించ డంతో పాటు జమ్ముకశ్మీర్, ఈశాన్య ప్రాంతాల్లో ఉగ్రవాద నిరోధక ఆపరే షన్లు నిర్వహించిన అపారమైన అనుభవం ఉందని రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. 1961 మే 18న జన్మించిన అనిల్ చౌహాన్ 1981లో ఇండియన్ ఆర్మీ 11 గోరా రైఫిల్స్‌లో చేరారు. డెహ్రాడూన్‌లోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ పూర్వ విద్యార్థి కూడా. మేజర్ జనరల్ ర్యాంకులో బారాముల్లా సెక్టార్‌లోని ఇన్‌ఫాంట్రీ డివిజన్ కమాండంట్‌గా వ్యవహ రించారు. ఆ తర్వాత లెఫ్టినెంట్ జనరల్‌గా ఈశాన్య ప్రాంతాల్లో పనిచేశారు. జనరల్ ఆఫీసర్‌గా 2019 సెప్టెంబర్ నుంచి ఈస్ట్రన్ కమాండ్‌కు కమాండింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేశారు. మే 2021న పదవీ విరణమ చేసేంత వరకూ ఆ బాధ్యతల్లో కొనసాగారు. గతంలో అంగోలాలోని యునైటెడ్ నేషన్స్ మిషన్‌కు సేవలు అందించారు. 2021 మే 31న ఆయన పదవీ విరమణ చేశారు. ఆర్మీ నుంచి రిటైర్ అయిన తర్వాత కూడా ఆయన జాతీయ భద్రత, వ్యూహాత్మక అంశాల్లో సేవలు అందించారు. ఆర్మీకి అందించిన విశిష్ఠ సేవలకు గాను "పరమ్ విశిష్ఠ సేవా మెడల్", "ఉత్తమ్ యుధ్ సేవా మెడల్", "అతి విశిష్ఠ సేవా మెడల్" అందుకున్నారు.

నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా

జయంతి సభలో వైసీపీ నేతల ఘననివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహాకవి, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతిని తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయ సాయిరెడ్డి, మంత్రులు తానేటి వనిత, అంబటి రాంబాబు, శాసనమండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, విప్ జంగా కృష్ణమూర్తి, లేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు. విజయ సాయిరెడ్డి మాట్లాడుతూ, 1895లో గుంటూరు జిల్లా వినుకొండలో (నేటి పల్నాడు జిల్లా) ఆయన జన్మించడం జిల్లా ప్రజలందరికి గర్వకారణం అన్నారు. నాటి కాలంలో కులవివక్షతకు వ్యతిరేకంగా, కలమే ఒక ఆయుధంగా తన కవిత్వంతో స్ఫూర్తిని అందించిన వ్యక్తి, మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. జాతీయోద్యమంలో గాని, సామ్యవాద ఉద్యమంలోగాని ఆయన సమాంతరంగా యుద్ధం చేసిన తన కలమే ఆయుధంగా ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని ఇచ్చారన్నారు. కులవివక్షత సమాజానికి మంచిది కాదని తన కవితల ద్వారా చాటి చెప్పారని కొనియాడారు.

హోంశాఖమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ, జాషువా చిన్నతనంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నారని వివరించారు. సమాజంలో సమానత్వాన్ని తీసుకురావడానికి తన కవితలనే ఆయుధంగా మలచిన వ్యక్తి జాషువా అని అన్నారు. బడుగు, బలహీనవర్గాలు, మహిళలకు సమానత్వం కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడుతూ ఎక్కడైతే అవమానాలు పొందారో అక్కడే సత్కారాలు పొందారన్నారు. అంబటి మాట్లాడుతూ, గుర్రం జాషువా జాతి గర్వించదగిన కవి అని ప్రశంసించారు. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లా డుతూ, ఆయనతో వ్యక్తిగత సాన్నిహిత్యం ఉండటం నా అదృష్టమన్నారు. శాసన మండలిలో విప్ డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ, సమసమాజాన్ని ఆశించిన వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. ఎమ్మెల్యేలు అనంత వెంకట రామిరెడ్డి, హఫీజ్ ఖాన్, శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్, కల్పలతారెడ్డి, విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, నారాయణ మూర్తి, కె.రవిచంద్రారెడ్డి, శివశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, పుత్తా ప్రతాప్‌రెడ్డి, జీడీసీ బ్యాంక్ చైర్మన్ ఆర్.రామాంజనేయులు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విశ్వసంపద వెల్ఫేర్ ఫౌండేషన్ వెబ్‌సైట్

విశాలాంధ్ర-విజయవాడ: విశ్వసంపద వెల్ఫేర్ ఫౌండేషన్ వెబ్‌సైట్ (www.vishwasampada.in)ను ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 16 రకాల ప్రోగ్రామ్స్ డిజైన్ చేసి ఆన్‌లైన్ ద్వారా సేవలు అదించడం అభినందనీయం అని అన్నారు. యోగ, మెడిటేషన్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, వేదిక్ మాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ తో పాటు శాస్త్రీయ సంగీతం, భగవద్గీత వంటివి చిన్నపిల్లలు దగ్గర నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి ఉపయోగపడే విధంగా కోర్సులు డిజైన్ చేయడం అద్భుతం అని కితాబిచ్చారు.

ఫౌండర్ బీవీ చంద్రశేఖరరావు మాట్లాడుతూ, జ్ఞానాన్ని కాల్చలేము, చించలేము, పడేసుకోలేము అటువంటి జ్ఞానాన్ని అందరికీ అందివ్వడమే తమ ఫౌండేషన్ ధ్యేయం అని తెలియజేశారు. స్కూల్, కాలేజీ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు ఫౌండేషన్ ద్వారా ఇవ్వడానికి వై.ఆరుద్ర సంసిద్ధత వ్యక్తపరిచారు.

విశాల్ ఇంటిపై రాళ్లదాడి... అభిమానుల ఆందోళన

చెన్నై: తమిళంతోపాటు తెలుగులోనూ మంచి పాపులారిటీ ఉన్న కోలీవుడ్ నటుల్లో విశాల్ ఒకరు. వరుసగా పోరాట చిత్రాలతో తమిళ, తెలుగు ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అంతేకాకుండా.. ఏ విషయం గురించైనా ఎలాంటి బెరుకు లేకుండా మాట్లాడుతుంటాడు. దీంతో తరచుగా ఇబ్బందుల్లో పడుతుంటాడు. తాజాగా విశాల్ ఇంటిపై గుర్తు తెలియని కొందరు దుండగులు రాళ్లతో దాడి చేశారు. దీంతో ఆయన ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం ఈ ఘటన తమిళనాడు సినీ, రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. విశాల్ కొంతకాలంలో చెన్నైలోని అన్నానగర్‌లో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలోని కొందరూ వ్యక్తులు ఎరుపు రంగు కారులో వచ్చి విశాల్ ఇంటిపై రాళ్ల దాడి చేశారు. దుండగులు దాడి చేస్తున్న సమయంలో విశాల్ ఇంట్లో లేడని తెలుస్తోంది. అయితే.. కారు విషయాన్ని సీసీటీవీ ఫుటేజీ ద్వారా తెలుసుకున్న విశాల్, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సినీ పరిశ్రమలో విశాల్ అంటే పడనివారే ఇలా చేశారా.. లేక ఇతర కారణాలు ఏమైన ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే.. తమిళ చిత్ర పరిశ్రమ నడిగర్ సంఘానికి విశాల్ ప్రస్తుతం జనరల్ సెక్రటరీగా ఉన్నాడు. అలాగే.. ఇటీవలే రాజకీయాల్లోకి రావాలని ప్లాన్ చేస్తున్నట్లు కూడా చెప్పుకొచ్చాడు. విశాల్ ఇంటిపై దాడి విషయం తెలిసిన ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఈ దాడికి పాల్పడిన త్వరగా పట్టుకుని.. శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పోలీసులు ఈ కేసుని వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. విశాల్ ప్రస్తుతం ప్రస్తుతం 'లాఠీ', తుప్పరివాళన్ 2, మార్క్ ఆంటోని వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నాడు.

మహేశ్‌కు మాతృవియోగం

హైదరాబాద్: టాలీవుడ్‌లో మరో విషాదం చోటు చేసుకుంది. సూపర్ స్టార్ మహేశ్‌బాబుకు మాతృవియోగం కలిగింది. సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ సతీమణ ఇందిరా దేవి బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, నివాసంలోనే తుది శ్వాస విడిచారు. కృష్ణా-ఇందిరాదేవికి ఐదుగురు సంతానం. రమేశ్ బాబు, మహేశ్ బాబు, పద్మావతి, మంజుల, ప్రియదర్శిని. ఇందిరాదేవి మృతితో ఘట్టమనేని కుటుంబంతో పాటు..టాలీవుడ్ ఇండస్ట్రీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇందిరాదేవి పుట్టినరోజున, మదర్స్ డే రోజున, విమెన్స్ డే రోజున మహేశ్ ప్రత్యేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తనకు తల్లి పట్ల ఉన్న మమకారాన్ని అభిమానులతో పంచుకునేవారు. కాగా, ఇటీవల కాలంలోనే...విజయ నిర్మల, రమేశ్ బాబు మృతితో దిగాలు చెందుతున్న ఘట్టమనేని ఫ్యామిలీలో.. ఇప్పుడు ఇందిరాదేవి మరణం మరింత బాధాకరమైన విషయం. ఇందిర మృతి వార్త విన్న సినీ పరిశ్రమ సంతాపం తెలిపింది. నటులు, నిర్మాతలు, డైరెక్టర్లు, క్యారెక్టర్ ఆరిస్టులు ఇందిర భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. బుధవారం మధ్యాహ్నం ఇందిరా దేవి అంత్యక్రియలు జరిగాయి.

ఆయన చెబితే... కళ్లుమూసుకొని చేసేయొచ్చు

హైదరాబాద్: నటనపై ఉన్న ఇష్టం, ఎంతకైనా కష్టించే తత్వం... ఇవి రెండే సత్యదేవ్‌ను నటుడిగా నిలబెట్టాయి. చిన్న పాత్రలతో కెరీర్ మొదలైనా, అనతికాలంలోనే ప్రేక్షకుల మనసులపై చెరగని ముద్ర వేశారు. జయాపజయాలతో సంబంధం లేకుండా నటుడిగా ఒక్కో మెట్టు ఎక్కుతూ వస్తున్న సత్యదేవ్ 'గాడ్‌ఫాదర్' చిత్రంలో చిరంజీవితో కలసి తెరను పంచుకున్నారు. ఈ చిత్రం అక్టోబరు 5న విడుదలవుతోంది. చిరంజీవి మెగాస్టార్ అవడానికి ఎంత కష్టపడ్డారో సెట్‌లో చూస్తే తెలిసింది. ఆయన చాలా క్రమశిక్షణ గల వ్యక్తి. ఉల్లాసంగా ఉంటారు. సెట్ అంతటా తిరుగుతూ అన్నీ చూసుకుంటారు. డైలాగ్స్ ప్రిపేరవుతారు. ఆయన ఇచ్చే సలహా, సూచనకి 45 ఏళ్ల అనుభవం ఉంది. అందుకే ఆయన చెబితే కళ్లుమూసుకోని చేసేయవచ్చు. ఫలితం తెరపై కనిపిస్తుంది. చిరంజీవి ఒకరోజు లంచ్‌కి పిలిచారు. వెళ్లాక సినిమా కథ చెబుతున్నారు. ఆయన నాకు కథ చెప్పడం ఏంటని ఆశ్చర్యంగా చూస్తున్నాను. 'నాకేం అర్థం కావడం లేదన్నయ్యా, మీరు నాకు సినిమా కథ చెప్పడం ఏమిటి?. మీరు చేయమంటే 'గాడ్‌ఫాదర్'లో చేసేస్తాను' అని చెప్పాను. ఆ క్షణం చాలా గొప్పగా అనిపించింది. 'ఈ సినిమా మాతృక చూశావా' అని అడిగారు. 'చూడలేదు... చూడకుండానే చేసేస్తాను' అన్నాను. నటిస్తున్నప్పుడు మాత్రం ఆ పాత్రలో చాలా లోతు ఉందని అర్థమైంది.

'అసెంబ్లీ సాక్షిగా నా పోరాటం' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-హైదరాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట రెడ్డి రచించిన 'అసెంబ్లీ సాక్షిగా నా పోరాటం' అనే పుస్తకాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం శాసనసభ భవనంలోని కమిటీ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాసనసభ విలువలు కాపాడిన వ్యక్తి, తన అనుభవాలను ముందు తరాలకు తెలియ జేయాలన్న ఉద్యేశంతో పుస్తక రూపంలో తీసుకువచ్చిన వెంకటరెడ్డిని అభినందించారు. సందర్భాన్ని బట్టి మాట్లాడే సభ్యుల తీరును బట్టి సభా సమావేశాల సరళి ఉంటుందని అన్నారు. తాను మొదటిసారి శాసనసభ్యుడు అయినప్పుడు సీనియర్ల ప్రసంగాలను జాగ్రత్తగా వినేవాడిని అని గుర్తు చేసుకున్నారు. విలువలతో కూడిన అంశాలపై మాట్లాడే వ్యక్తులు కమ్యూనిస్టులు అని, వారి ప్రసంగాలలో అసందర్భ వ్యాఖ్యలు ఉండవని కొనియాడారు. పబ్లిసిటీ కోసం కాకుండా ప్రజా సమస్యలపై మాట్లాడతారని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్ రావు, రాజ్యసభ ఎంపీ సురేశ్ రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి, చాడ వెంకట రెడ్డి, లెజిస్లేటివ్ సెక్రటరీ వీ నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

'టాప్'లేపిన సూర్య

అక్షర్, హార్దిక్ మరింత ముందుకు

ముంబై: ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ మిస్టర్ 360 ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్.. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్‌ను అధిగమించి రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో టీ20లో కేవలం 36 బంతుల్లో 69 పరుగులతో రాణించిన సూర్య.. తన ర్యాంకు మెరుగుపర్చుకున్నాడు. ఈ సిరీస్‌లో భారత్ 2-1తేడాతో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో బాబర్ ఆజామ్ టీ20ల్లో రెండో సెంచరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే సెంచరీ చేసినప్పటికీ అతను తన రెండో స్థానాన్ని కోల్పోయి మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో బాబర్ సహచర ఓపెనర్ మహ్మద్ రిజ్వాన్ మంచి ఫామ్ కనబర్చుతూ తిరిగి తన అగ్రస్థానాన్ని స్థిరపరుచుకున్నాడు. ప్రస్తుతం పాకిస్థాన్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఏడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ 2-2తో సమం అయింది.

టాప్ 20లోకి దూసుకొచ్చిన అక్షర్ పటేల్

ఇకపోతే ఆస్ట్రేలియా కెప్టెన్ ఆరోన్ ఫించ్ భారత్‌తో జరిగిన రెండో టీ20లో 31పరుగులతో రాణించడంతో అతను నెం.5స్థానానికి ఎగబాకాడు. అదే సమయంలో బౌలింగ్ జాబితాలో ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ ఇప్పుడు నం.18 స్థానానికి చేరుకున్నాడు. ఆడమ్ జంపా ఆరోస్థానానికి చేరు కోగా, భువనేశ్వర్ కుమార్ 10వ స్థానానికి పడిపో యాడు. భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భువీ ఆకట్టుకునే ప్రదర్శన చేయలేకపోయిన సంగతి తెలిసిందే.

ఆల్ రౌండర్ల లిస్టులో హార్దిక్ పాండ్యా

ఇకపోతే ఆల్‌రౌండర్ల చార్ట్‌ల్లో.. ఆఫ్ఘనిస్తాన్ కెప్టెన్ మహ్మద్ నబీ, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్‌ను దాటి నంబర్ 1 పొజిషన్‌కు చేరుకున్నాడు. ఇక ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల లిస్టులో టాప్ ఫోర్‌లోకి ప్రవేశించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన చివరి రెండు టీ20లలో పాండ్య 9, 25 నాటౌట్ ప్రదర్శనలు కనబరిచాడు. ప్రస్తుతం శ్రీలంక స్టార్ స్పిన్నర్ వనిందు హసరంగా కూడా నాలుగో స్థానంలోనే ఉన్నాడు. అయితే ముందుగా వనిందు హసరంగా 184పాయింట్లు కలిగి ఉండడంతో అతన్ని 4వ ర్యాంకుగా, హార్దిక్‌ను 5వ ర్యాంకుగా టేబుల్లో పేర్కొన్నారు.

సూర్యకుమార్ యాదవ్ దండయాత్ర

నంబర్ 4లో భారత్‌కు ఎలాంటి ప్లేయర్ కావాలో అలాంటి ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్. నయా మిస్టర్ 360.. కుదురుకుంటే ఎంతటి మ్యాచ్ అయినా వన్ సైడ్ కావాల్సిందే.

ఇక సిరీస్ డిసైడర్ అయిన ఆసీస్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో కీలక సమయంలో బ్యాటింగ్ దిగిన సూర్య.. వచ్చీ రాగానే హిట్టింగ్ మొదలెట్టకుండా కాసేపు జాగ్రత్తగానే ఆడాడు. కాస్త కుదురుకున్నాక ఆసీస్ బౌలర్లకు తన మాస్టర్ క్లాస్ షాట్ల రుచి చూపించాడు. సూర్య ఉన్నంత సేపు ఆసీస్ బౌలర్లు లయ తప్పినట్లే కన్పించింది. ఫలితంగా స్కోరు బోర్డు ఎక్కడా ఆగకుండా అమాంతం దూసుకెళ్లింది. సూర్య (69పరుగులు 36బంతుల్లో 5ఫోర్లు, 5సిక్సర్లు) విధ్వంసం.. కోహ్లీ అండగా సాగింది. ఇక అతను ఔటయినప్పటికీ.. అప్పటికీ భారత్ ఛేజింగ్‌కు అనువైన స్కోరును కలిగి ఉండేలా చేశాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.